జాతీయ తెలుగు దినపత్రిక www.mediatodaydaily.com

# మీడియా టుడే

మన మీడియా - మన సమాజం

AWJA NEWS | N 24 NEWS | MEDIA TODAY

Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Rajamandri, Chittur, Visakhapatnam prakasham

సంపుటి : 01 సంచిక : 207 CHAIRMAN : K.KOTESWAR RAO(KKR) బుధవారం 28-10-2026 పేజీలు 15 వెల 5/-

### హైదరాబాద్‌కు సింగూర్ జలాల తరలింపు ఆపకపోతే

## బరాబర్ అడ్డుకుంటాం..

### రఘునందన్ వార్నింగ్



**సంగారెడ్డి మీడియా టుడే**

హైదరాబాద్‌కు సింగూరు జలాల తరలింపును నిలిపివేయాలని బీజేపీ మెదక్ ఎంపీ రఘునందన్ రావు డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని మంత్రులకు వివరించామని పేర్కొన్నారు. సంగారెడ్డిలో మంగళవారం మీడియాతో ఆయన మాట్లాడారు. హైదరాబాద్‌కు నీటి సరఫరాకు గండిపేట, హిమాయత్ సాగర్, నాగార్జున సాగర్, ఎల్లంపల్లి ఉన్నాయని.. కానీ మూడు టీఎంసీలు మాత్రమే నీటి నిల్వ ఉన్న సింగూర్ నుంచి హైదరాబాద్‌కు నీరు ఇవ్వడం సరికాదని అన్నారు. 25 టీఎంసీలు ఉన్న సింగూర్‌ను మరమ్మతుల పేరుతో మూడు టీఎంసీలకు ప్రభుత్వం తీసుకువచ్చిందని పేర్కొన్నారు. డెడ్ స్టోరేజీ పోగా రెండు టీఎంసీలు మాత్రమే ప్రస్తుతం సింగూర్‌లో ఉన్నాయని రఘునందన్ రావు ప్రస్తావించారు. సంగారెడ్డి, మెదక్ , కామారెడ్డి జిల్లాల తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని హైదరాబాద్‌కు సింగూర్ నీటి సరఫరాను నిలిపివేయాలని కోరారు.

### ఎల్‌నినో ప్రభావంతో అన్ని ప్రాజెక్టులు

# ఎండిపోయే ప్రమాదం

### మంత్రి పొంగులేటి



**సంగారెడ్డి అక్టోబరు 27 : మీడియా టుడే**

ఎల్‌నినో ప్రభావంతో రాబోయే రోజుల్లో అన్ని ప్రాజెక్టులు ఎండిపోయే ప్రమాదం ఉందని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వ్యాఖ్యానించారు. రైతులు చాలా అనుభవజ్ఞులని.. ఈ కరువుపై దృష్టి పెట్టి రెండో పంటను వేయొద్దని కోరారు. ప్రతిపక్షాలు కూడా ఉన్న వాస్తవాన్ని అన్నదాతలకు చెబితే బాగుంటుందని పేర్కొన్నారు. మంగళవారం సంగారెడ్డిలో మంత్రులు పొంగులేటి, దామోదర రాజనర్సింహ, వివేక్ వెంకటస్వామి పర్యటించారు. ఈ సందర్భంగా సంగారెడ్డిలోని జడ్పీ హాల్లో ఉమ్మడి మెదక్ జిల్లా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రులు, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాల కలెక్టర్లు, ఎంపీ రఘునందన్ రావు, ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడారు. ధరణిని బంగాళాఖాతంలో వేసి భూ భారతిని తీసుకువచ్చామని వెల్లడించారు. 125 ఏళ్ల క్రితం పూర్తి భూ సర్వే జరిగితే... మళ్లీ ఇప్పుడు భూముల రీ సర్వే చేస్తున్నామని మంత్రి పొంగులేటి వివరించారు. 380 గ్రామాల్లో ఇప్పటివరకు పూర్తిగా భూ సర్వే పూర్తి అయిందని తెలిపారు. సర్వే పూర్తయిన గ్రామాల్లో వారికి భూమి హక్కు పత్రాలు ఇచ్చామని స్పష్టం చేశారు. 900 గ్రామాల్లో భూ సర్వే చివరి దశకు వచ్చిందని ప్రస్తావించారు. ఏడాదిన్నరలోపు తెలంగాణలో ఈ భూ సర్వే పూర్తవుతుందని చెప్పుకొచ్చారు. వివాదరహితమైన భూములను రాబోయే తరానికి అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఉద్ఘాటించారు. ఆధార్ ఎలా ఉందో భూదార్ అలా ఉండబోతుందని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో కట్టుకునే ఇళ్లకు కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు రావడం ఆలస్యమైందని మంత్రి పొంగులేటి అన్నారు. తాజాగా కేంద్రం 2 లక్షల ఇళ్లను మంజూరు చేసిందని తెలిపారు. కేసీఆర్ హయాంలో కట్టిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు బొమ్మలకు మాత్రమే పరిమితం అయ్యాయని విమర్శించారు. తమది ప్రజాప్రభుత్వమని.. ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి పేదవాడికి రక్షణ ఉంటుందని వ్యాఖ్యానించారు. బుధవారం అఖిలపక్ష సమావేశం జరగుతుందని వెల్లడించారు. అఖిలపక్షంతో కలిసి కేంద్ర ప్రభుత్వ పెద్దలను త్వరలోనే కలుస్తామని తెలిపారు. తెలంగాణకు రావాల్సిన నిధులపై ప్రతిపక్షాలను తీసుకుని ఢిల్లీకి వెళ్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.

## 365 మండలాలు కరువు ప్రాంతాలుగా ప్రకటన



**హైదరాబాద్, అక్టోబర్ 27: మీడియా టుడే**

తెలంగాణ రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. ఖరీఫ్-2026 సీజన్‌కు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం తాజాగా కీలక ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 31 జిల్లాల పరిధిలోని 365 మండలాలను కరువు ప్రభావిత మండలాలుగా ప్రకటించింది. ఇందులో 111 మండలాలు తీవ్ర కరువు ప్రభావిత మండలాలు ఉండగా, మరో 254 మండలాలు మధ్యస్థ కరువు మండలాలుగా ఉన్నాయని ప్రభుత్వం తెలిపింది. గత ఏడాదితో పోలిస్తే జూన్ 1 నుంచి సెప్టెంబర్ 30 వరకు కురవాల్సిన వర్షపాతంలో భారీగా కోత పడింది. సాధారణంగా రాష్ట్రంలో 740.6 మి.మీ. వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, కేవలం 615.5 మి.మీ. మాత్రమే పడింది. అంటే సుమారు 17 శాతం తక్కువ వర్షపాతం నమోదైంది. ఎల్‌నినో ప్రభావం, బలహీనపడిన అల్పపీడన వ్యవస్థల కారణంగా దీర్ఘకాలిక వర్షాభావం ఏర్పడి పంటలను దెబ్బతీసింది. ఫలితంగా వరి సాగు విస్తీర్ణం భారీగా తగ్గి, 69.19 లక్షల ఎకరాల నుంచి 57 లక్షల ఎకరాలకు పరిమితమైంది. ఈ కరువు పరిస్థితుల్లో రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టింది. కరువు ప్రభావిత మండలాల్లోని రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ అందించడంతో పాటు, వ్యవసాయ పెట్టుబడి సాయాన్ని డీబీటీ (డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్) ద్వారా నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేయాలని ఆదేశాలు జారీ చేసింది. అంతేకాకుండా, తాగునీరు, పశుగ్రాసం కొరత తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపట్టడంతో పాటు, ఉపాధి హామీ పథకం కింద అదనంగా మరో 50 రోజుల పని కల్పించాలని ప్రతిపాదించారు. కేంద్ర సహాయం కోసం నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫండ్ నిధులకై మెమోరాండం సమర్పించనున్నట్లు రేవంత్ సర్కార్ వెల్లడించింది. క్షేత్రస్థాయిలో కరువు తీవ్రతను అంచనా వేసేందుకు కేంద్ర బృందాన్ని పంపాలని కోరింది. ఈ కరువుకు సంబంధించి విడుదలైన ఉత్తర్వ్యాలు రాబోయే ఆరు నెలల పాటు అమల్లో ఉంటాయని, దీనికి సంబంధించిన జాబితాను జిల్లా గెజిట్లలో ప్రచురించాలని అన్ని జిల్లాల కలెక్టర్లను రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది.

## కాంగ్రెస్ క్షమాపణ చెప్పాలి: కిరణ్ రిజిజు

### చైనా చొరబాటు అంటూ తప్పుడు ప్రచారం..





**న్యూఢిల్లీ, అక్టోబర్ 27 : మీడియా టుడే**

అరుణాచల్ ప్రదేశ్‌లో చైనా చొరబడిందంటూ సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం జరుగుతోందని, దీనిపై కాంగ్రెస్ పార్టీ దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు డిమాండ్ చేశారు. చైనా వాహనాలు భారత భూభాగంలోకి ప్రవేశించాయని, అరుణాచల్ ప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాలపై చైనా నియంత్రణ సాధించిందని, సరిహద్దుల్లో విధులు నిర్వహిస్తున్న భారత సైనికులకు అవసరమైన సరఫరాలు అందడం లేదని సోషల్ మీడియాలో కొన్ని వీడియోలు ప్రచారంలోకి వచ్చాయి. ఆ వీడియోలను కాంగ్రెస్ అధికార ప్రతినిధి రీతూ చౌధురి తన సోషల్ మీడియా ఖాతాలో పోస్ట్ చేశారు. ఈ వీడియోలు నిజమైనవి కావని భారత సైన్యం తేల్చి చెప్పింది. అరుణాచల్ ప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాలను చైనా స్వాధీనం చేసుకుందని సీనియర్ సైనిక అధికారి లెఫ్టినెంట్ జనరల్ గిరీష్ కాళియా చెప్పినట్లు ప్రచారమైన వీడియోను భారత సైన్యం ఖండించింది. ఆ వీడియోను ఏఐ సాయంతో మార్పులు చేసి రూపొందించినట్లు స్పష్టం చేసింది. గతంలో జరిగిన మీడియా సమావేశానికి సంబంధించిన దృశ్యాలకు తప్పుడు వ్యాఖ్యలను జోడించినట్లు వెల్లడించింది. అలాగే, చైనా వాహనాలు భారత భూభాగంలోకి అక్రమంగా ప్రవేశించాయని పేర్కొంటూ జరిగిన ప్రచారంపై కూడా సైన్యం వివరణ ఇచ్చింది . సిక్కింలోని నాథు లా వద్ద అనుమతితో జరిగే సరిహద్దు వాణిజ్యానికి సంబంధించిన వాహనాల దృశ్యాలను తప్పుదోవ పట్టించే విధంగా చూపించినట్లు తెలిపింది. సున్నితమైన సరిహద్దు అంశాలపై నిర్ధారణ లేని సమాచారాన్ని ప్రచారం చేయడం వల్ల ప్రజల్లో అనవసర ఆందోళన ఏర్పడుతుందని, ఇలాంటి చర్యల వల్ల సరిహద్దుల్లో విధులు నిర్వహిస్తున్న సైనికుల మనోధైర్యంపై ప్రభావం పడే ప్రమాదం ఉందని కిరణ్ రిజిజు అన్నారు. సరిగ్గా నిర్ధారించుకోకుండా కేంద్ర ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాలనే తపనతో తప్పుడు వీడియోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన కాంగ్రెస్ పార్టీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

## రామ్‌లీలా మైదానంలో కాంగ్రెస్ సభకు అనుమతి..



**న్యూఢిల్లీ, అక్టోబర్ 27 : మీడియా టుడే**

దేశ రాజధాని ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో నవంబర్ 1న భారీ బహిరంగ సభ నిర్వహించేందుకు కాంగ్రెస్ పార్టీకి ఢిల్లీ పోలీసులు అనుమతి ఇచ్చారు. అయితే ఈ సభకు సంబంధించి పలు నిబంధనలు విధించారు. సభ సాయంత్రం 5 గంటల్లోగా ముగించాలని, రామ్‌లీలా మైదానంలో రాత్రి ఎవరూ బస చేయకూడదని స్పష్టం చేశారు. సీసీటీవీ కెమెరాలు, తాగునీరు, మరుగుదొడ్లు, స్వచ్ఛంద సేవకుల ఏర్పాట్లు తప్పనిసరిగా చేయాలని నిర్వాహకులకు సూచించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ (ఎస్‌ఐఆర్), ఎన్నికల నిర్వహణలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై కాంగ్రెస్, ఇతర విపక్ష పార్టీలు నిరసన కార్యక్రమాలు చేపడుతున్నాయి. ఈ నేపథ్యంలో నవంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో భారీ సభ నిర్వహించాలని కాంగ్రెస్ నిర్ణయించింది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సహా పలువురు విపక్ష నేతలు ఈ కార్యక్రమంలో పాల్గొనే అవకాశం ఉంది. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది. రామ్‌లీలా మైదానంలో సభ నిర్వహణకు సంబంధించి ఢిల్లీ పోలీసులు అనుమతి ఇచ్చారు. అయితే మైదానం యాజమాన్య సంస్థ నుంచి అవసరమైన అనుమతి పొందడంతో పాటు, పోలీసుల నిబంధనలను పాటించాల్సి ఉంటుంది. సభను ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే నిర్వహించాలి. కార్యక్రమం ముగిసిన వెంటనే సభకు వచ్చినవారు మైదానం నుంచి వెళ్లిపోయేలా ఏర్పాట్లు చేయాలి. సభకు ముందు, సభ సమయంలో లేదా అనంతరం ఎవరూ అక్కడ రాత్రి బస చేయడానికి వీల్లేదు. సభలో భద్రతను పర్యవేక్షించేందుకు కీలక ప్రదేశాల వద్ద హైడెఫినిషన్ సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయాలని పోలీసులు ఆదేశించారు (హ×= ఛశీత్‌తీశీజవతీంఎ). ప్రజల మధ్య విద్వేషాలు, ఉద్రిక్తతలు సృష్టించే ప్రసంగాలు చేయకూడదు. ఎవరైనా రెచ్చగొట్టే లేదా బెదిరింపు వ్యాఖ్యలు చేస్తే, నిర్వాహకులు వెంటనే మైకులు నిలిపివేసి సంబంధిత వ్యక్తిని వేదిక నుంచి తొలగించాల్సి ఉంటుంది. రామ్‌లీలా మైదానం నుంచి మరే ఇతర ప్రాంతానికీ ఊరేగింపుగా వెళ్లడానికి అనుమతి లేదని పోలీసులు పేర్కొన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉందని హెచ్చరించారు.

### రాజీవ్ ప్రధాని కావడాన్ని

# వ్యతిరేకించా..

### సోనియా గాంధీ కీలక వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ, అక్టోబర్ 27 : మీడియా టుడే**

కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ తన జీవిత విశేషాలను పుస్తక రూపంలో తీసుకురానున్నారు. ఇప్పటి వరకు తనపై ఎన్నో రకాల కల్పిత కథనాలు, అతిశయోక్తులు ప్రచారంలోకి వచ్చాయని, అందుకే తన కథను వాస్తవాలతో ప్రపంచం ముందుంచేందుకు 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' పేరుతో ఆత్మకథ రాసినట్లు ఆమె వెల్లడించారు.

ఈ పుస్తకం నవంబర్ 10న పాఠకుల ముందుకు రానున్న నేపథ్యంలో.. సోనియా గాంధీ కీలక వ్యాఖ్యలు చేశారు. సోనియా గాంధీ మాట్లాడుతూ.. 'నాపై చాలా మంది చాలా రకాలుగా రాశారు. వాటిలో చాలా వరకు సత్యదూరమైనవి లేదా కల్పితమే. అందుకే నా కథను, వాస్తవాలను నా కోణంలో చెప్పాలనిపించింది. ఈ పుస్తకం వస్తే కొందరి అభిప్రాయాలు మారవచ్చు. మరికొందరిలో వ్యతిరేకత రావచ్చు. ప్రజా జీవితంలో ఉన్నప్పుడు ఇవన్నీ సహజమే' అని సోనియా గాంధీ పేర్కొన్నారు. ఈ పుస్తకంలో దివంగత ప్రధాని ఇందిరా గాంధీ హత్య తర్వాత రాజీవ్ గాంధీ ప్రధానమంత్రి పదవిని చేపట్టడాన్ని తాను తీవ్రంగా వ్యతిరేకించినట్లు సోనియా గాంధీ తెలిపారు. 1965లో ఇంగ్లాండ్‌లోని కేంబ్రిడ్జ్‌లో ఓ చిన్న గ్రీకు రెస్టారెంట్‌లో రాజీవ్ గాంధీతో తన ప్రేమ ఎలా ప్రారంభమైందనే మధురమైన జ్ఞాపకాల ను కూడా ఈ సందర్భంగా ఆమె గుర్తుచేసు కున్నారు. తొలి పరిచయంతోనే రాజీవ్‌తో ప్రేమలో పడ్డానని, ఆ తర్వాత ఇద్దరి మనసు లు కలిశాయని తెలిపారు. తామిద్దరం అంద మైన జ్ఞాపకాలతో నిండిన ఒక ప్రపంచాన్ని సృష్టించుకున్నామని, నవంబర్ 10న, ఆ ప్రపంచాన్ని మీతో పంచుకుంటు న్నానని సోనియా గాంధీ అన్నారు. అంతర్జాతీయ ప్రచు రణ సంస్థ 'ఆల్ఫ్రెడ్‌ఎనాఫ్' ఈ పుస్తకాన్ని ప్రపంచ వ్యాప్తంగా తీసుకువస్తుండగా, భారతదే శంలో 'హార్పర్ కాలిన్స్ ఇండియా' సంస్థ దీనిని విడుదల చేయనుంది.

### వరికి బదులు ప్రత్యామ్నాయ

# పంటలు వేయాలి: మంత్రి

- వానాకాలం పంటను కాపాడాలి
- తుమ్మల నాగేశ్వరరావు అధ్యక్షతన కరువు పరిస్థితులపై సమీక్ష
- వచ్చే జూలై వరకు తాగునీటికి ఇబ్బందులు రాకూడదు
- నీటి సంరక్షణ, పశుగ్రాసం కొరత నివారణకు చర్యలు



**ఖమ్మం, అక్టోబర్ 27: మీడియా టుడే**

ఎల్‌నినో ప్రభావం, వర్షపాతం లోటు నేపథ్యంలో ప్రస్తుత వానాకాలం పంటను కాపాడటంతో పాటు రాబోయే యాసంగి సీజన్‌లో నీటి లభ్యతను బట్టి పంటల సాగు చేపట్టేలా రైతులకు అవగాహన కల్పించాలని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. యాసంగిలో వరి సాగుకు బదులుగా పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, కూరగాయలు వంటి తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటలపై రైతులు దృష్టి సారించాలని సూచించారు. ఖమ్మం కలెక్టరేట్‌లో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల కలెక్టర్లు దివాకర టీఎస్, అంకిత్‌తో కలిసి ఆయన కరువు పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావం, వ్యవసాయ రంగంపై పడే ప్రభావాలపై సమీక్ష నిర్వహించారు. భవిష్యత్తులో నీటి కొరత వల్ల రైతులు ఇబ్బందులు ఎదుర్కోకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. వచ్చే ఏడాది జూలై వరకు ప్రజలకు తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ముందస్తు కార్యాచరణ రూపొందించాలని మంత్రి సూచించారు. తాగునీటి అవసరాలకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని, అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థంగా వినియోగించుకోవాలని తెలిపారు. భూగర్భ జలాలు తగ్గుతున్న నేపథ్యంలో నీటి వినియోగంపై నిరంతర పర్యవేక్షణ అవసరమని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నీటి లభ్యతను అంచనా వేసి, అవసరమైన చోట ప్రత్యామ్నాయ ఏర్పాట్లు సిద్ధం చేయాలని ఆదేశించారు. గతంలో అమలులో ఉన్న తాగునీటి పథకాలు పనిచేయని పరిస్థితుల్లో వాటిని గుర్తించి పునరుద్ధరించాలని, ప్రజలకు తాగునీరు అందించే విషయంలో శాఖల మధ్య సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రస్తుత పంటలను కాపాడేందుకు వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో రైతులకు అందుబాటులో ఉండాలని మంత్రి ఆదేశించారు. నీటి లభ్యత, నేల స్వభావం, వాతావరణ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని పంటల ఎంపిక చేసుకునేలా రైతులకు సూచనలు అందించాలని తెలిపారు. నీటి సంరక్షణ పనులను వేగవంతం చేయడంతో పాటు వర్షపు నీటిని నిల్వ చేసుకునే చర్యలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. సాగునీటిని పొదుపుగా వినియోగించే పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించాలని, అవసరానికి మించి నీటిని వినియోగించకుండా చూడాలని సూచించారు. వ్యవసాయంతో పాటు గృహ అవసరాల్లోనూ నీరు, విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవడం ద్వారా భవిష్యత్తులో ఎదురయ్యే సమస్యలను కొంతవరకు తగ్గించవచ్చని పేర్కొన్నారు.

కరువు పరిస్థితులు పశుసంపదపై ప్రభావం చూపకుండా పశుగ్రాసం కొరత నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. పశువులకు అవసరమైన మేత అందుబాటులో ఉండేలా ప్రణాళిక రూపొందించాలని, రైతులకు ఎదురయ్యే ఇబ్బందులను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించాలని తెలిపారు. పత్తి, ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, రైతులకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. విద్యుత్ వినియోగంలోనూ పొదుపు పాటించాలని, వ్యవసాయ అవసరాలు, తాగునీటి సరఫరా వంటి కీలక రంగాలకు సంబంధించిన ఏర్పాట్లపై సమన్వయంతో వ్యవహరించాలని సూచించారు. కరువు ప్రభావాన్ని తగ్గించేందుకు సంబంధిత శాఖలన్నీ ముందస్తు కార్యాచరణతో పనిచేయాలని స్పష్టం చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో భూగర్భ జలమట్టాలు సుమారు 3.5 మీటర్లు తగ్గినట్లు జిల్లా కలెక్టర్ అంకిత్ సమీక్షలో వివరించారు. సుమారు 40 వేల ఎకరాల్లో వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటల సాగుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. రాబోయే ఆరు నెలల తాగునీటి అవసరాలకు సరిపడా నీరు అందుబాటులో ఉందని వివరించారు. నీటి వనరుల పరిస్థితిని నిరంతరం పరిశీలిస్తూ, అవసరమైన చోట ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. రెండు జిల్లాల్లో వ్యవసాయం, తాగునీటి సరఫరా, భూగర్భ జలాల పరిరక్షణ, పశుగ్రాసం అందుబాటు వంటి అంశాలపై అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి సూచించారు. సమీక్షలో రెండు జిల్లాలకు చెందిన సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా రక్తదాన శిబిరం నిర్వహణ

## రక్తదానం మరొకరి ప్రాణాన్ని కాపాడే మహోన్నత సేవ - కరీంనగర్ సీపీ గౌష్ ఆలం



**కరీంనగర్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ మీడియా టుడే , అక్టోబర్ 27 :** కరీంనగర్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఆదేశాల మేరకు మంగళవారం కరీంనగర్‌లో రక్తదాన శిబిరాన్ని నిర్వహిం చారు. విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీస్ అమర వీరుల త్యాగాలను స్మరించు కుంటూ, మానవతా దృక్పథంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సీపీ గౌష్ ఆలం మాట్లాడుతూ. రక్తదానం మరొకరి ప్రాణాన్ని కాపాడే మహోన్నత సేవ అని పేర్కొన్నారు. ప్రజల ప్రాణాలను రక్షించడం పోలీసుల ప్రధాన కర్తవ్యమని, అత్యవసర పరిస్థితుల్లో రక్తం అందించడం ద్వారా విలువైన ప్రాణాలను కాపాడవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రక్తదానానికి కులం, మతం, ప్రాంతం, లింగభేదాలతో సంబంధం లేదని, ఇది మానవత్వానికి, సమానత్వానికి ప్రతీకగా నిలుస్తుందని సీపీ పేర్కొన్నారు. ముఖ్యంగా రోడ్డు ప్రమాదాలు, ఇతర అత్యవసర పరిస్థితుల్లో గాయపడిన వారికి సకాలంలో రక్తం అందించడం ఎంతో కీలకమని తెలిపారు. రక్తదానం చేసే ముందు వైద్య పరీక్షలు చేయించుకోవాలని, అనంతరం వైద్యుల సూచనల మేరకు తగిన విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. ప్రతి సంవత్సరం అక్టోబర్ 21న నిర్వహించే పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా దేశవ్యాప్తంగా విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీసు సిబ్బంది సేవలను స్మరించుకుంటామని తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఇప్పటివరకు 47 మంది పోలీసు సిబ్బంది విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించారని, వారి త్యాగాలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. అమరవీరుల కుటుంబాలను గౌరవించడం, వారి త్యాగాలను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఈ రక్తదాన కార్యక్రమశిలో ఏసీపీ లు శ్రీనివాస్, శ్రీనివాస్ జి, వెంకటస్వామి, విజయకుమార్, స్వామి పాల్గొన్నారు. అంతేకాకుండా శిబిరానికి సహకరించిన ప్రభుత్వ ఆసుపత్రి బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఉషారాణి, ఆర్ఎంఓ, వైద్య బృందానికి, స్వచ్ఛందంగా రక్తదానం చేసిన వారందరికీ పోలీస్ శాఖ తరపున సీపీ కృతజ్ఞతలు తెలిపారు.

# పలు బాధిత కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎంపీ వినోద్ కుమార్

**పర్వతగిరి అక్టోబర్ 27, మీడియా టుడే**



మండలంలోని ఏనుగల్ గ్రామంలో ఇటీవల మృతి చెందిన పెండ్యాల విజయలక్ష్మి, బీమల్ల భారతమ్మ కుటుంబాలను మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్, మాజీ ఏఎంసీ చైర్మన్ తక్కలపల్లి నారాయణరావు, ఏఎంసీ మాజీ మార్కెట్ డైరెక్టర్ యుగంధర్ రావు పరామర్శించారు. బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చి, వారికి కొంత ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని తెలిపారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో తూర్పు తండా సర్పంచ్ బానోతు దశరథ్, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు వెంకట్, మాజీ ఎంపీటీసీ డా. సాంబారి లింగమూర్తి, మండల యువజన నాయకుడు గూడ నరేందర్, వార్డు సభ్యుడు నల్లపు రంజిత్, నల్లపు అనిల్, ఎండీ రహీం, నల్లపు అశోక్, ఈద కొమురయ్య, షేక్ హబీబ్, గుండారపు మురళి, ఆరెల్లి అఖిల్, నాగెల్లి రణధీర్, నల్లపు రాకేష్, నాగెల్లి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యేక అవసరాలున్న పిల్లలను గుర్తించాలి

**పర్వతగిరి అక్టోబర్ 27 మీడియా టుడే**



ప్రత్యేక అవసరాలున్న పిల్లలను ఉపాధ్యాయులు గుర్తించి, వారికి తగిన విద్య అందేలా చర్యలు తీసుకోవాలని పర్వతగిరి మండల విద్యాశాఖ అధికారి ఏ. బిక్షపతి సూచించారు. పాఠశాలలు, కళాశాలల్లో ప్రత్యేక అవసరాలున్న పిల్లలను గుర్తించేందుకు విద్యాశాఖ రూపొందించిన ప్రశస్త యాప్‌పై ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం పర్వతగిరి జెడ్పీఎస్ఎస్ పాఠశాలలో జరిగింది. ఈ సందర్భంగా ఎంఈఓ ఏ. బిక్షపతి మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలున్న విద్యార్థులను గుర్తించడం ద్వారా వారికి అవసరమైన విద్య, సహాయ సహకారాలు అందించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. విద్యార్థుల వివరాలను ప్రశస్త యాప్‌లో నమోదు చేసి, వారి అవసరాలకు అనుగుణంగా విద్యాబోధన అందించాలని సూచించారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్లుగా నాగేశ్వర్‌రావు, రాజేంద్రప్రసాద్, అశోక్ పాల్గొని ప్రశస్త యాప్ వినియోగంపై ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లకు శిక్షణ ఇచ్చారు. జెడ్పీఎస్ఎస్ పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు పాక రమేష్‌బాబు, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కళాశాలల ప్రిన్సిపాళ్లు, ఎంఆర్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

# పర్వతగిరి పీహెచ్‌సీలో ఆరోగ్య మహిళా క్లినిక్ తనిఖీ

**పర్వతగిరి అక్టోబర్ 27 మీడియా టుడే**



ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహిస్తున్న ఆరోగ్య మహిళా క్లినిక్‌ను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. రాజా రెడ్డి మంగళవారం తనిఖీ చేశారు. క్లినిక్‌లో మహిళలకు అందుతున్న వైద్య సేవలను సమీక్షించారు. ఈ సందర్భంగా ఔట్ పేషెంట్ (ఓపీ) రిజిస్టర్, ల్యాబొరేటరీ రిజిస్టర్, ఐసోలేటెడ్ రెఫ్రిజిరేటర్ (ఐఎల్ఆర్)ను పరిశీలించారు. రికార్డుల నిర్వహణ, ప్రయోగశాల సేవలు, టీకాల నిల్వకు సంబంధించిన కోల్డ్ చైన్ నిర్వహణ తదితర అంశాలను తనిఖీ చేశారు. ఆరోగ్య మహిళా క్లినిక్‌కు వచ్చే మహిళలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని, అవసరమైన వైద్య పరీక్షలను సక్రమంగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. అన్ని రిజిస్టర్లను ఎప్పటికప్పుడు నవీకరించాలని, ఆరోగ్య మహిళా కార్యక్రమానికి సంబంధించిన పనితీరు సూచికలను సమీక్షిస్తూ మెరుగైన ఫలితాలు సాధించేలా కృషి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలను సాధించేందుకు వైద్యాధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డాక్టర్ రాజా రెడ్డి సూచించారు. తనిఖీలో పర్వతగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు డాక్టర్ వి. ఉదయ్ రాజ్, డాక్టర్ జె. మౌనిక, నర్సింగ్ ఆఫీసర్ కె. రాజిత, ల్యాబ్ టెక్నీషియన్ రాజు, ఇతర ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# వరదరాజుపూర్ లో తీవ్రరూపం దాల్చిన కోతుల బెడద

**భయాందోళనలో గ్రామ ప్రజలు - తమకు ఈ కోతుల బెడద నుండి విముక్తి కల్పించండి**

**గ్రామ పంచాయతీ కార్యదర్శి రోజాకు వినతి పత్రం అందజేత**

**మాజీ సర్పంచ్ అప్పల ప్రవీణ్**



**మార్కుక్ అక్టోబర్ 27 మీడియా టూ డే**

మార్కుక్ మండలం వరదరాజుపూర్ గ్రామంలో గత కొంతకాలంగా కోతుల బెడద తీవ్రరూపం దాల్చింది. నివాస ప్రాంతాల్లో కోతులు గుంపులు గుంపులుగా తిరుగుతూ స్థానిక ప్రజలను తీవ్ర భయభ్రాంతులకు గురిచేస్తు న్నాయి. ఇళ్లు, దుకాణాలపై ఒక్కసారిగా దాడి చేసి ఆహార పదార్థాలను ఎత్తుకెళ్లడమే కాకుండా, అడ్డువచ్చిన వారిపై దాడికి తెగబడుతున్నాయి. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు, మహిళలు ఇళ్ల నుండి బయటకు రావాలంటేనే జంకుతున్నారు. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు సైతం కోతుల దాడులకు గురవుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోతుల బెడద నుండి గ్రామ ప్రజలను రక్షించాలని కోరుతూ మాజీ సర్పంచ్ అప్పల ప్రవీణ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి గ్రామ పంచాయతీ కార్యదర్శి రోజాకు వినతి పత్రం అందజేశారు. అటవీ శాఖ అధికారులు తక్షణమే స్పందించి కోతులను పట్టుకుని సురక్షిత అటవీ ప్రాంతాలకు తరలించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు రాజు, బిఆర్ఎస్ నాయకులు బాలమణి, కనకయ్య గౌడ్, రాజు, రమేష్, విఘ్నేష్, రాములు, హిమవంతు, అయిలయ్య, లక్ష్మయ్య, సాయి పార్శి, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా భావానంద స్వామి 127 వ జయంతి ఉత్సవాలు



**మార్కుక్ అక్టోబర్ 27మీడియా టూ డే**

సిద్దిపేట జిల్లా మార్కుక్ మండలం భావనందాపూర్ పాండురంగ ఆశ్రమంలో పాండురంగ ఆశ్రమ వ్యవస్థాపకులుభావానంద భారతి స్వామి వారి 127 వ జయంతి ఉత్సవాలు మంగళవారం అంగరంగ వైభవంగా జరిగాయి. స్వామి వారి సమాధి ప్రాంగణాన్ని రకరకాల పుష్పాల తో అలంకరించారు. స్వామివారికి క్షీర అభిషేకము లక్ష పుష్పార్చన కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు తీసుకొచ్చిన 56 రకాల మధుర పదార్థాలతో స్వామివారికి చెప్పన్ బోగ్ నివేదన చేశారు. అనంతరం పుష్పాలతో అలంకరించిన ఊయల కట్టి అందులో స్వామివారి చిత్రపటాన్ని ఉంచి అప్పుడే పుట్టిన శిశువుకు చేసినట్లుగా డోలోత్సవాన్ని వైభవో పేతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి ఆశీర్వాదంతో పాటు భోజన ప్రసాదాన్ని స్వీకరించారు

# చింతలు తీర్చేందుకే ప్రజల చెంతకు రేగులపల్లిలో 'ఎమ్మెల్యే ఆన్ వీల్స్'

**అధికారులతో కలిసి గ్రామంలో పర్యటించిన ఎమ్మెల్యే కవ్వంపల్లి**

**గ్రామ సమస్యలపై ఆరా.. అభివృద్ధి పనులపై సమీక్ష**

**కరీంనగర్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ మీడియా టుడే , అక్టోబర్ 27:**

ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకునే లక్ష్యంతో చేపట్టిన 'ఎమ్మెల్యే ఆన్ వీల్స్' కార్యక్రమంలో భాగంగా కరీంనగర్ జిల్లా మానకొండూరు ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మంగళవారం ఉమ్మడి జిల్లా లోని బెజ్జంకి మండలం రేగులపల్లి గ్రామంలో పర్యటించారు. వివిధ శాఖల అధికారులతో కలిసి గ్రామంలోని అన్ని వార్డుల్లో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, గ్రామాభివృద్ధిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప్పు లక్ష్మి, గైని జ్యోతి, దుగ్యాని లావణ్య, గాండ్ల పద్మ, నరాల ఐలవ్వ, జంగిలి రజిత, నిషాని రాధవ్వ, ఉత్కం పద్మ, మాతంగి అనసూర్య, బోనగిరి భవాని, రేకొండ రేవతి, తాళ్ల మల్లీశ్వరి, బండారి రాధ తదితర లబ్ధిదారుల ఇళ్లను ఎమ్మెల్యే పరిశీలించారు. ఇళ్ల నిర్మాణాల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో గ్రామానికి మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల వివరాలు, నిర్మాణ పనుల పురోగతి, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరును సమీక్షించారు. గ్రామంలో నెలకొన్న సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, ప్రజలకు అందుతున్న ప్రభుత్వ సేవలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా తెలుసుకుని, వారి చింతలు తీర్చేందుకే 'ఎమ్మెల్యే ఆన్ వీల్స్' కార్యక్రమం ద్వారా ప్రజల చెంతకు వస్తున్నట్లు తెలిపారు. పేదలకు సొంత ఇల్లు కల్పించడం కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నామని చెప్పారు .రేగులపల్లి గ్రామానికి 26 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, ఇప్పటివరకు కేవలం ఎనిమిది ఇళ్ల నిర్మాణాలు మాత్రమే పూర్తయ్యాయని తెలిపారు. మంజూరైన ఇళ్ల నిర్మాణాలను పూర్తిచేయకముందే అదనపు ఇళ్ల కోసం కోరడం సమంజసం కాదని పేర్కొన్నారు. లబ్ధిదారులందరూ తమ ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసుకుని గృహప్రవేశాలు జరుపుకోవాలని సూచించారు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం అందిస్తున్న రూ. 5 లక్షల ఆర్థిక సాయంతో పాటు, అవసరమైన లబ్ధిదారులకు మహిళా సంఘాల ద్వారా అదనంగా రూ. 2 లక్షల వరకు రుణ సదుపాయం కూడా కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామ పర్యటనలో పలు సమస్యలు తమ దృష్టికి వచ్చాయని, వాటిలో ట్రాన్స్‌కోకు సంబంధించిన సమస్యలు



ఎక్కువగా ఉన్నాయని ఎమ్మెల్యే తెలిపారు. ఆయా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత ఏఈని ఆదేశించినట్లు వెల్లడించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అధికారులు సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ జంగిలి లక్ష్మి-తిరుపతి, ఎంపీడీవో కె. ప్రవీణ్ కుమార్, బెజ్జంకి పీఏసీఎస్ చైర్మన్ ఒగ్గు దామోదర్, వైస్ చైర్మన్ పర్శ సంతోష్, ఏఎంసీ మాజీ చైర్మన్ పులి కృష్ణ, ఏపీఎం పర్శరాం, ఎంపీవో ఖలీం, మండల వ్యవసాయ అధికారి సంతోష్, ట్రాన్స్‌కో ఏఈ మహేష్, ఆర్‌డబ్ల్యూఎస్ఏ అనిత, ఆర్ఐ, జీపీవో ప్రశాంత్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు లింగాల శ్రీనివాస్, పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు కొట్టె రాజిరెడ్డి, నాయకులు తిరుపతి రెడ్డి, జీల లింగం, భైర సంతోష్, ప్రసాద్, భూమిరెడ్డి, జె. సంపత్, ఎర్రోజు రాజు తదితరులతో పాటు వివిధ గ్రామాల సర్పంచులు, గ్రామశాఖ అధ్యక్షులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయిలో పల్లవి క్రీడా ప్రతిభ.. జాతీయ బరిలో సింధు

## సాఫ్ట్‌బాల్, నెట్‌బాల్, గట్కాలో రాణించిన 12 మంది విద్యార్థులకు ఘన సన్మానం

**పర్వతగిరి అక్టోబర్ 27 మీడియా టుడే**

రాష్ట్రస్థాయి క్రీడల్లో ప్రతిభ చాటిన అన్నారం పల్లవి హైస్కూల్ విద్యార్థులకు పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు ఘన సన్మానం నిర్వహించారు. పాఠశాల ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో సాఫ్ట్‌బాల్, నెట్‌బాల్, గట్కా విభాగాల్లో రాణించిన 12 మంది విద్యార్థులను అభినందించారు. అండర్--13 జాతీయ సాఫ్ట్‌బాల్ ఛాంపియన్‌షిప్‌కు తెలంగాణ బాలికల జట్టు తరపున ఎంపికైన డి.ఎస్. సింధును శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేశారు. జిల్లాస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సింధు, అనంతరం నిజామాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లోనూ రాణించింది. వరంగల్ జిల్లా బాలికల జట్టు తృతీయ స్థానం సాధించడంలో కీలక పాత్ర పోషించి, తెలంగాణ జట్టులో చోటు దక్కించుకుంది. మహారాష్ట్రలోని షిరిడీలో జరగనున్న జాతీయ పోటీల్లో పాల్గొనేందుకు ఆమె తెలంగాణ జట్టుతో కలిసి అక్టోబర్ 28న బయలుదేరనుంది. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ రాచకొండ అశోక చారి మాట్లాడుతూ విద్యార్థులు చదువు తోపాటు క్రీడల్లోనూ రాణించడం సంతోషంగా ఉందన్నారు. క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర సాధన విజయానికి పునాదులని పేర్కొన్నారు. సింధు జాతీయస్థాయిలోనూ ఉత్తమ ప్రతిభ కనబరిచి తెలంగాణకు, వరంగల్ జిల్లాకు, పర్వతగిరి మండలానికి, అన్నారం గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. క్రీడల్లో ఆసక్తి ఉన్న విద్యార్థులకు పాఠశాల తరపున ప్రోత్సాహం అందిస్తామని తెలిపారు. ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి టోర్నమెంట్లలో సాఫ్ట్‌బాల్ విభాగంలో వరంగల్ జిల్లా బాలికల జట్టు, నెట్‌బాల్ విభాగంలో మహబూబాబాద్ జిల్లా బాలుర జట్టు తృతీయ స్థానాలు సాధించడంలో పల్లవి విద్యార్థులు భాగస్వాములయ్యారు. గట్కా విభాగంలోనూ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటారు. విద్యార్థులకు శిక్షణ అందించి, వారి విజయాలకు కృషి



చేసిన పీఈటీ శ్రవణ్ కుమార్, కోచ్ కవితను పాఠశాల యాజమాన్యం ప్రత్యేకంగా అభినందించింది. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ గంజి మహేందర్, డైరెక్టర్ కోటగిరి రమేష్, ప్రిన్సిపాల్ ఎం. అశ్విని, కోఆర్డినేటర్లు రాజు, నవ్యశ్రీ, వకుళాదేవి, పీఈటీ శ్రవణ్ కుమార్, కోచ్ కవిత, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొని విద్యార్థులకు హార్దిక శుభాకాంక్షలు తెలిపారు.

# ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటు హక్కును కాపాడుకోవాలి

## 'ఓట్ బచావో -- దేశ్ బచావోకు AICC పరిశీలకులు మోహన్ కుమారన్ మంగళం పిలుపు



**సన్నాయి హనుమంతరావు । జాయింట్ బ్యూరో రంగారెడ్డి జిల్లా । మీడియాటుడే**

అక్టోబర్ 27 న్యూస్: ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటు హక్కును కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని ాా×జజ పరిశీలకులు మోహన్ కుమారన్ మంగళం అన్నారు. ఓటు హక్కు పరిరక్షణే దేశ పరిరక్షణ అనే నినాదంతో 'ఓట్ బచావో -- దేశ్ బచావో' కార్యక్రమాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్తున్నట్లు తెలిపారు. సోమవారం రంగారెడ్డి జిల్లా మొయినాబాద్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

**నవంబర్ 1న భారీ బహిరంగ సభ**

ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి మాట్లాడుతూ, నవంబర్ 1న రామ్‌లీలా మైదానంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. చేవెళ్ల నియోజకవర్గంతో పాటు రంగారెడ్డి జిల్లా నలుమూలల నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి సభను జయప్రదం చేయాలని కోరారు.

**ప్రముఖ నాయకుల హాజరు**

ఈ సమావేశంలో రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, జ్ఞానేశ్వర్ ముదిరాజ్, రఘునాథ్ యాదవ్, నియోజకవర్గ ఇన్‌ఛార్జులు భీమ్ భరత్, జగదీశ్వర్ గౌడ్, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివ చరణ్ రెడ్డి, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ తీగల అనిత హరినాథ్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ అధికార ప్రతినిధి గౌరీ సతీష్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఏనుగు జంగారెడ్డి, షాబాద్ మున్సిపల్ చైర్మన్ దర్శన్, రాంరెడ్డి, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు నాగేందర్ రెడ్డి, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు జ్యోతి భీమ్ భరత్, జిల్లా మైనారిటీ సెల్ చైర్మన్ ఖాజా సలావుద్దీన్ అమీర్, చేవెళ్ల మున్సిపల్ చైర్మన్ సమత వెంకట్ రెడ్డితో పాటు జిల్లా పరిధిలోని వివిధ నియోజకవర్గాల ప్రజాప్రతినిధులు, మండల పార్టీ అధ్యక్షులు, కాంగ్రెస్ అనుబంధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నెల్లికుదురులో అభివృద్ధి కార్యక్రమాలకు హాజరైన కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు

**మీడియా టుడే (మహబూబాబాద్ జిల్లా అక్టోబర్ 27)**



మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలంలో ఈరోజు నిర్వహించిన పలు అభివృద్ధి కార్యక్ర మాలకు రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి, మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్, మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి నాయక్, డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ జాటోతు రామచంద్రు నాయక్, డీసీసీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఉమా మురళి నాయక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజాప్రతినిధులకు స్వాగతం పలికారు. నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సంక్షేమ కార్యక్రమాల నేపథ్యంలో ఈ పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో మాజీ డీసీసీ కార్యదర్శి వాంకుడోత్ కొమ్మాలు నాయక్, గూడూరు మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ బీరం శ్రీపాల్ రెడ్డి, గూడూరు ఉపసర్పంచ్ చంటి స్వామి, జిల్లా మైనార్టీ సెల్ కార్యదర్శి ఎం.డి. రసూల్, యూత్ కాంగ్రెస్ నాయకులు షాజహాన్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు. ప్రజాప్రతినిధుల పర్యటనతో స్థానిక కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది.

# వరి పంటను పరిశీలించిన సహాయ వ్యవసాయ సంచాలకులు - ఎస్. అనిల్ కుమార్



**మార్కుక్ అక్టోబర్ 27మీడియా టూ డే**

సిద్దిపేట జిల్లా మార్కుక్ మండలం ఎర్రవల్లి గ్రామంలో వరి పంటను సహాయ వ్యవసాయ సంచాలకులు (ఏడిఏ ) ఎస్. అనిల్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎల్ నినో ప్రభావంతో వర్షపాతం తక్కువగా ఉండే అవకాశం ఉన్నందున యాసంగి సీజన్‌లో అధిక నీటి అవసరం ఉన్న వరి పంటకు బదులుగా తక్కువ నీటితో సాగు చేయగల ఆరుతడి పంటలైన పెసర మినుము బొబ్బెర శెనగతో పాటు కూరగాయ పంటలను సాగు చేయాలని రైతులను కోరారు. నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని పంటల వైవిధ్యీకరణను పాటించడం ద్వారా నీటి వనరులను ఆదా చేసుకోవడంతో పాటు రైతులకు మంచి ఆదాయం పొందే అవకాశం ఉంటుందని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రాము, వ్యవసాయ విస్తరణ అధికారి విష్ణు ఎర్రవల్లి గ్రామ రైతులు పాల్గొన్నారు.

# బీసీ సంక్షేమ శాఖ పథకాల అమలులో పారదర్శకత, వేగం పెంచాలి

**38 ఆత్మగౌరవ భవనాల జీవోల ప్రక్రియ వేగంగా పూర్తి చేయాలి**

**డిసెంబర్ 9న లబ్ధిదారులకు కుట్టు మిషన్లు అందించేలా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలి**

**తెలంగాణ మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలల సొంత భవనాలకు స్థల సేకరణ పూర్తి చేయాలి**

**బీసీ స్టడీ సర్కిల్ లో కమిటీ నివేదిక ఆధారంగా నూతన సంస్కరణలు అమలు చేయాలి**

**బీసీ సంక్షేమ శాఖ సమీక్షా సమావేశంలో అధికారులకు మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాలు**

**మీడియా టుడే న్యూస్ సైదాపూర్ ప్రతినిధి వైష్ణవ్ అక్టోబర్ 27** హైదరాబాద్,సచివాలయంలో రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ బీసీ సంక్షేమ శాఖపై సమీక్షా సమావేశం నిర్వహించారు. బీసీ సంక్షేమ శాఖ పరిధిలో అమలవుతున్న పథకాలు, గురుకుల పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, ఆత్మగౌరవ భవనాలు, నిరుద్యోగులకు నైపుణ్య శిక్షణ, బీసీ వర్గాలకు స్వయం ఉపాధి అవకాశాల కల్పన తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు.మహాత్మా జ్యోతిబా పూలే విదేశీ విద్యా నిధి పథకం అమలుపై మంత్రి సమీక్షించారు. ఈ పథకం ద్వారా అర్హులైన మెరిట్ విద్యార్థులకు పూర్తి పారదర్శకతతో పెండింగ్ లేకుండా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సూచనల మేరకు 38 ఆత్మగౌరవ భవనాలకు సంబంధించిన జీవోల ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు.బీసీ మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు మెరుగుపరిచే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇంటింటా కుట్టు మిషన్ల పథకం అమలుపై మంత్రి సమీక్షించారు. ఈ పథకానికి మహిళల నుంచి మంచి స్పందన లభించిందని, సుమారు 4.80 లక్షల దరఖాస్తులు వచ్చాయని తెలిపారు.నియోజకవర్గానికి వెయ్యి మంది చొప్పున మొత్తం 1.90 లక్షల మంది మహిళలకు లబ్ధి చేకూర్చేలా ప్రణాళిక రూపొందించినట్లు పేర్కొన్నారు. డిసెంబర్ 9న లబ్ధిదారులకు కుట్టు మిషన్లు అందించేలా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని, టెండర్ ప్రక్రియతో పాటు ఇతర అవసరమైన పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.రాజీవ్ యువ వికాసం పథకం కింద వచ్చిన దరఖాస్తుల వివరాలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. ఈ పథకం ద్వారా లబ్ధి పొందే వారిలో బీసీలకు తగిన ప్రాధాన్యత కల్పించే అంశంపై ప్రభుత్వంతో చర్చిస్తామని తెలిపారు.రాష్ట్రంలోని 327 మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలల్లో ఆర్సీవోలు పర్యటించి మౌలిక సదుపాయాలు, సిబ్బంది, విద్యార్థుల సంఖ్య, ఖాళీలు, సొంత భవనాల స్థితిగతులు తదితర అంశాలపై నివేదికలు అందించినట్లు మంత్రి తెలిపారు. ఈ నివేదికల ఆధారంగా పాఠశాలల్లో ఉన్న సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.రాష్ట్రంలోని 327 గురుకుల పాఠశాలల్లో కేవలం 26 పాఠశాలలకు మాత్రమే సొంత భవనాలు ఉండగా, మిగిలిన 301 పాఠశాలలు ప్రైవేట్ భవనాల్లో కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. 37 గురుకులాలకు సొంత స్థలాలు ఉన్నందున వాటిలో భవనాల నిర్మాణానికి అనుమతులు, నిధులు మంజూరు చేసే అంశంపై ప్రభుత్వంతో చర్చిస్తామని తెలిపారు. గురుకులాలకు కూడా సొంత భవనాలు నిర్మించేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. అధికారులు గురుకుల పాఠశాలలను క్రమం తప్పకుండా సందర్శించాలని, జిల్లా కలెక్టర్లు నెలకు ఒక గురుకుల పాఠశాలను సందర్శించి నివేదిక అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గురుకులాలకు అవసరమైన స్థలాల సేకరణను త్వరగా పూర్తి చేయాలని ప్రిన్సిపల్ సెక్రటరీని ఆదేశించారు.నవంబర్ మొదటి వారంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ప్రిన్సిపల్ సెక్రటరీ, కమిషనర్, జిల్లా కలెక్టర్లు, ఆర్సీవోలు, ప్రిన్సిపాళ్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి గురుకులాల సమస్యల పరిష్కారంపై సమీక్షించనున్నట్లు తెలిపారు. గురుకుల పాఠశాలల ప్రిన్సిపాళ్లు, బీసీ సంక్షేమ శాఖ హాస్టల్ వార్డెన్లకు లేఖలు రాసి విద్యార్థులకు ఎల్ నినో ప్రభావం, నీటి పొదుపు, విద్యుత్ వినియోగంలో మితవ్యయం తదితర అంశాలపై అవగాహన కల్పించాలని మంత్రి సూచించారు. విద్యార్థులకు అవగాహన కల్పించడం ద్వారా వారు తమ తల్లిదండ్రులకు కూడా ఈ అంశాలను వివరించే అవకాశం ఉంటుందని తెలిపారు.బీసీ స్టడీ సర్కిళ్లలో సంస్కరణలు చేపట్టి నిరుద్యోగులకు ఉద్యోగాలే లక్ష్యంగా నాణ్యమైన శిక్షణ అందించేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. ఈ అంశంపై ఐదుగురు సభ్యుల కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా సమర్థవంతమైన డైరెక్టర్ల నియామకానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. డైరెక్టర్ల ఎంపిక కోసం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి, యూపీఎస్సీ, గ్రూప్–1 వంటి పోటీ పరీక్షల్లో మెరిట్ సాధించిన వారికి అవకాశాలు కల్పించేలా ఎంపిక ప్రక్రియ చేపట్టాలని తెలిపారు.బీసీ కార్పొరేషన్ ద్వారా శిక్షణ పొందిన వారికి స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని మంత్రి సూచించారు. మధిర వంటి నియోజకవర్గంలో పైలట్ ప్రాజెక్టుగా పశువుల



పంపిణీ తరహా ఉపాధి పథకాన్ని ప్రారంభించి, లబ్ధిదారుల ఆదాయం పెరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎంఎస్ఎంఈ పథకం కింద చిన్న, మధ్యతరహా పరిశ్రమల స్థాపనకు వివిధ కుల సంఘాలకు నైపుణ్య శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసి ఉపాధి అవకాశాలు, ఆర్థిక వృద్ధి పెంపొందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.బీసీ వితంతువులు, ఒంటరి మహిళలకు నైపుణ్య శిక్షణ అందించి ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో రజకుల కోసం ఆధునిక ధోబీఘాట్లు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి తెలిపారు. ట్యాంక్‌బండ్‌పై బలహీనవర్గాల ఐకాన్లుగా నిలిచిన ప్రముఖుల విగ్రహాలకు పేర్లు రాయించే పనులను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.కాటమయ్య రక్షణ కవచాల పంపిణీపై సమీక్షిస్తూ, శిక్షణ పూర్తి చేసుకున్న లబ్ధిదారులకు వాటిని అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నీరా కేఫ్, నందనవనాల నిర్వహణ, అభివృద్ధి అంశాలపై మంత్రి చర్చించారు. వాటిని అధికారులు స్వయంగా సందర్శించి క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించాలని ఆదేశించారు.బీసీ సంక్షేమ శాఖ పరిధిలోని పథకాలు అర్హులైన లబ్ధిదారులకు సమర్థవంతంగా చేరేలా, స్వయం ఉపాధి అవకాశాలు పెరిగేలా, గురుకులాల్లో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించేలా సమన్వయంతో పనిచేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులకు సూచించారు.ఈ సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాహుల్ బొజ్జ, బీసీ సంక్షేమ శాఖ కమిషనర్ బాలమాయాదేవి, మహాత్మా జ్యోతిబా పూలే గురుకులాల కార్యదర్శి సైదులు, అధికారులు మల్లయ్య బట్టు, అలోక్ కుమార్, పద్మ, మామిడి హరికృష్ణ, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలి

**ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు**







**నిజాంపేట్, అక్టోబర్ 27 (మీడియా టుడే):** పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేసి, అర్హులైన ప్రతి పట్టభద్రుడిని ఓటరుగా నమోదు చేయించాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు పార్టీ నాయకులకు పిలుపునిచ్చారు.జాంపేట్‌లోని కోలన్ రాఘవ రెడ్డి గార్డెన్స్‌లో శేరిలింగంపల్లి నియోజకవర్గ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమంపై బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, మాజీ కార్పొరేషన్ చైర్మన్ గజ్జెల నాగేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా నాయకులు తమ ఇళ్ల నుంచే ఓటరు నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించి, కుటుంబ సభ్యులతో పాటు కాలనీలు, డివిజన్లలోని అర్హులైన పట్టభద్రులను గుర్తించి నమోదు చేయించాలని సూచించారు. గతంలో ఓటు హక్కు వినియోగించుకున్న పట్టభద్రులు సైతం నిబంధనల ప్రకారం తిరిగి తమ పేర్లను నమోదు చేసుకోవాలని, ఈ ప్రక్రియపై విస్తృతంగా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. నవంబర్ 6 చివరి తేదీ కావడంతో సమయాన్ని వృథా చేయకుండా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని కోరారు.అలాగే, రాష్ట్రంలో కేసీఆర్ నాయకత్వాన్ని ప్రజలు తిరిగి కోరుకుంటున్నారని పేర్కొంటూ, కాంగ్రెస్ ప్రభుత్వ పాలనా వైఫల్యాలు, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ విధానాలు, యువతకు ఇచ్చిన హామీల అమలులో జరుగుతున్న జాప్యాన్ని ప్రజలకు వివరించాలని నాయకులకు సూచించారు. రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి విజయం సాధించేలా ప్రతి నాయకుడు, కార్యకర్త బాధ్యతతో పనిచేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, వివిధ స్థాయిల నాయకులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రభుత్వం పిఆర్సిని వెంటనే ప్రకటించాలి

**ఆదర్శ పాఠశాలల ఉపాధ్యాయులకు 010 పద్దు కింద వేతనాలు చెల్లించాలి**

**మానకొండూర్ మండల సభ్యత్వ నమోదులో తపస్ జిల్లా అధ్యక్షుడు అన్నమనేని తిరుపతిరావు**

**మీడియా టుడే న్యూస్ సైదాపూర్ ప్రతినిధి వైష్ణవ్ అక్టోబర్ 27** తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం తపస్ సభ్యత్వ నమోదు కార్యక్రమం ఈరోజు మానకొండూరు మండలంలోని వన్నారం శంషాబాద్, గట్టుదుద్దెనపల్లి, గంగిపల్లి, కొండపల్కల, పోచంపల్లి, ఊటూరు, వేగురుపల్లి, వెల్ది తదితర గ్రామాలలోని పాఠశాలలలో చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో తపస్ కరీంనగర్ జిల్లా శాఖ అధ్యక్షుడు అన్నమనేని తిరుపతిరావు మాట్లాడుతూ ప్రభుత్వం హామీ ఇచ్చిన మేరకు గత మూడు సంవత్సరాలుగా పెండింగ్లో ఉన్న పి ఆర్ సి ని వెంటనే ప్రకటించాలని ఆదర్శ పాఠశాలలో పనిచేస్తున్న వారి వేతనాలను 010 పద్దు కింద చెల్లించాలని, అకడమిక్ కేర్ టేకర్లను నియమించాలని, ఎస్జీటి ఉపాధ్యాయులకు ఎమ్మెల్సీ ఎన్నికలలో ఓటు హక్కు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఉన్నత పాఠశాలలతో పాటు ఆదర్శ పాఠశాలలలో పని చేసే ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున సభ్యత్వ నమోదు చేయడం జరిగింది. ఈ సభ్యత్వ నమోదులో మానకొండూర్ మండల శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జక్కం వేణుమాధవ్, మన్నూరు రామకృష్ణ, జిల్లా కార్యదర్శులు మెన్నేని కమలాకర్ రావు, కట్కోజ్వల రవి కిరణ్, చిట్టెంపెల్లి మురళీమోహన్, శ్రీ మూర్తి




అశోక్, చీటి భారతి, లక్ష్మణరావు, శ్రీనివాస్ రెడ్డి, మనోజ్, కే వసుమతి, శ్రీలత లతోపాటు పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొని తపస్ ను బలపరుస్తూ సభ్యత్వం స్వీకరించడం జరిగింది.

# పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు హక్కు కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి

**నడిగూడెం, అక్టోబర్27. మీడియా టుడే;**



వరంగల్--ఖమ్మం--నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హులైన పట్టభద్రులు తమ ఓటు హక్కు నమోదు చేసుకోవాలని మాజీ ఎంపీటీసీ గుండు శ్రీనివాస్ కోరారు.మంగళవారం నడిగూడెం మండల కేంద్రంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైనదని, అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. పట్టభద్రులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని ఆన్ లైన్ చేసిన పత్రాల పై గెజిటెడ్ సంతకం చేయించి. తహసీల్దార్ కార్యాలయం లో అందించి తమ ఓటు హక్కును పొందాలని కోరారు.

# తుఫాన్ నేపథ్యంలో ముందస్తు చర్యలపై సమీక్ష సమావేశం-డీఈ పురుషోత్తం

**ములుగు జిల్లా ఏటూరునాగారం అక్టోబర్27(మీడియా టుడే)**



తుఫాన్ ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని డీఈ పురుషోత్తం విద్యుత్ శాఖ ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ (ాడవీ) సిబ్బందికి సూచించారు. ఏటూరునాగారం సబ్ స్టేషన్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని, అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. విద్యుత్ సమస్యలు తలెత్తితే వెంటనే స్పందించి సరఫరాను పునరుద్ధరించేలా సిద్ధంగా ఉండాలన్నారు. ూా.జు శేఖర్ పాల్గొన్నారు.

# వచ్చే నెల 6 వ తేదీ వరకు గడువు ఉందని అర్హులైన పట్టభద్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు

**అనారోగ్యంతో చికిత్స పొందుతున్న పి. జ్యోతిని పరామర్శించిన బండి రమేష్**

**కూకట్పల్లి, అక్టోబర్ 27,(మీడియా టుడే ప్రతినిధి)**



బేగంపేటలోని వెల్నెస్ హాస్పిటల్‌లో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న బండి రమేష్ కార్యాలయ పీఏ పౌర్ణిమ తల్లి పి. జ్యోతిని టీపీసీసీ ఉపాధ్యక్షులు, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం వెల్నెస్ హాస్పిటల్ ఎండీ శ్రీకాంత్ గౌడ్‌ను కలిసి జ్యోతికి అందిస్తున్న వైద్య చికిత్స వివరాలను తెలుసు కున్నారు. ఆమె సంపూర్ణ ఆరోగ్యంతో త్వరగా కోలుకోవాలని ఆకాం క్షిస్తూ, కుటుంబ సభ్యులకు ధైర్యం చె ప్పారు. ఈ కార్యక్రమంలో లక్ష్మయ్య, అరుణ్ గౌడ్, ఎజాజ్, శృంజిత్, కరు ణాకర్, రమాదేవి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



# ఎన్టీఆర్ నగర్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రణాళికలు సిద్ధం చేయాలి: ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

**కూకట్‌పల్లి, అక్టోబర్ 27 (మీడియా టుడే)**




బాలానగర్ డివిజన్ పరిధిలోని ఎన్టీఆర్ నగర్‌లో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేయాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అధికారులను ఆదేశించారు .మంగళవారం ఎన్టీఆర్ నగర్‌లో పర్యటించిన ఎమ్మెల్యే స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానికుల విజ్ఞప్తి మేరకు కమ్యూనిటీ హాల్ నిర్మాణం, హిందూ, ముస్లిం శ్మశాన వాటికల అభివృద్ధి, రోడ్ల నిర్మాణం, మంచినీటి సరఫరా తదితర సమస్యలపై అధికారులతో చర్చించారు.కాలనీ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రతిపాదిత అభివృద్ధి పనులను పరిశీలించి, వాటి అమలుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు.ఈ పర్యటనలో మాజీ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి, స్థానిక నాయకులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర రేషన్ డీలర్ల సమావేశానికి రేషన్ డీలర్లు హాజరు కావాలి.

**పర్వతగిరి అక్టోబర్ 27 మీడియా టుడే**



పర్వతగిరి మండలంలోని రేషన్ డీలర్లందరూ ఈ నెల 27న గజ్వేల్‌లో జరిగే రాష్ట్ర రేషన్ డీలర్ల సంఘం సమావేశానికి తప్పనిసరిగా హాజరై విజయవంతం చేయాలని మండల సంఘం అధ్యక్షుడు గడ్డం బాబు కార్యవర్గం విజ్ఞప్తి చేశారు.ఈ నెల 27న ఉదయం 6 గంటలకు పర్వతగిరి బస్టాండ్ నుంచి బయలుదేరి, ఉదయం 10.30 గంటలకు గజ్వేల్ చేరుకునేలా ప్రయాణం చేయనున్నట్లు తెలిపారు. మండలంలోని ప్రతి రేషన్ డీలర్ బాధ్యతగా సమావేశానికి హాజరై తమ ఐక్యతను చాటాలని కోరారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు మేనిఫెస్టోలో ప్రకటించిన రూ.5,000 గౌరవ వేతనం, రూ.300 కమిషన్ పెంపు, ఉచిత దిగుమతి హమాలీ తదితర డిమాండ్లతో పాటు ఇంకా పెండింగ్‌లో ఉన్న అనేక సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.రేషన్ డీలర్ల సమస్యల సాధన కోసం కలిసికట్టుగా పోరాడాల్సిన సమయం ఆసన్నమైందని, ప్రతి డీలర్ ఈ సమావేశం తనదేననే దృఢ సంకల్పంతో హాజరు కావాలని పిలుపునిచ్చారు.

# 63వ డివిజన్‌లో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

**ప్రజా ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమంలో భాగంగా ప్రజలకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ**



**మీడియా టుడే న్యూస్ సైదాపూర్ ప్రతినిధి వైష్ణవ్ అక్టోబర్ 27**

హనుమకొండజిల్లా,వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని 63వ డివిజన్‌లో వివిధ రేషన్ షాపుల వద్ద ప్రజా ప్రభుత్వం, కాంగ్రెస్ ప్రభుత్వం ఆధ్వర్యంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంనిర్వహించారు.తెలంగాణరాష్ట్రముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి,పౌర సరఫరాలు, భారీ నీటిపారుదల శాఖ మంత్రి శ్రీ ఉత్తమ్ కుమార్ రెడ్డి,ప్రారంభించిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో భాగంగా, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులునాయినిరాజేందర్,రెడ్డి,హనుమకొండ జిల్లా ఐజజ అధ్యక్షులు ఇనుగాల వెంకట్రామ్ రెడ్డి ఆదేశాల మేరకు 63వ డివిజన్‌లోని రేషన్ షాపుల వద్ద ప్రజలకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆరూరి సాంబయ్య , ఎస్సీ డిపార్ట్మెంట్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ హనుమకొండ , మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావం కారణంగా రానున్న రోజుల్లో వాతావరణ పరిస్థితుల్లో మార్పులు, నీటి కొరత ఏర్పడే అవకాశాలు ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నిత్యావసర సరుకులను పొదుపుగా వినియోగించుకోవడంతో పాటు విద్యుత్‌ను ఆదా చేయాలని, మంచినీటిని వృథా చేయకుండా జాగ్రత్తగావినియోగించుకోవాలని కోరారు.ఈ నెల నుంచి స్మార్ట్ రేషన్ కార్డులు పొందిన లబ్ధిదారులకు బియ్యంతో పాటు తొమ్మిది రకాల నిత్యావసర సరుకులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు.63వ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్, 63వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు విజయశ్రీ సయ్యద్ రజాలి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మైనార్టీ సెల్ వైస్ చైర్మన్ మహమ్మద్ షబ్బీర్ తబ్బు, మాజీ కార్పొరేటర్ గుంటి కుమార్, తైసిన్, అస్మా, రాస్, ప్రవళిక, మైనార్టీ నాయకులు మహమ్మద్ షాకీర్, 62వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు చిన్న, 12వ నంబర్ రేషన్ షాప్ డీలర్ మహమ్మద్ అస్లాం తదితరులు పాల్గొన్నారు.

# సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ.2 లక్షల ఆర్థిక సహాయం అందజేత

**కూకట్‌పల్లి,అక్టోబర్ 27, మీడియా టుడే ప్రతినిధి**



కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు క్యాంపు కార్యాలయంలో గురువారం అల్లాపూర్ డివిజన్‌కు చెందిన గౌసుద్దీన్ (భైల్లిం సాబ్)కు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా మంజూరైన రూ.2 లక్షల ఆర్థిక సహాయం చెక్కును ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అందజేశారు.ఈ సందర్భంగా లబ్ధిదారునికి ఆర్థిక సహాయం అందించేందుకు సహకరించిన సీఎంఆర్ఎఫ్ నిధుల ద్వారా అవసరమైన వారికి అండగా నిలిచేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

# కల్లుగీత కార్మికుల హక్కుల సాధనకు ఐక్య పోరాటం

**తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం కొడకండ్ల మండల నూతన కమిటీ ఎన్నిక**




జనగామ జిల్లా కొడకండ్లమీడియాటుడే అక్టోబర్ 27:
మండల కేంద్రం లో గౌడ సంఘం కమ్యూనిటీ హాల్లో కల్లుగీత కార్మికుల సమస్యల పరిష్కారం, హక్కుల సాధన లక్ష్యంగా తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం కొడకండ్ల మండల నూతన కమిటీని 18 మంది సభ్యులతో ఎన్నుకున్నారు. కార్మికుల సంక్షేమం కోసం ఐక్యంగా ఉద్యమించాలని, వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటాలు నిర్వహించాలని ఈ సందర్భంగా నాయకులు పిలుపునిచ్చారు. సంఘం మండల కమిటీ సమావేశానికి జిల్లా ప్రధాన కార్యదర్శి బాల్నే వెంకట మల్లయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన నూతన కమిటీ ఎన్నికల్లో మండల అధ్యక్షుడిగా పనస శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా మెరుగు సోమేశ్వర్ ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన నాయకులు మాట్లాడుతూ.. కల్లుగీత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారమే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. కార్మికుల హక్కుల పరిరక్షణకు, వారి సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ సంఘాన్ని మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. కార్మికుల సమస్యలపై రాజీలేని పోరాటాలు నిర్వహిస్తూ, వారి న్యాయమైన డిమాండ్ల సాధనకు కృషి చేస్తామని పేర్కొన్నారు.కార్మికులంతా ఐక్యంగా ఉంటూ సంఘం చేపట్టే ఉద్యమాల్లో భాగస్వాములు కావాలని వారు పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో జిల్లా నాయకులు దేశగాని శ్రీశైలం, పనస చంద్రమౌళి, జలగం సోమయ్య, పనస యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# ములుగు జిల్లాలో ఆర్టీఐ సమన్వయ కమిటీ ఏర్పాటు

### ఉత్తర్వులు జారీ చేసి జిల్లా కలెక్టర్ భోర్కడే హేమంత్ సహదేవరావు



**ములుగు,అక్టోబర్ 27: (మీడియా టుడే )**
సమాచార హక్కు చట్టం--2005 అమలును మరింత సమర్థవంతంగా పర్యవేక్షించేందుకు ములుగు జిల్లాలో జిల్లా స్థాయి సమన్వయ కమిటీని ఏర్పాటు చేస్తూ జిల్లా కలెక్టర్ భోర్కడే హేమంత్ సహదేవరావు ఉత్తర్వులు జారీ చేశారు.ఈ మేరకు అక్టోబర్ 24న ప్రొసీడింగ్స్ నంబర్ దీ3/785/2026 ద్వారా ఆదేశాలు వెలువడ్డాయి.జిల్లా రెవెన్యూ అధికారి వి రవికుమార్ నోడల్ అధికారిగా వ్యవహరించనుండగా,జిల్లాలోని అన్ని శాఖల జిల్లా అధికారులు కమిటీలో సభ్యులుగా ఉంటారు.సమాచార హక్కు చట్టం పరిరక్షణకు కృషి చేస్తున్న ప్రతినిధులు,ఆర్టీఐ కార్యకర్తలకు కూడా కమిటీలో స్థానం కల్పించారు.ఇందులో సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ ములుగు జిల్లా అధ్యక్షుడుగా పి ముఖేష్,ఆర్టీఐ కార్యకర్త గొల్కొండ రాజు సభ్యులుగా నియమితులయ్యారు.జిల్లాలో సమాచార హక్కు చట్టం అమలును సమీక్షించేందుకు ప్రతి మూడు నెలలకోసారి త్రైమాసిక సమావేశాలు నిర్వహించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు .చట్టం అమలుకు అవసరమైన చర్యలు తీసుకోవడంతోపాటు సమీక్షా సమావేశాల్లో చర్చించిన అంశాలు,అమలు తీరుపై ప్రభుత్వానికి నివేదికలు సమర్పించాల్సి ఉంటుంది.ప్రభుత్వ శాఖల్లో సమాచార హక్కు చట్టం అమలు తీరును పర్యవేక్షించడం, పారదర్శకతను పెంపొందించడం, ప్రజలకు సమాచారాన్ని పొందే హక్కు సక్రమంగా అందేలా చూడటం ఈ కమిటీ ప్రధాన లక్ష్యాలుగా ఉన్నాయి.

# గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదును వేగవంతం చేయాలి

### చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి- రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ శ్రేణులకు డీసీసీ అధ్యక్షురాలి పిలుపు

**సన్నాయి హనుమంతరావు । జాయింట్ బ్యూరో । రంగారెడ్డి జిల్లా మీడియాటుడేఅక్టోబర్ 27 న్యూస్:**
హైదరాబాద్--రంగారెడ్డి--మహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హులైన గ్రాడ్యుయేట్ల ఓటరు నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షురాలు చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా సామ రామ్మోహన్ రెడ్డిని ప్రకటించిన నేపథ్యంలో, ఆయన విజయమే లక్ష్యంగా క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రంగారెడ్డి జిల్లా ఇంచార్జీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు జిల్లాలోని ప్రతి నియోజకవర్గం, డివిజన్, మండల స్థాయిలో ఓటరు నమోదు కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టాలని ఆమె కోరారు. జిల్లా నాయకులు, నియోజకవర్గ ఇంచార్జీలు, డివిజన్, మండల అధ్యక్షులు, కార్యకర్తలు, బూత్ లెవల్ ఏజెంట్లు (దీూాలు) సమన్వయంతో పనిచేసి అర్హులైన పట్టభద్రులను గుర్తించాలని పేర్కొన్నారు.

**క్షేత్రస్థాయిలో విస్తృత ప్రచారం**
జిల్లాలోని కోర్టులను సందర్శించి న్యాయవాదులు, న్యాయ విద్య పూర్తి చేసిన అర్హులైన పట్టభద్రులకు ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించాలని సూచించారు. అదేవిధంగా కళాశాలలు, పాఠశాలల్లో పనిచేస్తున్న అర్హులైన ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ఇతర ఉద్యోగులను కలిసి నమోదు కార్యక్రమాన్ని నిర్వహించాలని కోరారు.ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులతో పాటు ఇంజినీరింగ్, ఐటీ కంపెనీలు, ఫ్యాక్టరీలు, ఇతర ప్రైవేట్ సంస్థల్లో పనిచేస్తున్న అర్హులైన గ్రాడ్యుయేట్లను కూడా గుర్తించి ఓటరు నమోదుకు ప్రోత్సహించాలని తెలిపారు.

**ప్రతి మండలంలో 20 మంది దీూాల గుర్తింపు**
ప్రతి మండలం, డివిజన్‌లో 20 మంది క్రియాశీలక దీూాలను గుర్తించి, ఒక్కొక్కరు కనీసం 1,000 మంది పట్టభద్రుల ఓటరు



నమోదుకు కృషి చేసేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. మీసేవా కేంద్రాల వద్ద ప్రతిరోజూ ఉదయం గంట, సాయంత్రం గంట చొప్పున శిబిరాలు నిర్వహించి, అర్హులైన వారికి అవసరమైన సమాచారం అందించాలని పేర్కొన్నారు.అలాగే మండల, డివిజన్ స్థాయిల్లో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి, ఇంకా ఓటరు నమోదు చేసుకోని అర్హులైన పట్టభద్రులను గుర్తించాలని తెలిపారు. ప్రతిరోజూ నిర్వహించిన కార్యక్రమాలు, సందర్శించిన ప్రాంతాలు, కలిసిన వ్యక్తుల వివరాలు, ఫొటోలను సంబంధిత వాట్సాప్ గ్రూపుల్లో అప్‌లోడ్ చేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు.జిల్లాలోని అర్హులైన ప్రతి పట్టభద్రుడికి ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించి, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సామ రామ్మోహన్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించేందుకు నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి పిలుపునిచ్చారు.

# ఎల్‌నినో నేపథ్యంలో తాగునీటి సరఫరాకు ముందస్తు చర్యలు చేపట్టాలి

**నవంబర్ 15 నుంచి డిసెంబర్ 31 వరకు తాగునీటి వసతులపై ప్రత్యేక కార్యాచరణ**

**ఉపాధి పనుల్లో కూలీల భాగస్వామ్యాన్ని పెంచాలి -క్షేత్రస్థాయి పర్యవేక్షణతో నిర్దేశిత గడువుల్లో లక్ష్యాలు పూర్తి చేయాలి**

**జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు**

**ములుగు జిల్లా అక్టోబర్27(మీడియా టుడే)**
ఎల్‌నినో నేపథ్యంలో తాగునీటి సరఫరాలో అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు అధికారులను ఆదేశించారు.
తాగునీటి వనరులు, సరఫరా వ్యవస్థల పరిస్థితిని ఆవాసాల వారీగా పరిశీలించి, అవసరమైన మరమ్మతులు, ప్రత్యామ్నాయ ఏర్పాట్లకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. ఉపాధి హామీ పనుల్లో కూలీల భాగస్వామ్యాన్ని పెంచుతూ, నిర్దేశించిన లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలన్నారు.మంగళవారం ములుగు కలెక్టరేట్‌లో పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా, ఉపాధి హామీ విభాగాల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఎల్‌నినో సన్నద్ధత, తాగునీటి వసతులు, జలసిరి పనులు, ఉపాధి కూలీల హాజరు, ఒదిరమ్మ ఇళ్ల నిర్మాణంలో పనిదినాల కల్పన తదితర అంశాలపై కలెక్టర్ సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నవంబర్ 15 నుంచి డిసెంబర్ 31 వరకు జిల్లాలోని అన్ని ఆవానెల్లో తాగునీటి సరఫరా మౌలిక వసతులపై ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు. గ్రిడ్ ద్వారా ఆవాసాలు, పట్టణ ప్రాంతాలకు అందుతున్న శుద్ధి చేసిన నీటి సరఫరాతోపాటు, గ్రామాల్లో ప్రతి ఇంటికీ నీరు చేరుతున్న తీరును పరిశీలించాలని ఆదేశించారు.ప్రత్యేక కార్యాచరణకు ముందుగా నవంబర్ రెండో వారంలోగా మిషన్ భగీరథ ఇంట్రా, గ్రిడ్ ఈఈలు, జిల్లా పంచాయతీ అధికారి సమన్వయంతో మండల స్థాయి సమావేశాలు నిర్వహించాలని సూచించారు. ఇంట్రా, గ్రిడ్ ఏఈలు, ఏఈఈలు, ఎంపీఓలు, సంబంధిత గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులతో మండల బృందాలను ఏర్పాటు చేసి, రోజువారీ పర్యటనల ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు.చేతిపంపులు, సింగిల్ ఫేజ్, త్రీ ఫేజ్ మోటార్లకు అవసరమైన మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలని కలెక్టర్ ఆదేశించారు. పైపులైన్లు, స్లూయిస్ వాల్వుల వద్ద లీకేజీలను అరికట్టాలని సూచించారు. ఓవర్‌హెడ్ నీటి ట్యాంకులను నిర్ణీత తేదీల్లో శుభ్రపరచడంతోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని



పేర్కొన్నారు. ట్యాంకుల మ్యాన్‌హోల్ మూతలు, కీటకాలు ప్రవేశించకుండా ఉండే వెంటిలేటర్ల జాలీలు, మెట్ల పరిస్థితిని పరిశీలించి అవసరమైన మరమ్మతులు చేయాలన్నారు.నీటి శుద్ధికి క్రమం తప్పకుండా బ్లీచింగ్ పౌడర్ వినియోగిస్తూ, సరఫరా చివరి ప్రాంతంలో అవశేష క్లోరిన్ స్థాయిని పరీక్షించాలని సూచించారు. అవసరమైన బ్లీచింగ్ పౌడర్ నిల్వలు అందుబాటులో ఉంచాలని, ప్రతి ఇంటి నల్లా కనెక్షన్ పనిచేసేలా చూడాలని పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో వినియోగించేందుకు నీటి ట్యాంకర్లను సిద్ధంగా ఉంచడంతోపాటు నిర్వహణ రిజిస్టర్లను ఎప్పటికప్పుడు నవీకరించాలని ఆదేశించారు.భూగర్భ జలమట్టాలు తగ్గడం, స్థానిక నీటి వనరులు ఎండిపోవడం, తాగునీటి కొరత ఏర్పడే అవకాశం ఉన్న ఆవాసాలను ముందుగానే గుర్తించాలని కలెక్టర్ సూచించారు. ప్రస్తుతం ఉన్న నీటి వనరుల స్థిరత్వం, సరఫరా వ్యవస్థ సామర్థ్యం, నీటి నిల్వ సదుపాయాలు, స్థానిక ప్రత్యామ్నాయ వనరులను అంచనా వేయాలన్నారు. సమస్యాత్మక ఆవాసాల వివరాలను కార్యాచరణ ప్రణాళికతో సహా సంబంధిత ఈఈ, జిల్లా పంచాయతీ అధికారి దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. అవసరమైన చోట ప్రత్యామ్నాయ నీటి సరఫరా ఏర్పాట్లు చేపట్టేలా గ్రామ పంచాయతీలకు సూచనలు ఇవ్వాలన్నారు.మండల బృందాలు ఆవాసాల వారీగా రోజువారీ నివేదికలను మిషన్ భగీరథ ఇంట్రా ఈఈ, జిల్లా పంచాయతీ అధికారికి అందించాలని సూచించారు. వాటిని క్రోడీకరించి జిల్లా స్థాయి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. పెండింగ్ సమస్యలను అవసరానికి అనుగుణంగా మండల, జిల్లా స్థాయి సమావేశాల్లో పరిష్కరించాలన్నారు.ఉపాధి హామీ పనులపై సమీక్షిస్తూ గ్రామ పంచాయతీలు, ఆవాసాల వారీగా కూలీల హాజరును పరిశీలించి, తక్కువగా ఉన్న చోట పెంచేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపడుతున్న లబ్ధిదారులకు ఉపాధి పనిదినాల కల్పన, సంబంధిత వివరాల నమోదుపై దృష్టి సారించాలన్నారు. గత పనుల చెల్లింపుల్లో ఆలస్యం, సాఫ్ట్‌వేర్‌లో వివరాల నమోదుకు సంబంధించిన సమస్యలను అధికారులు వివరించారు.నీటి కుంటలు, ఇందిరా జలప్రభ, కమ్యూనిటీ ఇంకుడు గుంతలు, వర్మీ కంపోస్టు ట్యాంకులు తదితర పనులకు అంచనాల సమర్పణ నుంచి అనుమతుల మంజూరు వరకు ప్రతి దశను నిర్దిష్ట కాలపరిమితిలో పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సంబంధిత సిబ్బంది సహకారంతో ఈ ప్రక్రియలను సకాలంలో పూర్తి చేయించే బాధ్యత ఎంపీడీఓలదేనని స్పష్టం చేశారు. అధికారులు ఉదయం నుంచే క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పనులు, సిబ్బంది విధులను పర్యవేక్షించాలని సూచించారు. మండల స్థాయిలో సమావేశాలు నిర్వహించి పంచాయతీల వారీగా లక్ష్యాలు కేటాయించాలని, తదుపరి సమీక్ష నాటికి స్పష్టమైన పురోగతి చూపాలని ఆదేశించారు. ఇన్‌చార్జి ఎంపీడీఓలు కూడా తమ మండల పనులపై పూర్తి బాధ్యత వహించాలని పేర్కొన్నారు.పంచాయతీరాజ్ శాఖకు సంబంధించి అందుతున్న ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. సంతకాల ఫోర్జరీ వంటి తీవ్రమైన ఆరోపణలను సాధారణ పొరపాట్లుగా పరిగణించరాదని స్పష్టం చేశారు. సిబ్బంది తమకు నిర్దేశించిన విధులను సక్రమంగా నిర్వర్తించేలా పర్యవేక్షించాలని, ఉద్దేశపూర్వక నిర్లక్ష్యాన్ని సహించబోమని పేర్కొన్నారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, డి ఆర్ డి ఓ రవీందర్, డి పి ఓ వెంకయ్య, ఆర్ డబ్ల్యూఎస్ సునీత, ఎంపీడీఓలు, ఎంపీఓలు, పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా శాఖల ఈఈలు, జిల్లా పంచాయతీ అధికారి, ఏపీఓలు, ఈసీలు, టెక్నికల్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ అమరుల త్యాగం వెలకట్టలేనివి : జిల్లాఎస్పీ టి. శ్రీనివాస రావు



**గద్వాల జిల్లా మీడియా టుడే ప్రతినిధి జి నాగరాజు ( అక్టోబర్ 27)**
పోలీస్ అమరవీరుల త్యాగం వెలకట్టలేనివని, పోలీస్ అమరవీరుల సంస్మరణ కార్యక్రమాలలో వారి త్యాగాలను స్మరించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉన్నదని జిల్లా ఎస్పీటి.శ్రీనివాస రావు అన్నారు.పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం ( అక్టోబర్ 21 ర్) ను పురష్కరించుకొని ఫ్లాగ్ డే ఈవెంట్స్ లో భాగంగా మంగళవారం జిల్లా పోలీస్, బీచుపల్లి 10 వ బెటాలియన్ పోలీస్ లు సంయుక్తంగా నిర్వహించిన, బైక్ ర్యాలీని జిల్లా పోలీస్ కార్యాలయం వద్ద జిల్లా ఎస్పీ జెండా ఊపి ప్రారంభించారు.ర్యాలీ లో భాగంగా జిల్లా ఎస్పీ కూడా స్వయంగా బైక్ నడిపి ర్యాలీలో పాల్గొన్నారు.అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ప్రజా రక్షణలో,శాంతి భద్రతల పరిరక్షణలో నిబద్ధతతో విధి నిర్వహణ చేస్తూ, ప్రాణాలను సైతం లెక్క చేయకుండా, ముందుకు సాగుతున్న పోలీసుల కృషి అభినందనీయమని అన్నారు.దేశ వ్యాప్తంగా ప్రజా క్షేమం కోసం పని చేస్తూ అమరులైన వారి త్యాగాలను స్మరించుకుంటూ ప్రతి సంవత్సరం పోలీస్ ఫ్లాగ్ డే కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు.అమరుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని,ప్రజలతో మరింత మమేకం అవుతూ, ప్రజలకు సత్వర సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామని అన్నారు.జిల్లా కేంద్రం లోని జిల్లా పోలీస్ కార్యాలయం నుండి మొదలైన ర్యాలీ కలెక్టరేట్, ఫ్లైఓవర్, రాజీవ్ మార్గ్,"హ= చౌక్, న్యూ బస్ స్టాండ్, కృష్ణవేణి చౌక్, అంబేద్కర్ చౌక్, ఫ్లైఓవర్ మీదుగా తిరిగి జిల్లా పోలీస్ కార్యాలయం వరకు నిర్వహించారు.300 మంది పోలీస్ అధికారులు, సిబ్బంది ఈ బైక్ ర్యాలీ లో పాల్గొన్నారు.ఈ బైక్ ర్యాలీలో జిల్లా అదనపు ఎస్పీ కె.శంకర్ బీచుపల్లి 10 వ బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ ఆది నారాయణ డి.ఎస్పీ మొగిలయ్య,సాయుధ దళ డి.ఎస్పీ నరేందర్ రావు, అసిస్టెంట్ కమాండెంట్ లు వెంకట రమణ,పార్థ సారథి రెడ్డి,గద్వాల్ ఎఱ టంగాటూరి శ్రీను అలంపూర్ సి ఐ ప్రదీప్,ఆర్.ఐ.లు వెంకటేష్, నరేష్,హరీఫ్, బెటాలియన్ ఆర్.ఐ. లు రాజేశం, తిరుపతి, శ్రీనివాస్, నరసింహ రాజు జిల్లా పోలీస్ సిబ్బంది బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఇరిగేషన్ భూముల ఆక్రమణలను సహించేది లేదు

### ధర్మసాగర్ చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో అక్రమ నిర్మాణాలు తొలగించాలి: కలెక్టర్ భవేశ్ మిశ్రా

**నిర్మల్ పట్టణం: ట్యాంక్ బండ్: మీడియా టుడే సబ్ ఎడిటర్ అక్టోబర్ 27, 2026**
జిల్లాలో నీటిపారుదల శాఖకు చెందిన భూములు అన్యాక్రాంతం కాకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశించారు. ప్రభుత్వ భూముల ఆక్రమణలకు పాల్పడే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.మంగళవారం పట్టణంలోని ధర్మసాగర్ చెరువు ఎఫ్‌టీఎల్ (పూర్తి నీటిమట్టం) పరిధిలో ఆక్రమణలను కలెక్టర్ పరిశీలించారు. చెరువుకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకుని, మ్యాపులను పరిశీలించారు. ఎఫ్‌టీఎల్ పరిధిలో అక్రమంగా వెంచర్ ఏర్పాటు చేసేందుకు చేపట్టిన నిర్మాణాలను తక్షణమే తొలగించాలని ఆదేశించారు. సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీ చేయాలని సూచించారు. ధర్మసాగర్ చెరువు వద్ద అనధికారికంగా నిర్మించిన లేఅవుట్ ఫెన్సింగ్ గోడను అధికారులు కూల్చివేశారు. వెంచర్ నిర్మాణ పనులకు



వినియోగిస్తున్న యంత్రాలు, సామగ్రి, ఇసుక తదితర వస్తువులను స్వాధీనం చేసుకుని, నిబధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.జిల్లాలోని నీటిపారుదల శాఖ భూములు, చెరువుల పరిధిలో ఆక్రమణలు జరగకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఆక్రమణలను గుర్తించడంలో నిర్లక్ష్యం వహించరాదని, ప్రభుత్వ భూముల పరిరక్షణకు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు.ఈ పరిశీలనలో నీటిపారుదల శాఖ ఈఈ అనిల్, మున్సిపల్ కమిషనర్ రవిబాబు, తహశీల్దార్ రాజు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పోస్టలు శాఖ బీమాతో కుటుంబానికి ఆర్థిక భరోసా



**గద్వాల జిల్లా మీడియా టుడే ప్రతినిధి జి నాగరాజు (అక్టోబర్ 27)**
గద్వాల పోస్టల్ శాఖ అందిస్తున్న పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ (పీఎల్ఐ), రూరల్ పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ (ఆర్‌పీఎల్ఐ) పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పోస్టల్ ఏఎస్పీ ఎం.రవికుమార్ సూచించారు. జోగు లాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని ప్రధాన తపాలా కార్యాలయంలో మహబూబ్‌నగర్ పోస్టల్ ఎస్పీ ఆదేశాల మేరకు పీఎల్ఐ,ఆర్‌పీఎల్ఐ బీమా పథకాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎం రవికుమార్ మాట్లాడుతూ పోస్టల్ శాఖ అందిస్తున్న బీమా పథకాలు కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పిస్తాయని అన్నారు ప్రస్తుతం ఈ పథకాలు మున్సిపల్ పరిధిలోనూ అందుబాటులో ఉన్నాయని తెలిపారు.అనంతరం కొత్త బస్టాండ్,కృష్ణవేణి చౌక్‌తో పాటు ప్రధాన రహదారుల వెంట ప్రజలకు పోస్టల్ బీమా పథకాల ప్రయోజనాలను వివరించి ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో మెయిల్ ఓవర్సీర్లు బీపీఎంలు ఏబీపీఎంలు డాక్ సేవక్‌లు తదితరులు పాల్గొన్నారు.

# రైతుల సమన్వయంతో రీ-సర్వే పూర్తి చేయాలి

## జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

**నిర్మల్ జిల్లా: కుంటాల మండలం మీడియా టుడే సబ్ ఎడిటర్:అక్టోబర్ 27, 2026**



రైతులను సమన్వయం చేసుకుంటూ భూముల రీ-సర్వే ప్రక్రియను పకడ్బందీగా, వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. మంగళవారం కుంటాల మండలం రాజాపూర్ తాండలో కొనసాగుతున్న భూముల రీ-సర్వే పనులను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామంలో చేపడుతున్న సర్వే పురోగతిని, ఇప్పటివరకు పూర్తయిన పనుల వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. భూముల హద్దుల నిర్ధారణలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించి సర్వే చేపట్టాలని సూచించారు. సర్వే ప్రక్రియలో రైతులకు అవసరమైన అవగాహన కల్పిస్తూ, వారి సమన్వయంతో పనులు చేపట్టాలని అన్నారు. సర్వే సమయంలో సంబంధిత అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. రీ-సర్వే పనులను మరింత సులభతరం చేసి వేగవంతం చేసేందుకు త్వరలో అదనంగా ఆధునిక సర్వే పరికరాలను అందుబాటులోకి తీసుకువస్తామని కలెక్టర్ తెలిపారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని సర్వే సిబ్బంది ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించే సిబ్బంది వద్ద తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు తప్పనిసరిగా అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు.ఈ తనిఖీల్లో తహసీల్దార్ కమల్ సింగ్, రెవెన్యూ, సర్వే శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు మొబైల్ ఫోన్ వినియోగాన్ని తగ్గించాలి

### సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి -నర్సంపేట సీఐ ఎం. శ్రీనివాస్

### సైబర్ నేరం జరిగిన వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలి : ఎస్ఐ నిహారిక



**వరంగల్ /నర్సంపేట, అక్టోబర్ 27, మీడియా టుడే**
నర్సంపేట పట్టణంలోని ఎస్ ఆర్ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో మంగళవారం సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నర్సంపేట సీఐ ఎం. శ్రీనివాస్, నూతన ఎస్ఐ నిహారిక హాజరై విద్యార్థులకు సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ ఎం. శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రస్తుత డిజిటల్ యుగంలో సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ వాటిపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ముఖ్యంగా విద్యార్థులు చదువుపై దృష్టి సారించి, మొబైల్ ఫోన్ల వినియోగాన్ని తగ్గించాలని తెలిపారు. వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సామాజిక మాధ్యమాలను అవసరమైన మేరకే ఉపయోగించాలని, అపరిచిత వ్యక్తులు పంపించే లింకులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఓపెన్ చేయవద్దని హెచ్చరించారు.అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి ఓటీపీ అడిగినా చెప్పకూడదని, బ్యాంకు ఖాతా వివరాలు, పాస్‌వర్డ్‌లు, వ్యక్తిగత సమాచారాన్ని ఇతరులతో పంచుకోవద్దని సూచించారు. తమ బ్యాంకు ఖాతాల్లోకి తెలియని వ్యక్తుల నుంచి డబ్బులు జమ అయితే వాటిని స్వయంగా తిరిగి పంపకుండా వెంటనే బ్యాంకు అధికారులకు, పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. ఆన్‌లైన్ మోసాలు, నకిలీ బహుమతుల ప్రకటనలు, ఉద్యోగాల పేరుతో జరిగే మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ నిహారిక మాట్లాడుతూ, సైబర్ నేరగాళ్లు వివిధ పద్ధతుల్లో ప్రజలను మోసం చేస్తున్నారని, విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని బాధ్యతాయుతంగా వినియోగించుకోవాలని సూచించారు. సోషల్ మీడియాలో అపరిచిత వ్యక్తులతో వ్యక్తిగత వివరాలు, ఫొటోలు పంచుకోవద్దని తెలిపారు. ఎవరైనా సైబర్ నేరానికి గురైతే భయపడకుండా వెంటనే 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని, అత్యవసర పరిస్థితుల్లో 112 నంబర్‌కు కాల్ చేయాలని సూచించారు. ముఖ్యంగా ఆన్‌లైన్‌లో డబ్బులు పోగొట్టుకున్నప్పుడు ఆలస్యం చేయకుండా ఫిర్యాదు చేస్తే డబ్బుల బదిలీని అడ్డుకునే అవకాశం ఉంటుందని వివరించారు.విద్యార్థులు సైబర్ భద్రతా నియమాలను పాటిస్తూ తమ కుటుంబ సభ్యులు, స్నేహితులకు కూడా అవగాహన కల్పించాలని పోలీసు అధికారులు సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు సురక్షితమైన మొబైల్ వినియోగం, వ్యక్తిగత సమాచార రక్షణ, సైబర్ నేరాల నివారణపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఎస్ ఆర్ ఒకేషనల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కొయ్యడి సనత్ కుమార్, పారామెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ శిరీష, వైస్ ప్రిన్సిపాల్ సూరయ్య, సంతోష్, వెంకన్న, రమేష్ నాయక్, లయన్ ప్రవీణ్, హరి భూషణ్, సందీప్, శ్వేత, నజీమా, కుమార్, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల వికాసానికి ఆచరణాత్మక బోధనే ముఖ్యం

### కేజీబీవీలో మౌలిక వసతులు కల్పిస్తాం -జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

**నిర్మల్ జిల్లా: కుంటాల మండలం మీడియా టుడే సబ్ ఎడిటర్ అక్టోబర్ 27, 2026**



విద్యార్థులు పాఠ్యాంశాలను కేవలం పుస్తకాలకే పరిమితం చేయకుండా, నిత్యజీవిత అనుభవాలతో అనుసంధానం చేసుకొని నేర్చుకునేలా ఆచరణాత్మక బోధన అందించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా సూచించారు.మంగళవారం కుంటాల మండలం కల్లూరు గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)ను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వసతి గృహం, తరగతి గదులు, పరిసరాలను పరిశీలించి విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు.వసతి గృహ ప్రాంగణంలో ప్రతిరోజూ మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం అన్ని పూటలా నాణ్యమైన, పరిశుభ్రమైన భోజనం అందించాలని సూచించారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు శాతం వందకు చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు. వసతి గృహంలోని నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు రూ.4.80 లక్షలు కేటాయించినట్లు కలెక్టర్ తెలిపారు. డ్రైనేజీ నిర్మాణంతో పాటు అవసరమైన ఇతర మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. కోతుల బెడద నివారణకు సోలార్ కంచె ఏర్పాటు చేస్తామని తెలిపారు. తరగతి గదుల్లో విద్యార్థుల అవసరాన్ని బట్టి ప్రాధాన్యత క్రమంలో బెంచీలు సమకూరుస్తామని పేర్కొన్నారు.అనంతరం పదో తరగతి విద్యార్థులతో కలెక్టర్ ముఖాముఖిగా మాట్లాడారు. వారి చదువు, విద్యా ప్రగతిపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం జీవశాస్త్రంలోని ఒక అంశాన్ని స్వయంగా బోధించి, విద్యార్థులను ప్రశ్నలు అడుగుతూ వారి అవగాహనను పరిశీలించారు.పాఠ్యాంశాలను నిత్యజీవితంలోని అంశాలతో అనుసంధానం చేసుకొని చదివితే విషయ పరిజ్ఞానం మరింత మెరుగుపడుతుందని విద్యార్థులకు సూచించారు. వివిధ రకాల కూరగాయలను తెప్పించి వాటి బరువును విద్యార్థులతో ముందుగా అంచనా వేయించారు. అనంతరం తూనిక యంత్రంతో బరువును కొలిపించి సరైన అంచనా వేసిన విద్యార్థులను అభినందించారు. వారికి పెన్నులను బహుమతులుగా అందించారు. నిత్యజీవితంలోని చిన్న చిన్న అంశాల నుంచి కూడా విజ్ఞానాన్ని పొందాలని సూచించారు.ఈ తనిఖీల్లో జిల్లా విద్యాశాఖ అధికారి భోజన్న, తహసీల్దార్ కమల్ సింగ్, ఎంపీఓ శోభన, ఎంఈఓ ముత్యం, సర్పంచ్ దశరథ్, సర్వే అధికారులు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాద బాధితులకు పీఎం రహత్ పథకం వరం

**ఏడు రోజుల పాటు రూ.1.5 లక్షల వరకు నగదు రహిత వైద్యం.**

**ప్రమాదం జరిగిన వెంటనే 112కు కాల్ చేయాలి: పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత.**

**వరంగల్ అక్టోబర్ 27 మీడియా టుడే**



రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన బాధితులు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం రహత్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత సూచించారు. ఈ పథకం ద్వారా అర్హులైన రోడ్డు ప్రమాద బాధితులకు గరిష్ఠంగా ఏడు రోజుల పాటు రూ.1.5 లక్షల వరకు నగదు రహిత వైద్య చికిత్స పొందే అవకాశం ఉందని తెలిపారు.వరంగల్, హనుమకొండ, జనగామ జిల్లాల పరిధిలోని 63 ఎంప్యానెల్డ్ ఆసుపత్రుల్లో ఈ పథకం కింద వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదం జరిగినప్పుడు బాధితులకు సకాలంలో వైద్యం అందించడం ద్వారా ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందని తెలిపారు.ప్రమాదం జరిగిన వెంటనే బాధితులకు అత్యవసర సహాయం అందించేందుకు ప్రజలు 112కు కాల్ చేయాలని పోలీస్ కమిషనర్ సూచించారు. రోడ్డు ప్రమాద బాధితులకు అందుబాటులో ఉన్న ఈ పథకంపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని, అత్యవసర పరిస్థితుల్లో తక్షణమే స్పందించి బాధితులకు సహాయం అందించాలని ఆమె కోరారు.

# పెండెం కట్టయ్య సేవలు చిరస్మరణీయం

**ఆయన ఆశయాలను కొనసాగిస్తూ కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాలి**

**పట్టణ మాజీ విశ్వకర్మ అధ్యక్షులు దేవోజు సదానందం**

**నర్సంపేట, అక్టోబర్ 27 మీడియా టుడే న్యూస్**

నర్సంపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, స్వాతంత్ర్య సమరయోధుడు, కీర్తిశేషులు పెండెం కట్టయ్య 29వ వర్ధంతిని పురస్కరించుకొని మంగళవారం నర్సంపేట పట్టణంలో ఆయన విగ్రహానికి ఘనంగా నివాళులర్పించారు.నర్సంపేట పట్టణ విశ్వకర్మ మాజీ అధ్యక్షులు దేవోజు సదానందం, టి పి సి సి సభ్యులు పెండెం రామానంద్, నర్సంపేట పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పంబి వంశీకృష్ణతో కలిసి పెండెం కట్టయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా దేవోజు సదానందం మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ కోసం పెండెం కట్టయ్య చేసిన సేవలు, ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని అన్నారు. నర్సంపేటలో కాంగ్రెస్ పార్టీ బలంగా నిలబడటానికి పెండెం కట్టయ్య చేసిన కృషి ఎంతో ఉందని పేర్కొన్నారు.ఆయన చూపించిన మార్గంలో నడుస్తూ, ఆయన ఆశయాలను కొనసాగిస్తూ కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాల్సిన బాధ్యత ప్రతి నాయకుడు, కార్యకర్తపై ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదలు, ప్రజల కోసం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. పెండెం కట్టయ్య ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ పట్టుదలతో పనిచేయాలని కోరారు.అదేవిధంగా పెండెం కట్టయ్య ఆశయాలను కొనసాగిస్తూ ఆయన మనుమడు పెండెం రామానంద్ౣాజజ సభ్యుడిగా అంచెలంచెలుగా ఎదుగుతున్నారని తెలిపారు. ఆయన సతీమణి పెండెం శ్రీలక్ష్మి గతంలో కౌన్సిలర్‌గా, ప్రస్తుతం మున్సిపల్ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు నిర్వహిస్తూ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సహకారంతో నర్సంపేట పట్టణ ప్రజలకు అందుబాటులో ఉంటూ పట్టణ అభివృద్ధికి కృషి చేస్తున్నారని దేవోజు సదానందం పేర్కొన్నారు.

# తలసేమియా బాధితుల కోసం రక్తదాన శిబిరం



**నడిగూడెం, అక్టోబర్27. మీడియా టుడే;**

ఈరోజు కోదాడ సబ్ డివిజన్ పోలీసులు ఆధ్వర్యంలో పోలీసుల అమరవీరుల సంస్కరణ వారోత్సవాలు పురస్కరించుకొని తల సేమియా తో బాధపడుతున్న పిల్లల కోసం రక్తదాన శిబిరం జరిగింది నడిగూడెం ఎస్ఐ తేజస్విని ఆధ్వర్యంలో జుఖ పేట తాండ లో రాము నాయక్ యూత్ సభ్యులు వీరబాబు, చాంప్ల నాయక్, వెంకటేశ్వర్లు కిషోర్ రాము నాయక్ పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా నడిగూడెం ఎస్ఐ తేజస్విని మాట్లాడుతూ తలసీమియా వ్యాధితో బాధపడుతున్న పిల్లల కోసము రక్తదానం చేయటం హర్షినియమని అన్నారు

# నవంబర్ 2లోపే దరఖాస్తు.. లేదంటే బాణాసంచా విక్రయాలకు నో!

**- వ్యాపారులు పూర్తి ధ్రువపత్రాలతో సంబంధిత**

**డీఎస్పీ కార్యాలయాల్లో సమర్పించాలి: ఎస్పీ రోహిత్ రాజు**

**భద్రాద్రి కొత్తగూడెం, అక్టోబర్27**
**((మీడియా టుడే):**




దీపావళి పండుగ సందర్భంగా జిల్లాలో తాత్కాలిక బాణాసంచా విక్రయ కేంద్రాల ఏర్పాటుకు అనుమతులు కోరే వ్యాపారులు నవంబర్ 2వ తేదీలోపు సంబంధిత డీఎస్పీ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ సూచించారు.దరఖాస్తుతో పాటు అగ్నిమాపక శాఖ ఎన్‌ఓసీ, స్థల యజమాని లేదా సంబంధిత ప్రభుత్వ అధికారి అనుమతి పత్రం, జీఎస్‌టీ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, గతంలో లైసెన్స్ పొందినట్లయితే దాని ప్రతిని జతచేయాలని తెలిపారు. అవసరమైన చోట పక్క స్థలాల యజమానుల అనుమతి పత్రాలు, విక్రయ కేంద్రం సైట్ ప్లాన్‌తో పాటు నిర్ణీత రుసుము చెల్లించిన బ్యాంకు చలాన్‌ను కూడా సమర్పించాలని పేర్కొన్నారు.దరఖాస్తులను పరిశీలించి నిబంధనల ప్రకారం సంబంధిత డీఎస్పీ స్థాయి అధికారులు అనుమతులు జారీ చేస్తారని ఎస్పీ తెలిపారు. అనుమతులు లేకుండా బాణాసంచా విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజల భద్రత దృష్ట్యా వ్యాపారులు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

# డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన ముగ్గురికి జైలు శిక్ష.

**- మద్యం తాగి వాహనాలు నడిపితే**

**కఠిన చర్యలు తప్పవు: ట్రాఫిక్ ఎస్‌హెచ్‌ఓ**

**భద్రాద్రి కొత్తగూడెం, అక్టోబర్ 27**
**(మీడియా టుడే):**




మద్యం సేవించి వాహనాలు నడుపుతూ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన ముగ్గురికి న్యాయస్థానం రెండు రోజుల సాధారణ జైలు శిక్ష విధించింది.టేకులపల్లి మండలం వెంకట్యా తండాకు చెందిన జార్పుల రమేష్, సులానగర్‌కు చెందిన గుగులోతు రమేష్, రాంపూర్‌కు చెందిన గుగులోతు సాయికుమార్‌లపై కొత్తగూడెం ట్రాఫిక్ పోలీసులు కేసులు నమోదు చేసి న్యాయస్థానంలో హాజరుపరిచారు. విచారణ అనంతరం కొత్తగూడెం రెండో జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు ముగ్గురికీ రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించింది.మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగి ఇతరుల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందని ట్రాఫిక్ ఎస్‌హెచ్‌ఓ ప్రవీణ్ కుమార్ హెచ్చరించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిరంతరం కొనసాగిస్తామని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# ఖేలో ఇండియా జూనియర్ ఖో-ఖో నేషనల్ క్యాంప్ శిక్షణకు భీమవరం విద్యార్థులు

**మీడియా టుడే ఎర్రుపాలెం:**

ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం భీమవరం వేమిరెడ్డి వెంకటరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినిలు తల్లపురెడ్డి. సంజన 8 వ తరగతి విద్యార్థిని ఖేలో ఇండియా ఖో – ఖో నేషనల్ క్యాంప్ (45 రోజులు) శీలం. తేజశ్రీ 10 వ తరగతి విద్యార్థిని జూనియర్ ఖో – ఖో నేషనల్ క్యాంప్ (15 రోజులు) సరూర్ నగర్ ఇండోర్ స్టేడియం హైదరాబాద్ క్యాంపస్ శిక్షణకు మంగళవారం బయలుదేరి వెళ్లారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిహెచ్ ఉపేందర్ ,పి డి నరాల సాంబశివారెడ్డి ఒక ప్రకటనలో తెలియజేశారు. అక్కడ జరిగే శిక్షణా శిబిరం లో కూడా మంచి ప్రతిభను కనబర్చి తెలంగాణ రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించాలని గ్రామ పంచాయతీ సర్పంచ్ వంగల నాగేశ్వరరావు, వైస్ సర్పంచ్ గుర్రాల. శ్రీనివాసరెడ్డి ఏ ఏ పీ సి చైర్మన్ తులిసమ్మ , పాఠశాల సిబ్బంది, గ్రామ పెద్దలు, విద్యార్థినిల తల్లిదండ్రులు, విద్యార్థిని విద్యార్థులు అభినందనలు తెలియజేసినారు

# ఎల్‌నినో పరిస్థితులపై అప్రమత్తంగా ఉండి సాగు

# తాగునీటి సరఫరా పై ముందస్తు చర్యలు చేపట్టాలి

**జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్-గోదావరి పుష్కరాలు--2027 పనులు వెంటనే ప్రారంభించి గడువులోగా పూర్తి చేయాలి**

**యాసంగిలో వరి సాగును తగ్గించి తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలి**

**ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు సిద్ధం చేయాలి : ఎమ్మెల్యే డాక్టర్ కే.సంజయ్ కుమార్**



**జగిత్యాల మీడియా టుడే-అక్టోబర్ 27**

ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని యాసంగి సాగు, తాగునీటి సరఫరా, భూగర్భ జలాల సంరక్షణపై అధికారులు ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ ఆదేశించారు. మంగళవారం జగిత్యాల జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ కుమార్, అదనపు కలెక్టర్‌తో కలిసి సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్‌నినో ప్రభావం, వర్షపాతం, ఖరీఫ్ పంటల పరిస్థితి, యాసంగి సాగు ప్రణాళిక, ఉద్యాన పంటలు, తాగునీటి సరఫరా, పశుగ్రాసం, ప్రజారోగ్యం, గోదావరి పుష్కరాలు--2027 ఏర్పాట్లపై సమగ్రంగా సమీక్షించారు.జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ, జూన్ 1 నుంచి అక్టోబర్ 26 వరకు జిల్లాలో సాధారణ వర్షపాతం 3,794.8 మి.మీ. కాగా, వాస్తవంగా 2,982.1 మి.మీ. వర్షపాతం నమోదైందని అధికారులు వివరించారు. సాధారణ వర్షపాతంతో పోలిస్తే 21 శాతం లోటు నమోదైందని, గత ఏడాదితో పోలిస్తే వర్షపాతం 30 శాతం తక్కువగా ఉందని తెలిపారు. ఇబ్రహీంపట్నం మండలంలో 27 శాతం, కోరుట్లలో 22 శాతం, మేడిపల్లిలో 22 శాతం, మల్లాపూర్‌లో 15 శాతం వర్షపాతం లోటు నమోదైనట్లు వివరించారు.జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో 1,03,845 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేయగా, అందులో 72,210 ఎకరాల్లో వరి సాగు చేసినట్లు అధికారులు తెలిపారు. వరి పంటలో 455 ఎకరాల్లో నీటి ఒత్తిడి ఏర్పడగా, 101 ఎకరాల్లో పంట ఎండిపోయిందని, అందులో కోరుట్ల మండలంలోనే 80 ఎకరాలు ఉన్నాయని వివరించారు.ఎల్‌నినో పరిస్థితుల కారణంగా యాసంగిలో వరి సాగును గణనీయంగా తగ్గించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. గత యాసంగిలో సుమారు 70,229 ఎకరాల్లో వరి సాగు చేయగా, ఈసారి 29,918 ఎకరాలకు తగ్గించాలని వ్యవసాయ శాఖ అంచనా వేసిందని తెలిపారు. ఈ లక్ష్యాన్ని సాధించేలా క్షేత్రస్థాయి వ్యవసాయ అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు.గత యాసంగిలో 21,693 ఎకరాల్లో సాగైన మొక్కజొన్నను ఈసారి 29,276 ఎకరాలకు పెంచాలని అంచనా వేసినట్లు తెలిపారు. గత ఏడాది మొత్తం యాసంగి సాగు విస్తీర్ణం 93,218 ఎకరాలు కాగా, ఈసారి 62,904 ఎకరాలకు తగ్గే అవకాశం ఉందని వివరించారు. నీటి లభ్యతను పరిగణనలోకి తీసుకొని పంటల ప్రణాళిక రూపొందించాలని, నీటి అవసరం తక్కువగా ఉండే పంటల సాగును ప్రోత్సహించాలని కలెక్టర్ సూచించారు.పంటల వైవిధ్యీకరణకు ఇదే సరైన సమయమని, రైతులు వరి సాగుపై ఆధారపడకుండా ఉద్యాన పంటలు, ఆయిల్‌పామ్, ఇతర తక్కువ నీటితో సాగు చేయగల పంటల వైపు మళ్లేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పించడంతో పాటు అవసరమైన విత్తనాలు అందుబాటులో ఉండేలా చూడాలని, వ్యవసాయ బోర్ల పరిస్థితిని పర్యవేక్షించాలని సూచించారు.యాసంగిలో రెండో పంటగా వరి సాగు చేయవద్దనే విషయాన్ని రైతులకు స్పష్టంగా తెలియజేయాలని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ సూచించారు. ఎల్‌నినో ప్రభావం, నీటి వనరుల పరిస్థితి, భవిష్యత్తులో ఎదురయ్యే నీటి కొరతను రైతులకు వివరించి, తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకునేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు.

**ఉద్యాన పంటలు, ఆయిల్‌పామ్ సాగుకు ప్రోత్సాహం**

యాసంగిలో జిల్లాలో సుమారు 377 ఎకరాల్లో ఉద్యాన పంటల సాగు చేపట్టే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. జిల్లాలో 495 మంది రైతులు మొత్తం 1,253 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేస్తున్నారని, 783.8 ఎకరాల్లో సూక్ష్మ సేద్య పరికరాల ఏర్పాటు పూర్తయినట్లు వివరించారు.ఎల్‌నినో పరిస్థితుల్లో నీటిని సమర్థవంతంగా వినియోగించుకునే పద్ధతులకు ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. డ్రిప్, స్ప్రింక్లర్ వంటి సూక్ష్మ సేద్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించి, అర్హులైన రైతులకు అందుబాటులో ఉన్న పథకాల ప్రయోజనాలు అందేలా చూడాలని ఆదేశించారు. తక్కువ నీటితో పండే ఉద్యాన పంటలు, ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం పెంచేందుకు వ్యవసాయ, ఉద్యాన శాఖలు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు.

**నీటి వనరుల సంరక్షణపై ప్రత్యేక దృష్టి**

జిల్లాలో 246 చిన్న నీటి వనరుల మొత్తం సామర్థ్యం 2,412 ఎంసీఎఫ్‌టీ కాగా, ప్రస్తుతం 1,116 ఎంసీఎఫ్‌టీ నీరు అందుబాటులో ఉందని అధికారులు వివరించారు. ఇది మొత్తం సామర్థ్యంలో 46 శాతమని తెలిపారు. కోరుట్ల ప్రాంతంలో భూగర్భ జలమట్టం గత 11 సంవత్సరాల్లో ఎన్నడూ లేనంత దిగువకు చేరిందని పేర్కొన్నారు.ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రానున్న 6 నెలల పాటు కొత్త బోర్లు వేయకుండా కఠినంగా అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. భూగర్భ జలాలను సంరక్షించేందుకు ప్రజలు, రైతులకు అవగాహన కల్పించాలని, అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.వీబీ-జీ రామ్ జీ పథకం కింద చేపట్టిన ఇంకుడు గుంతలు, ఫామ్ పాండ్స్, ఇతర నీటి సంరక్షణ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. నీటి నిల్వలు పెంచే పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని, చేపట్టిన పనుల పురోగతిని అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.

**పశువులకు మేత కొరత రాకుండా చూడాలి**

జిల్లాలో 180 రోజుల అవసరాలకు 0.491 లక్షల మెట్రిక్ టన్నుల పశుగ్రాసం అవసరం కాగా, ప్రస్తుతం 1.158 లక్షల మెట్రిక్ టన్నుల పశుగ్రాసం అందుబాటులో ఉందని అధికారులు వివరించారు.పశువులకు మేత, తాగునీటి కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. పనిచేయని పశువుల నీటి తొట్టెలను గుర్తించి మరమ్మతులు చేపట్టి తిరిగి వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. అందుబాటులో ఉన్న పశుగ్రాసాన్ని సక్రమంగా వినియోగించుకునేలా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని తెలిపారు.

**మిషన్ భగీరథ సమస్యలను 45 రోజుల్లో పరిష్కరించాలి**

జిల్లాలో గ్రామీణ ప్రాంతాలకు రోజుకు 20,260 కిలోలీటర్ల తాగునీరు అవసరం కాగా, ప్రస్తుతం 12,900 కిలోలీటర్లు మాత్రమే సరఫరా అవుతోందని అధికారులు వివరించారు. రోజుకు 7,360 కిలోలీటర్ల తాగునీటి కొరత ఉన్నట్లు తెలిపారు. ముఖ్యంగా మేడిపల్లి, మల్లాపూర్ మండలాల్లో తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు.మిషన్ భగీరథ పైప్‌లైన్ సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు చేసి విడుదల చేసినందున, రానున్న 45 రోజుల్లోగా పరిస్థితి మెరుగుపడేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. పైప్‌లైన్ లీకేజీలను గుర్తించి తక్షణమే మరమ్మతులు చేపట్టాలని, నీటి సరఫరాలో అంతరాయాలు లేకుండా చూడాలని సూచించారు.కోరుట్ల, మేడిపల్లి మున్సిపాలిటీల పరిధిలో తాగునీటి సరఫరాకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, ప్రత్యామ్నాయ బోర్లు, చేతిపంపులు, ట్యాంకర్ల ద్వారా అవసరమైన ప్రాంతాలకు నీరు అందించే ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. నీటి సరఫరాకు సంబంధించి స్పష్టమైన ప్రామాణిక కార్యాచరణ విధానాన్ని రూపొందించి, దాని ప్రకారం సరఫరా జరిగేలా చూడాలని తెలిపారు.స్థానిక నీటి వనరులు కూడా క్రమంగా తగ్గిపోతున్నాయని, భవిష్యత్తులో మిషన్ భగీరథ నీటిపై మరింత ఆధారపడాల్సిన పరిస్థితి రావచ్చని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ పేర్కొన్నారు. ప్రజలకు సరిపడా తాగునీరు అందేలా ముందస్తు ఏర్పాట్లు చేయాలని, పైప్‌లైన్ లీకేజీలు అరికట్టాలని, మున్సిపాలిటీల్లో పెండింగ్ తాగునీటి పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. తాగునీటి సరఫరాపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని అన్నారు.

**ప్రజారోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి**

జిల్లాలో 4 డెంగ్యూ, 1 మలేరియా కేసు నమోదైనట్లు అధికారులు వివరించారు. కోరుట్ల ఏరియా ఆసుపత్రి, మేడిపల్లి సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో జ్వరాలు, వడదెబ్బ బాధితులకు అవసరమైన వైద్య సదుపాయాలు సిద్ధంగా ఉంచాలని కలెక్టర్ సూచించారు.వైద్య కేంద్రాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ మాత్రలు అందుబాటులో ఉంచాలని, జ్వరాలపై పర్యవేక్షణ పెంచాలని, పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ప్రజలకు తాగునీటి పరిశుభ్రత, ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించాలని సూచించారు.

**గోదావరి పుష్కరాలు -- 2027కు 38 లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం**

గోదావరి పుష్కరాలు--2027కు కోరుట్ల నియోజకవర్గ పరిధిలో సుమారు 38 లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు. 2015 పుష్కరాల సమయంలో ఈ ప్రాంతానికి 9.45 లక్షల మంది భక్తులు రాగా, 2027లో భక్తుల సంఖ్య గణనీయంగా పెరిగే అవకాశం ఉన్నందున అందుకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు కల్పించాలని కలెక్టర్ సూచించారు.మల్లాపూర్ మండలానికి 2015లో 1.25 లక్షల మంది భక్తులు రాగా, 2027లో 15 లక్షల మంది వచ్చే అవకాశం ఉందని అంచనా వేశారు. ఇబ్రహీంపట్నం మండలానికి 2015లో 8.20 లక్షల మంది భక్తులు రాగా, 2027లో 23 లక్షల మంది వచ్చే అవకాశం ఉందని అధికారులు వివరించారు.మల్లాపూర్ మండలంలో వి.వి. రావుపేట, వల్గొండ, మొగిలిపేట, ఓబులాపూర్, కొత్త ధర్మారంపల్లి, పాత ధర్మారంపల్లి గ్రామాల్లో పుష్కర ఘాట్ల ఏర్పాట్లను ప్రతిపాదించారు. ఇబ్రహీంపట్నం మండలంలో కోమటికొండాపూర్, ఎర్రదండి, ములరాంపూర్, బర్తీపూర్, వేములకుర్తి, రత్నాలమడుగు (వేములకుర్తి), ఫకీర్ కొండాపూర్, యమాపూర్ (బొక్కల మడుగు) గ్రామాల్లో పుష్కర ఘాట్లకు సంబంధించిన ఏర్పాట్లు చేపట్టాలని ప్రణాళిక రూపొందించారు.

**పుష్కరాల పనులకు రూ.226.41 కోట్ల ప్రతిపాదన**

గోదావరి పుష్కరాల కోసం మొత్తం రూ.226.41 కోట్ల అంచనా వ్యయంతో వివిధ పనులను ప్రతిపాదించినట్లు అధికారులు వివరించారు. ఇందులో మొదటి ప్రాధాన్యత పనులకు రూ.206.42 కోట్లు, రెండో, మూడో ప్రాధాన్యత పనులకు రూ.19.99 కోట్లు ప్రతిపాదించారు.మొదటి ప్రాధాన్యత పనుల్లో దేవాదాయ శాఖకు రూ.20 కోట్లు, నీటిపారుదల శాఖకు రూ.38.39 కోట్లు, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగానికి రూ.43.55 కోట్లు, ప్రజారోగ్య శాఖకు రూ.15 కోట్లు, ధర్మపురి మున్సిపాలిటీ తాగునీరు, పారిశుధ్య పనులకు రూ.2 కోట్లు, పర్యాటక శాఖకు రూ.1 కోటి, రోడ్లు--భవనాల శాఖ రహదారుల పనులకు రూ.80 కోట్లు, విద్యుత్ శాఖకు రూ.6 కోట్లు ప్రతిపాదించినట్లు తెలిపారు.టైర్ 2, 3 ప్రాధాన్యత పనుల్లో నీటిపారుదల శాఖకు రూ.11.99 కోట్లు, పంచాయతీరాజ్ రహదారులకు రూ.5 కోట్లు, రోడ్లు--భవనాల శాఖ రహదారులకు రూ.3 కోట్లు ప్రతిపాదించినట్లు వివరించారు.విద్యుత్ శాఖకు సంబంధించి 32 పనులకు రూ.7.67 కోట్ల అంచనా వ్యయం ఉండగా, రెండో ప్రాధాన్యతలో రూ.2.09 కోట్ల పనులకు మాత్రమే అనుమతులు వచ్చాయని, మిగిలిన రూ.5.58 కోట్ల పనులకు అనుమతులు రావాల్సి ఉందని అధికారులు తెలిపారు.పుష్కరాల కోసం మల్లాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో 1,051 మంది, ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో 1,440 మంది చొప్పున మొత్తం 2,491 మంది పోలీసు సిబ్బంది అవసరమని ప్రతిపాదించినట్లు వివరించారు.

**మంజూరైన పుష్కరాల పనులను వెంటనే ప్రారంభించాలి**

గోదావరి పుష్కరాల కోసం మంజూరైన పనుల్లో కాంట్రాక్టర్ల ఎంపిక, టెండర్ల ప్రక్రియ పూర్తయిన వెంటనే సంబంధిత అధికారులు, ఇంజినీర్లు క్షేత్రస్థాయిలో పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. మండల స్థాయిలో రోడ్లు, వంతెనలకు సంబంధించిన పనుల వివరాలను ఖరారు చేసిన వెంటనే పనులు ప్రారంభించేందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు.వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ, మంజూరైన పనులను ఆలస్యం చేయకుండా ప్రారంభించాలని, పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పుష్కరాలకు వచ్చే భక్తుల సంఖ్యను దృష్టిలో ఉంచుకొని రహదారులు, వంతెనలు, ఘాట్లు, తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్, భద్రత వంటి అంశాలకు సంబంధించి అవసరమైన ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని సూచించారు. అన్ని పనులను నిర్ణీత గడువులోగా నాణ్యతతో పూర్తి చేయాలని ఆదేశించారు.ఎమ్మెల్యే డాక్టర్ కే.సంజయ్ కుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం మార్కెట్‌లో పంటలకు మంచి ధరలు లభిస్తున్నప్పటికీ, రానున్న కొన్ని వారాల్లో పంట దిగుబడులు మార్కెట్‌కు ఎక్కువగా వచ్చినప్పుడు ధరలు తగ్గే అవకాశం ఉందని ఎమ్మెల్యే డాక్టర్ కే.సంజయ్ కుమార్ తెలిపారు. ప్రస్తుతం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాల్సిన అవసరం లేకపోయినా, పంటలు మార్కెట్‌కు ఎక్కువగా వచ్చే సమయానికి ప్రభుత్వ కొనుగోళ్లు చేపట్టేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలని సూచించారు.రైతులకు కనీస మద్దతు ధర లభించేలా అవసరమైన సమయంలో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని, ప్రతి కొనుగోలు కేంద్రంలో అవసరమైన మౌలిక సదుపాయాలను ముందుగానే సిద్ధంగా ఉంచాలని అన్నారు. పంటలు అధికంగా మార్కెట్‌కు వచ్చినప్పుడు కొనుగోళ్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు.ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు అందుబాటులో లేకపోతే వ్యాపారులు ధరల విషయంలో రైతులను ప్రభావితం చేసే అవకాశం ఉందని, అలాంటి పరిస్థితులు తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే తెలిపారు. మార్కెట్ పరిస్థితులను నిరంతరం పరిశీలిస్తూ, రైతుల ప్రయోజనాలను కాపాడేలా కనీస మద్దతు ధరకు కొనుగోళ్లు చేపట్టేందుకు ముందస్తు ప్రణాళిక రూపొందించాలని సూచించారు.ఎల్‌నినో పరిస్థితులు, నీటి లభ్యత, యాసంగి పంటల సాగుపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే డాక్టర్ కే.సంజయ్ కుమార్ అన్నారు. రెండో పంటగా వరి సాగు చేయకూడదనే విషయాన్ని రైతులకు స్పష్టంగా తెలియజేయాలని, తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకునేలా వ్యవసాయ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి, రైతులకు అవసరమైన సూచనలు అందించడంతో పాటు తాగునీటి సరఫరా, నీటి సంరక్షణ, పుష్కరాల పనులు, ప్రభుత్వ కొనుగోళ్లకు సంబంధించిన ఏర్పాట్లను ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే సూచించారు.ఈ సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎన్. ప్రసునాంబ, ఆర్.డి.ఓ. జీవాకర్ రెడ్డి , సంబంధిత అగ్రికల్చరల్ , హార్టికల్చర్, విద్యుత్, ఇరిగేషన్, వెటర్నరీ, మిషన్ భగీరథ, గ్రౌండ్ వాటర్, డీఆర్డీఏ, మున్సిపల్, పీఆర్, ఆర్‌డబి శాఖల జిల్లా , డివిజనల్, మండల స్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు

# వ్యవసాయ బోర్ల నుంచి పరిశ్రమలకు నీటి తరలింపుపై చర్యలు ఏవి : ఎమ్మెల్యే చింత ప్రభాకర్

**సంగారెడ్డి జిల్లా, మీడియా టుడే బ్యూరో, అక్టోబర్ 27.**

తాగునీటి కొరత వేళ ట్యాంకర్ల ద్వారా బీర్ల పరిశ్రమలకు నీటి సరఫరా.. అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహంఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తగ్గి, భవిష్యత్తులో నీటి వనరులపై ఒత్తిడి పెరిగే అవకాశమున్న నేపథ్యంలో తాగునీటి సమస్యను ముందుగానే అంచనా వేసి తగిన చర్యలు తీసుకోవాలని సంగారెడ్డి బీఆర్ఎస్ ఎమ్మెల్యే చింత ప్రభాకర్ డిమాండ్ చేశారు. ఒకవైపు ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతుంటే, మరోవైపు వ్యవసాయ బోర్ల నుంచి నీటిని ట్యాంకర్ల ద్వారా పరిశ్రమలకు తరలిస్తున్నారని ఆయన ఆరోపించారు.సంగారెడ్డి జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఉమ్మడి మెదక్ జిల్లా సమీక్షా సమావేశంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వివేక్ వెంకటస్వామి, దామోదర రాజనర్సింహ పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే చింత ప్రభాకర్ మాట్లాడుతూ జిల్లాలో తాగునీటి సరఫరా, వ్యవసాయ బోర్ల వినియోగం, పరిశ్రమలకు నీటి తరలింపు, భూసేకరణ పరిహారం వంటి అంశాలను సమీక్షలో చర్చించారు...ప్రజల దాహార్తిని తీర్చడానికి సరిపడా నీరు లేదని చెబుతున్న అధికారులు, గ్రామాల పరిధిలోని వ్యవసాయ బోర్ల నుంచి ట్యాంకర్ల ద్వారా పరిశ్రమలకు నిరంతరాయంగా నీటిని తరలిస్తున్న వ్యవహారంపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత వ్యవసాయ విద్యుత్‌ను వినియోగించుకుంటూ బోర్ల నుంచి నీటిని తోడిపోసి ట్యాంకర్లను నింపుతున్నారని, ఈ వ్యవహారం అధికారులకు తెలిసే జరుగుతోందన్న ఆరోపణలు ఉన్నాయని పేర్కొన్నారు.వ్యవసాయ అవసరాల కోసం ఏర్పాటు చేసిన బోర్ల నీటిని ఇతర అవసరాలకు పెద్దఎత్తున తరలిస్తే భూగర్భ జలమట్టాలు మరింత పడిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.




గ్రామాల్లో తాగునీటి అవసరాలను పక్కనపెట్టి పరిశ్రమలకు నీటిని సరఫరా చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఈ వ్యవహారంపై అధికారులు సమగ్ర విచారణ జరిపి, అక్రమంగా నీటిని తరలిస్తున్నట్లు తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉండే అవకాశముందని నిపుణులు హెచ్చరిస్తున్న నేపథ్యంలో వేసవి పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ముందస్తు కార్యాచరణ రూపొందించాలని సూచించారు. సంగారెడ్డి పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి కొరత ఏర్పడకుండా ప్రత్యామ్నాయ వనరులను గుర్తించాలని, అవసరమైన ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని, నీటి వినియోగంపై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని కోరారు.లేదంటే ఖాళీ కడవాలతో రోడ్లపైకి వస్తారని హెచ్చరించారు... పరిశ్రమల స్థాపన కోసం భూసేకరణ చేపట్టిన మునిదేవునిపల్లి ప్రాంతంలో కొందరు రైతులకు ఇప్పటికీ పూర్తి స్థాయిలో పరిహారం అందలేదని ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ఆరోపించారు. భూముల సేకరణ, పరిహారం పంపిణీ విషయంలో రెవెన్యూ అధికారులు పారదర్శకంగా వ్యవహరించడం లేదని విమర్శించారు. దళారులు రైతులను భయభ్రాంతులకు గురిచేస్తూ, ఇబ్బందులు పెడతామంటూ బెదిరించి తక్కువ ధరలకు భూములు కొనుగోలు చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయని పేర్కొన్నారు.భూములు కోల్పోతున్న రైతులకు న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, పరిహారం పంపిణీలో ఎలాంటి అక్రమాలకు తావులేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భూసేకరణకు సంబంధించిన రికార్డులను పరిశీలించి, పరిహారం అందని రైతులను గుర్తించి న్యాయం చేయాలని కోరారు.ప్రజలకు తాగునీరు అందించడం ప్రభుత్వ ప్రాథమిక బాధ్యత అని పేర్కొన్న చింత ప్రభాకర్, నీటి సమస్యను రాజకీయ అంశంగా కాకుండా ప్రజల జీవనాధారానికి సంబంధించిన అత్యంత కీలకమైన సమస్యగా పరిగణించాలని సూచించారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి వాస్తవ పరిస్థితులను తెలుసుకోవాలని, నీటి వనరుల దుర్వినియోగాన్ని అరికట్టి ప్రజలకు సకాలంలో తాగునీరు అందించేలా సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

# మాజీ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో పట్టభద్రుల ఓటరు నమోదు హెల్ప్ డెస్క్

**అర్హులైన పట్టభద్రులు పీడీఆర్ హెల్ప్ డెస్క్ సేవలను వినియోగించుకోవాలి**

**మీడియాటుడే ఉప్పల్, అక్టోబర్ 27:**



మల్లాపూర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ పట్టభద్రుల ఓటరు నమోదు కోసం పీడీఆర్ హెల్ప్ డెస్క్ అందుబాటులో ఉందని ఆయన తెలిపారు. అర్హులైన పట్టభద్రులు అవసరమైన పత్రాలతో హెల్ప్ డెస్క్‌ను సంప్రదిస్తే ఓటరు నమోదు ప్రక్రియలో సహకారం అందిస్తామని పేర్కొన్నారు పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియకు సహాయపడేందుకు పీడీఆర్ హెల్ప్ డెస్క్ ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందని తెలిపారు.ఓటరు నమోదుకు అవసరమైన పత్రాలు:- 2023కు ముందు డిగ్రీ పూర్తి చేసినట్లు ధ్రువీకరించే మెమో- ఆధార్ కార్డు- ఓటరు గుర్తింపు కార్డు- పాస్‌పోర్టు సైజు ఫొటో- మొబైల్ నంబర్మరిన్ని వివరాలు, సహాయం కోసం 9346072470 వాట్సాప్ నంబర్‌ను సంప్రదించవచ్చని పన్నాల దేవేందర్ రెడ్డి తెలిపారు. అర్హులైన పట్టభద్రులందరూ ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు ముందుకు రావాలని కోరారు.

# అమ్మాపురంలో ప్రయివేట్ వ్యక్తులకు ధాన్యం అమ్ముకుంటున్న రైతులు



**ఉమ్మడి వరంగల్ జిల్లా మీడియాటుడే అక్టోబర్ 27:**
అమ్మాపురంలో పలు కార్యక్రమాల్లో పాల్గొని తొర్రురు వస్తున్న మాజీ మంత్రివర్యులు ఎర్రబెల్లి దయాకర్ రావు వాహనాన్ని ఆపి తమ గోడు వెళ్ళబోసుకున్న అమ్మాపురం రైతులు.విత్తనాలు కొనడానికి వచ్చిన రైతన్నలను బలవంతంగా సెల్ఫ్ డిక్లరేషన్ పైన సంతకాలు చేపిస్తున్నారని వారి గోడు వెళ్ళబోసుకోగా వారి ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకొని వెళ్తానని మాజీ మంత్రివర్యులు ఎర్రబెల్లి దయాకర్ రావు హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒక తండ్రిలాగా ధైర్యం చెప్పాల్సిన స్థానంలో ఉన్న వ్యక్తే చేతులెత్తేయడం బాధాకరమైన విషయం అని ఆనాడు అమ్మాపురం లో కరోనా సమయంలో గ్రామానికి కలెక్టర్ ని పంపి ఎలాంటి ఇబ్బంది లేకుండా చూసింది కెసిఆర్ రైతు డిక్లరేషన్ పేరు చెప్పి రైతుల సెల్ఫ్ డిక్లరేషన్ కోసం ఈనాడు వారిని ఇబ్బంది పెడుతున్న మూర్ఖుడు రేవంత్ రెడ్డి.ఆనాడు కెసిఆర్ హయాంలో పది మందికి అన్నం పెట్టె రైతు నేడు పస్తులుండటానికి కారణం ఈ మోసకారి రేవంత్ రెడ్డి కారణం.ధ్యానం రేటు ఎక్కువ నావల్లే పెరిగింది అని చెప్పుకోవడానికి రేవంత్ రెడ్డి కి సిగ్గు కూడా లేదు అని కనీసం 10 శాతం కూడ వరి పండలేదని,ఈ కరెంట్ కోతలతో, సాగునీరు రాక ఇప్పటికే ఎందరో రైతులు నష్టపోయారని వారికి నష్టపరిహారం ఇవ్వాల్సిందిగా డిమాండ్ చేస్తున్నారు.

# విద్యారణ్య స్కూల్ నిర్వాహకుడిపై కేసు నమోదు

**కోర్టు ఆదేశాలతో ఐదు సెక్షన్ల కింద కేసు అంబర్‌పేట పోలీసుల దర్యాప్తు**

**- అనుమతులపై ప్రశ్నించినందుకు విలేకరిపై తప్పుడు ఫిర్యాదు చేశారంటూ ఆరోపణలు**

**మీడియా టుడే, ఉప్పల్, అక్టోబర్ 27:**



సిరిపురం ఉపేందర్

విద్యారణ్య స్కూల్ నిర్వాహకుడు సిరిపురం ఉపేందర్‌పై అంబర్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. పాఠశాల నిర్వహణకు అవసరమైన అనుమతులపై ప్రశ్నించినందుకు తనపై తప్పుడు ఫిర్యాదు చేయడంతోపాటు, పరువుకు భంగం కలిగించేలా వార్త ప్రచురింపజేశారని ప్రజా ప్రశ్న న్యూస్ విలేకరి ఓ. సంతోష్ రాజు ఆరోపించారు. ఆయన దాఖలు చేసిన ఫిర్యాదుపై నాంపల్లిలోని జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టు ఆదేశాల మేరకు పోలీసులు క్రైమ్ నంబర్ 569/2026గా కేసు నమోదు చేశారు.ఫిర్యాదు ప్రకారం.. అంబర్‌పేటలోని పటేల్‌నగర్, రామంతాపూర్‌లోని వివేక్‌నగర్ ప్రాంతాల్లో విద్యారణ్య స్కూల్ నిర్వహణకు అవసరమైన గుర్తింపు, అనుమతులు, విద్యాశాఖ నుంచి నిరభ్యంతర పత్రం (ఎన్‌ఓసీ) ఉన్నాయా అనే అంశంపై సంతోష్ రాజు వివరాలు సేకరించినట్లు తెలిపారు. ఇందుకోసం అంబర్‌పేట, ఉప్పల్ మండల విద్యాధికారులను సంప్రదించినట్లు పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో తనను వేధించాలనే ఉద్దేశంతో పాఠశాల నిర్వాహకుడు అక్రమ ప్రవేశం, డబ్బుల వసూలు ఆరోపణలతో తప్పుడు ఫిర్యాదు చేశారని సంతోష్ రాజు ఆరోపించారు. 'టుడేస్ న్యూస్' పత్రికలో తనపై అసత్య, తప్పుదోవ పట్టించే కథనం ప్రచురింపజేసి ప్రతిష్ఠకు భంగం కలిగించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆ పత్రిక రిజిస్ట్రేషన్ చెల్లుబాటుపైనా సందేహాలు వ్యక్తం చేశారు.ఈ వ్యవహారంపై తొలుత అంబర్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ చర్యలు తీసుకోలేదని పేర్కొంటూ ఆయన కోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాలతో కేసు నమోదు చేసిన పోలీసులు ప్రస్తుతం దర్యాప్తు చేపట్టారు. ఫిర్యాదులో చేసిన ఆరోపణలు ఇంకా దర్యాప్తులో తేలాల్సి ఉంది.

# మహిళ సంఘాల భవన నిర్మాణానికి భూమిపూజ

**పర్వతగిరి, అక్టోబర్ 27, మీడియా టుడే**



వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు ఆదేశాల మేరకు పర్వతగిరి మండల కేంద్రంలో వి.ఓ. భవన నిర్మాణానికి సోమవారం భూమిపూజ నిర్వహించారు. గ్రామ సర్పంచ్ చీదురు శంకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళా సంఘాల కార్యకలాపాలను మరింత బలోపేతం చేయడంతోపాటు, సంఘాల సమావేశాలు నిర్వహించేందుకు వి.ఓ. భవనం ఉపయోగపడనుంది.ఈ కార్యక్రమంలో ఏపీఎం రాజీర్, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నరెడ్ల సంతోష్, వార్డు సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# మల్లాపూర్‌లో ఎమ్మెల్సీ పట్టభద్రుల ఓటరు నమోదు శిబిరం

**- మాజీ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహణ**



**మీడియా టుడే,ఉప్పల్, అక్టోబర్ 27**
మల్లాపూర్ డివిజన్‌లోని మేఫ్లవర్ హైట్స్‌లో సోమవారం సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 9.30 గంటల వరకు ఎమ్మెల్సీ పట్టభద్రుల ఓటరు నమోదు శిబిరం నిర్వహించారు. మల్లాపూర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో అర్హులైన పట్టభద్రులు ఓటర్లుగా నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించారు.ఈ కార్యక్రమానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ పన్నాల దేవేందర్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. అర్హులైన పట్టభద్రులందరూ ఎమ్మెల్సీ ఓటరు నమోదును సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# సత్యనారాయణపురం ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

**79 మందికి వైద్య పరీక్షలు జరిపి ఉచిత మందులు పంపిణీ**

**బనిగండ్లపాడు వైద్యాధికారి డాక్టర్ ప్రశాంత్**

**మీడియా టుడే ఎర్రుపాలెం:**
తరుణి వ్యాధులు పట్ల అప్రమత్తంగా ఉండాలని, తీసుకోవాల్సిన జాగ్రత్తల పై బనిగండ్లపాడు వైద్యాధికారి డాక్టర్ ప్రశాంత్, డాక్టర్ అశ్విని ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఎర్రుపాలెం మండలం సత్యనారాయణ పురం గ్రామంలో ఏర్పాటుచేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. స్థానిక సర్పంచి బండ్ల రాణి వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడుతూ ఖమ్మం, మధిర విజయవాడ వంటి దూర ప్రాంతాలకు వెళ్లి ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలంటే పేదలకు భారంగా ఉంటుందని దాన్ని దృష్టిలో పెట్టుకొని మారుమూల గ్రామాలలో వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని హర్షం వ్యక్తం చేస్తూ ఆమె వైద్యులను అభినందించారు.ఈ ఉచిత క్యాంపులో జ్వరం, జలుబు, దగ్గు, తలనొప్పి, బిపి, షుగర్ వంటి పలు రకాల వ్యాధులతో బాధపడుతున్న 79 మందికి వైద్య పరీక్షలు జరిపి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు డాక్టర్ ప్రశాంత్ తెలిపారు. తరుణి వ్యాధులు పట్ల ప్రజలు అప్రమత్తగా ఉండాలని ముందస్తుగా తీసుకోవాల్సిన చర్యలు నివారణోపాయల పై వైద్యులు అవగాహన కల్పించారు.కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు ఆత్మ ప్రసాద్, హెచ్ ఇ వో భాస్కరరావు,



సూపర్వైజర్ కొండయ్య, ఏఎన్ఎం నాగమణి, నరేష్, ఆ శా కార్యకర్తలు వీరమ్మ, సంధ్య,గ్రామస్తులు పాల్గొన్నారు

# బండి రమేష్ సమక్షంలో కూకట్‌పల్లి మైనారిటీ వర్కింగ్ చైర్మన్‌గా షేక్ నవాజ్ బాధ్యతల స్వీకరణ





**కూకట్‌పల్లి, అక్టోబర్ 27 (మీడియా టుడే ప్రతినిధి)**
కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ మైనారిటీ వర్కింగ్ చైర్మన్‌గా నియమితులైన షేక్ నవాజ్ ఘనంగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జనతా నగర్‌లోని తన నివాసం నుంచి కాంగ్రెస్ పార్టీ మైనారిటీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి భారీ ర్యాలీగా బయలుదేరి హేమదుర్గా భవన్‌లోని కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడ తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్, టీపీసీసీ ఉపాధ్యక్షులు, కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి బండి రమేష్ సమక్షంలో షేక్ నవాజ్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాలకు సమాన గౌరవం, సమాన అవకాశాలు కల్పిస్తూ ప్రజాస్వామ్య విలువలకు ప్రాధాన్యతనిస్తుందని అన్నారు. మైనారిటీ సోదరుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం, అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుందని పేర్కొన్నారు. పార్టీలో కష్టపడి పనిచేసే ప్రతి ఒక్కరికీ రాజకీయంగా ఎదిగే అవకాశాలు కల్పిస్తామని, షేక్ నవాజ్ తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ మైనారిటీ ప్రజల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. ప్రజలకు, పార్టీ నాయకత్వానికి మధ్య సమన్వయకర్తగా ఉంటూ మైనారిటీ సోదరుల గొంతుకగా నిలవాలని సూచించారు.అనంతరం షేక్ నవాజ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో కీలక బాధ్యతలు అప్పగించిన బండి రమేష్‌కు, కాంగ్రెస్ పార్టీ నాయకత్వానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. బండి రమేష్ నాయకత్వంలో కూకట్‌పల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని, ప్రతి డివిజన్‌లోని నాయకులు, కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు. మైనారిటీ సోదరుల సమస్యలను సంబంధిత నాయకుల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా వక్ఫ్ బోర్డు మెంబర్ అడ్వకేట్ హుస్సేన్, బి-బ్లాక్ అధ్యక్షుడు తూము వేణు, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు గోపిశెట్టి రాఘవేందర్, మైనారిటీ చైర్మన్ ఎండీ చున్ను పాషా, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండీ సలీం, రాష్ట్ర ఓబీసీ వర్కింగ్ చైర్మన్ తూము వినయ్, కాంగ్రెస్ నాయకులు పులి శివ, సప్పిడి భాస్కర్, డివిజన్ అధ్యక్షులు తూము సంతోష్, కాలికోట శంకర్, రాజేష్ గౌడ్, మైనారిటీ వైస్ చైర్మన్ ఎండీ నయీమ్‌తో పాటు రమణ, అక్బర్, మల్లేష్ యాదవ్, అస్లాం, తూము సచిన్, ఎండీ యూసఫ్ పాషా, వివిధ విభాగాల నాయకులు, కార్యకర్తలు పాల్గొని షేక్ నవాజ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు, అభిమానుల కోసం షేక్ నవాజ్ ఆత్మీయ విందు ఏర్పాటు చేశారు.

# చేతులు, కాళ్లలో తిమ్మిరిని నిర్లక్ష్యం చేయొద్దు!

**వెన్నుపాముపై ఒత్తిడిని తొలగించి -36 ఏళ్ల వ్యక్తికి విజయవంతంగా శస్త్రచికిత్స**

**సకాలంలో చికిత్సతో మెరుగైన ఫలితాలు -యశోదా ఆస్పత్రి వైద్యుల సూచన**

**ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 27(మీడియా టుడే )**
చేతులు, కాళ్లలో తిమ్మిరి, చేతి పట్టు తగ్గడం, నడవడంలో ఇబ్బందులు వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయకూడదని మలక్‌పేట్ యశోదా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు సూచించారు .వెన్నుపాముపై ఒత్తిడిని సకాలంలో గుర్తించి చికిత్స తీసుకోకపోతే శాశ్వత వైకల్యం వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరించారు.హైదరాబాద్‌లోని జిల్లెల్‌గూడకు చెందిన 36 ఏళ్ల బడుకల రాము రెండు చేతులు, రెండు కాళ్లలో తిమ్మిరి, వస్తువులను పట్టుకోవడం, చొక్కా గుండీలు పెట్టుకోవడం, నడవడంలో ఇబ్బందులతో ఆసుపత్రిని సంప్రదించారు. ఎంఆర్ఐ పరీక్షల్లో మెడ వెన్నెముకలోని స్పైనల్ కెనాల్ సన్నబడటం, వెన్నుపాముపై ఒత్తిడి ఉన్నట్లు వైద్యులు గుర్తించారు.సీనియర్ కన్సల్టెంట్ న్యూరో సర్జన్ డాక్టర్ శ్రీనివాస్ బొట్ల ఆధ్వర్యంలో సీ3 నుంచి సీ6 వరకు శస్త్రచికిత్స నిర్వహించి వెన్నుపాముపై ఒత్తిడిని తొలగించడంతో పాటు వెన్నెముకకు స్థిరత్వం కల్పించారు. శస్త్రచికిత్స అనంతరం రోగి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉండటంతో పాటు లక్షణాల్లో గణనీయమైన ఉపశమనం లభించిందని వైద్యులు తెలిపారు.చేతులు, కాళ్లలో తిమ్మిరి, పట్టు తగ్గడం, నడవడంలో ఇబ్బందులు ఎదురైతే ఆలస్యం చేయకుండా నిపుణులైన వైద్యులను సంప్రదించాలని ఆసుపత్రి యాజమాన్యం సూచించింది.శస్త్రచికిత్స అనంతరం ఫిజియోథెరపీ, వైద్యుల సూచనలు, క్రమం తప్పకుండా పునఃపరీక్షలు చేయించుకోవడం ముఖ్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలోమలక్‌పేట్ యశోదా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి



డైరెక్టర్ గోరుకంటి పవన్, యూనిట్ హెడ్ కె. శ్రీనివాస్ రెడ్డి, అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ చిదుర, వాసు కిరణ్ రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఇబ్రహీంపట్నంలో పోలీసుల సేవా స్ఫూర్తి

**ఘనంగా బైక్ ర్యాలీ, 124 యూనిట్ల రక్తదానం**

**అమరవీరుల త్యాగాలకు ఘన నివాళి.. ప్రజాసేవలో పోలీసుల మరో ముందడుగు**

**రక్తదాత పోలీసులకు సర్టిఫికెట్ల ప్రదానం**

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి జె. నరేందర్**
**మీడియా టుడే । అక్టోబర్ 27**



ఇబ్రహీంపట్నం: విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ, ప్రజల్లో సేవాభావాన్ని పెంపొందించే లక్ష్యంతో రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో మూడో బెటాలియన్ టీజీఎస్పీ ఆధ్వర్యంలో నిర్వహించిన బైక్ ర్యాలీ, రక్తదాన శిబిరం విశేషంగా ఆకట్టుకున్నాయి. అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా చేపట్టిన ఈ కార్యక్రమాలు పోలీసుల సామాజిక బాధ్యతకు, ప్రజాసేవ పట్ల వారికున్న నిబద్ధతకు నిదర్శనంగా నిలిచాయి.

**ప్రధాన వీధుల గుండా బైక్ ర్యాలీ**

బెటాలియన్ నుంచి ప్రారంభమైన బైక్ ర్యాలీ పట్టణంలోని ప్రధాన మార్గాల మీదుగా సాగింది. కమాండెంట్ సంయుక్త జమీల బాషా, అదనపు కమాండెంట్ శ్రీనివాసరావు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. పోలీసు అధికారులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్న ఈ ర్యాలీ పెద్ద చెరువు, అంబేద్కర్ చౌరస్తా మీదుగా కొనసాగింది. పోలీసు అమరవీరుల సేవలు, త్యాగాలను ప్రజలకు గుర్తుచేస్తూ సాగిన ఈ ర్యాలీ స్థానికంగా ప్రత్యేక దృష్టిని ఆకర్షించింది.

**రక్తదానంతో 124 మంది ప్రాణాలకు భరోసా**

ర్యాలీ అనంతరం నిర్వహించిన రక్తదాన శిబిరంలో పోలీసు సిబ్బంది స్వచ్ఛందంగా పాల్గొని మొత్తం 124 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. అత్యవసర వైద్య పరిస్థితుల్లో రక్తం అందక ప్రాణనష్టం జరగకుండా చూడాలనే సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. రక్తదానం ద్వారా తలసేమియా బాధితులు, ప్రమాద బాధితులు, శస్త్రచికిత్సలు అవసరమైన రోగులకు సహాయం అందించే అవకాశం ఉందని నిర్వాహకులు పేర్కొన్నారు.

**శాంతిభద్రతలకే కాదు.. సామాజిక సేవలోనూ ముందంజ**

సాధారణంగా శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణలో కీలక పాత్ర పోషించే పోలీసులు, సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ చురుగ్గా పాల్గొనడం అభినందనీయమని పలువురు అభిప్రాయపడ్డారు. రక్తదానం వంటి సేవా కార్యక్రమాలు ప్రజల్లో మానవత్వం, పరస్పర సహకారం, సామాజిక బాధ్యతను పెంపొందించేందుకు దోహదపడతాయి. పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడమే కాకుండా, వారి ఆశయాలకు అనుగుణంగా ప్రజలకు సేవ చేయాలనే సందేశాన్ని ఈ కార్యక్రమం చాటిచెప్పింది. విధి నిర్వహణతో పాటు ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడంలోనూ పోలీసులు ముందుంటారనే విషయాన్ని ఈ రక్తదాన శిబిరం మరోసారి స్పష్టం చేసింది.

# కాంగ్రెస్ హామీలు ఏమయ్యాయి?

**ఆరు గ్యారంటీల అమలుపై నిలదీత -- రైతులు, మహిళలు, నిరుద్యోగులకు సమాధానం చెప్పాలి**

**- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు మద్దతివ్వాలి- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు**

**ఉమ్మడి వరంగల్ జిల్లా మీడియాటుడే అక్టోబర్ 27:**
ఎన్నికల ముందు ఆరు గ్యారంటీలు.. ప్రజలకు ఎన్నో హామీలు.. అధికారంలోకి వచ్చాక వాటి అమలు విషయంలో మాత్రం నిర్లక్ష్యమంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు తీవ్ర విమర్శలు చేశారు. రైతులు, మహిళలు, నిరుద్యోగులు, పేద కుటుంబాలకు ఇచ్చిన హామీల మాటేమిటని ప్రశ్నించారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై కాంగ్రెస్ ప్రభుత్వం స్పష్టమైన సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మంగళవారం తొర్రూరు పట్టణ కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. ఎన్నికల సమయంలో ప్రజలను ఆకట్టుకునేందుకు అనేక హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ.. అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని పూర్తిస్థాయిలో అమలు చేయడంలో విఫలమైందని ఎర్రబెల్లి దయాకర్ రావు విమర్శించారు. రైతులకు రుణమాఫీ, రైతు భరోసా, మహిళలకు ఆర్థిక సహాయం, పింఛన్ల పెంపు, నిరుద్యోగులకు ఉద్యోగాలు, యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని చెప్పిన ప్రభుత్వం.. ఆయా హామీల అమలుపై ప్రజలకు స్పష్టమైన లెక్కలు చెప్పాలని డిమాండ్ చేశారు. హామీలను నమ్మి ఓట్లు వేసిన ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

**- రైతులకు ఇచ్చిన హామీలేవి?**

రైతుల సంక్షేమమే తమ ప్రభుత్వ లక్ష్యమని చెప్పిన కాంగ్రెస్ పార్టీ.. రైతులకు ఇచ్చిన హామీల అమలులో చిత్తశుద్ధి చూపాలని ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. సాగు ఖర్చులు పెరిగి రైతులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న తరుణంలో వారికి అండగా నిలవాల్సిన ప్రభుత్వం హామీల అమలుపై స్పష్టత ఇవ్వాలని కోరారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా పథకాల ప్రయోజనాలు అర్హులైన రైతులందరికీ అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతుల ఆశలను నీరుగార్చకుండా ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని హితవు పలికారు.

**- మహిళలు, నిరుద్యోగుల ఆశలపై నీళ్లు!**

మహిళలకు ఆర్థిక భరోసా కల్పిస్తామని, పేద కుటుంబాలను ఆదుకుంటామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. వాటి అమలుపై ప్రజలకు సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. మరోవైపు ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయడంతో పాటు యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. ఎన్నికల ముందు యువతకు భరోసా ఇచ్చి, అధికారంలోకి వచ్చాక వారి సమస్యలను పట్టించుకోకపోవడం సరైన విధానం కాదని విమర్శించారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వం పనిచేయాలని సూచించారు.

**పట్టభద్రుల ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు మద్దతివ్వాలి..**

రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులకు మద్దతు పలకాలని ఎర్రబెల్లి దయాకర్ రావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని, పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేయాలని సూచించారు. అర్హులైన పట్టభద్రులందరూ ఓటర్లుగా నమోదు చేసుకునేలా క్షేత్రస్థాయిలో కృషి చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు, వాటి అమలు తీరుపై ప్రజలకు వివరించాలని, బీఆర్ఎస్ హయాంలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడం ప్రభుత్వ బాధ్యత అని ఎర్రబెల్లి దయాకర్ రావు స్పష్టం చేశారు. రైతులు, మహిళలు, నిరుద్యోగులు, పేద కుటుంబాల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించాలని డిమాండ్ చేశారు. ఆరు గ్యారంటీలతో పాటు ఇతర హామీల అమలుపై స్పష్టమైన వివరాలను ప్రజల ముందుంచాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలుపై సమాధానం చెప్పేలా బీఆర్ఎస్ పార్టీ ప్రజా సమస్యలపై పోరాటాన్ని కొనసాగిస్తుందని పార్టీ శ్రేణులు పేర్కొన్నాయి. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు పట్టభద్రులు పాల్గొన్నారు.

## పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా మెగా రక్తదాన శిబిరంను ప్రారంభించిన ఎమ్మెల్యే.



**మీడియా టుడే అచ్చంపేట (అక్టోబర్ 27):**
పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా మంగళవారం అచ్చంపేట పట్టణ పోలీస్ మరియు లైన్స్ క్లబ్ వారి ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం చేపట్టారు ఈ శిబిరాన్ని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ ప్రారంభించారు అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ రక్తదానం అనేది ప్రాణదానంతో సమానమని, అత్యవసర పరిస్థితుల్లో రక్తం అందక ఎవరూ ప్రాణాలు కోల్పోకూడదనే లక్ష్యంతో ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.రక్తదానం ద్వారా ఆపదలో ఉన్న ఎంతోమంది ప్రాణాలను కాపాడవచ్చని తెలిపారు.ప్రజల రక్షణ కోసం తమ ప్రాణాలను సైతం త్యాగం చేసిన పోలీస్ అమరవీరుల సేవలను స్మరించుకుంటూ, వారి త్యాగాలకు నిజమైన నివాళిగా ఇటువంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పోలీస్ శాఖ అధికారులు, సిబ్బంది, లయన్స్ క్లబ్ సభ్యులు, యువత మరియు రక్తదాతలు పాల్గొన్నారు.

## అర్ణవ్ తుఫాను హెచ్చరికల నేపథ్యంలో ఎంపీఓలు, పంచాయతీ కార్యదర్శులు స్థానికకేంద్రాల్లోనేఅందుబాటులో ఉండాలి

### -జిల్లా పంచాయతీ అధికారి వినోద్ కుమార్

**మీడియా టుడే ఖమ్మం ప్రతినిధి :**



అర్ణవ్ తుఫాను హెచ్చరికల నేపథ్యంలో జిల్లాలోని ఎంపీఓలు, పంచాయతీ కార్యదర్శులు స్థానికంగా, అప్రమత్తంగా ఉండాలని జిల్లా పంచాయతీ అధికారి జి. వినోద్ కుమార్ ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని, అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలని సూచించారు. ఎవరికీ సెలవులు అనుమతించబడవని స్పష్టం చేశారు.లోతట్టు ప్రాంతాలు, పాత మట్టి ఇళ్లలో నివసిస్తున్న ప్రజలను గుర్తించి, అవసరమైన సందర్భాల్లో ముందస్తుగా సురక్షిత భవనాలకు తరలించాలని సూచించారు. పారిశుద్ధ్యం, తాగునీటి భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, గ్రామాల్లోని తాగునీటి ట్యాంకులకు సూపర్ క్లోరినేషన్ చేయించాలని, మురుగునీటి కాలువలను తక్షణమే శుభ్రం చేయించి పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని సూచించారు.లైన్ డిపార్ట్‌మెంట్లతో సమన్వయం చేసుకోవాలన్నారు. తహసీల్దార్లు, విద్యుత్ శాఖ, గ్రామీణ నీటి సరఫరా విభాగం, విపత్తు ప్రతిస్పందన బృందాలు తదితర శాఖల అధికారులతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ పనిచేయాలని, ఆయా శాఖల సిబ్బందికి క్షేత్రస్థాయిలో అవసరమైన సహాయ సహకారాలు అందించాలని సూచించారు.తెగిపడిన తీగలు, విరిగిన చెట్ల తొలగింపుపై అప్రమత్తంగా ఉంటూ, ఎటువంటి అత్యవసర పరిస్థితి ఎదురైనా వెంటనే కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించాలని జిల్లా పంచాయతీ అధికారి స్పష్టం చేశారు.

## ఖరీఫ్ పంటల కొనుగోలుకు ఏర్పాట్లు వెంటనే పూర్తి చేయాలి

### అదనపు కలెక్టర్ వెంకట మాధవ రావు

**నిర్మల్ కలెక్టరేట్: మీడియా టుడే సబ్ ఎడిటర్ అక్టోబర్ 27, 2026**



ఖరీఫ్ (వానాకాలం) పంటల కొనుగోలుకు సంబంధించి అన్ని ఏర్పాట్లను వెంటనే పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వెంకట మాధవ రావు అధికారులను ఆదేశించారు.మంగళవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో సంబంధిత శాఖల అధికారులతో ఖరీఫ్ పంటల కొనుగోలుపై నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. పంటల కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు, లోపాలు తలెత్తకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని, పంటల సేకరణ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా, నిర్ణీత గడువులోగా కొనుగోళ్లు పూర్తయ్యేలా పటిష్టమైన కార్యాచరణతో ముందుకు సాగాలని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో పౌర సరఫరాల శాఖ అధికారులు రాజేందర్, సుధాకర్, డీఆర్‌డీఓ విజయలక్ష్మి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## టీఎస్ యూటీఎఫ్ గరిడేపల్లి మండల నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక





**గరిడేపల్లి: అక్టోబర్ 27: మీడియా టుడే:**
తెలంగాణ ఉపాధ్యాయ సంఘం (టీఎస్ యూటీఎఫ్) గరిడేపల్లి మండల నూతన కమిటీని మండల మహాసభలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ?ఈ మహాసభలో సంఘం అధ్యక్షులుగా బి. నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా జి. వెంకటరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే ఉపాధ్యక్షులుగా బి. నవీన్ కుమార్, మహిళా ఉపాధ్యక్షులుగా టి. రేణుక, కోశాధికారిగా సి. సైదులుతో పాటు వివిధ బాధ్యతలకు పలువురు ఉపాధ్యాయులు ఎన్నికయ్యారు. ?ఈ కార్యక్రమానికి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. అనిల్ కుమార్, జిల్లా కార్యదర్శి కె. బాలసైదిరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ ఎన్. సాంమయ్య పరిశీలకులుగా వ్యవహరించగా, గరిడేపల్లి మండల ఫ్యూచర్ వెల్ఫేర్ ఫండ్ ( ఎఫ్ డబ్ల్యూ ఎఫ్ ) కన్వీనర్ ఆర్. రవీందర్ మరియు పలువురు ఉపాధ్యాయులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## వ్యక్తిగత వసూళ్లకు, నిర్మాణ అరాచకానికి పాల్పడిన వెంకటేష్ ను తొలగించాం

**మీడియా టుడే ఖమ్మం ప్రతినిధి**





వ్యక్తిగత, ఆర్థిక అరాచక వసూళ్లకు ,నిర్మాణఅరాచకత్వానికి పాల్పడిన వెంకటేష్ ను నిర్మాణ పరంగా రెండు నెలల క్రితమే పి డి యస్ యూ నుండి తొలగించామని పి డి యస్ యూ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కాంపాటి పృథ్వీ, ఖమ్మం జిల్లా అధ్యక్షులు తిప్పారపు లక్ష్మణ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యక్తిగత పనులు చేసుకుంటూ సంఘం పేరు చెప్పుకొని ఆర్థిక వసూళ్లు చేస్తూ ఆర్థిక అరాచకత్వానికి, తప్పుడు పద్ధతులకు పాల్పడినందుకు వెంకటేష్ ను బహిష్కరించామని కానీ వెంకటేష్ మీడియా ముందు మాట్లాడుతూ, పిడిఎస్యు నుండి ఎన్ డి పి డి యస్యూలోకిచేరుతున్నట్లుగాప్రకటించుకున్నాడని మేము తొలగించి రెండు నెలలు అయినప్పటికీ మాస్ లైన్ పి డి యస్యూనుండిచేరుతున్నట్లుగా ప్రకటించుకోవడం అనైతికమని కాంపాటి పృధ్వి పి డి ఎస్ యు రాష్ట్ర అధ్యక్షులు,తిప్పారపు లక్ష్మణ్ పి డి యస్ యూ ఖమ్మం జిల్లా అధ్యక్షులు తెలిపారు.

# తుఫాను హెచ్చరికల నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలి

### అక్టోబర్ 27 నుంచి 29 వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం

### పంటల రక్షణకు ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరి -పర్వతగిరి తహసీల్దార్ వెంకటస్వామి



పర్వతగిరి అక్టోబర్ 27 , మీడియా టుడే
బంగాళాఖాతంలో ఏర్పడినట్లు పేర్కొన్న అర్నాబ్ తుఫాను ప్రభావంతో అక్టోబర్ 27 నుంచి 29 వరకు తెలంగాణలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని పర్వతగిరి తహసీల్దార్ వెంకటస్వామి సూచించారు. పంటలకు నష్టం వాటిల్లకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

**పంటల రక్షణకు చర్యలు**

కోతకు సిద్ధంగా ఉన్న పంటలను వీలైనంత త్వరగా కోసి, ధాన్యం తడవకుండా సురక్షితమైన ఎత్తైన ప్రాంతాల్లో నిల్వ చేసుకోవాలని తహసీల్దార్ సూచించారు. కోతకు రాని పంట పొలాల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా కాలువలను శుభ్రం చేసి, నీటి పారుదలకు తగిన ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. వరి, పత్తి, మిర్చి, మొక్కజొన్న తదితర పంటలు ఈదురుగాలులకు నేలకొరిగే ప్రమాదం ఉన్నందున అవసరమైన రక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు, వ్యవసాయ పరికరాలు, ఇంధనాన్ని నీరు చేరని సురక్షిత ప్రదేశాల్లో భద్రపరచుకోవాలని తెలిపారు.

**పశువుల భద్రతపై జాగ్రత్తలు**

భారీ వర్షాలు, ఈదురుగాలుల సమయంలో పశువులు, కోళ్లను సురక్షితమైన షెడ్లలో ఉంచాలని, వాటికి అవసరమైన దాణా, తాగునీరు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని సూచించారు. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులు వీచే సమయంలో రైతులు పొలాల్లో పనులు చేయకూడదని, చెట్ల కింద లేదా విద్యుత్ స్తంభాల సమీపంలో ఆశ్రయం పొందకూడదని హెచ్చరించారు.వరద ముప్పు ఉన్న ప్రాంతాల్లో నివసించే రైతులు, ప్రజలు అధికారుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని, సామాజిక మాధ్యమాల్లో వచ్చే ధ్రువీకరించని సమాచారాన్ని నమ్మకూడదని తెలిపారు.

**పంట నష్టాన్ని నమోదు చేయాలి**

వర్షాలు తగ్గిన అనంతరం పొలాల్లో నిలిచిన నీటిని వీలైనంత త్వరగా తొలగించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. పంటలకు నష్టం వాటిల్లితే ఫొటోలు తీసి నమోదు చేసుకోవాలని, అవసరమైనప్పుడు వ్యవసాయ, రెవెన్యూ శాఖ అధికారులకు సమాచారం అందించాలని కోరారు.రైతులు వాతావరణ శాఖ అధికారిక హెచ్చరికలను ఎప్పటికప్పుడు గమనిస్తూ, వ్యవసాయ శాఖ అధికారులు సూచించిన జాగ్రత్తలను పాటించాలని తహసీల్దార్ వెంకటస్వామి కోరారు. పంటల రక్షణతో పాటు రైతులు, వారి కుటుంబ సభ్యుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

# విక్రమ్ శీల్ బుద్ధ విహార్‌కు చేరిన పవిత్ర బోధి వృక్షం మొక్క

### - బుద్ధ గయ నుంచి తీసుకొచ్చిన పవిత్ర మొక్కకు రాంటెక్‌లో మంగళహారతులతో స్వాగతం

### - విక్రమ్ శీల్ బుద్ధ విహార్‌లో నాటేందుకు బౌద్ధ ప్రజల ఏర్పాట్లు

**ముధోల్ అక్టోబర్ 27 మీడియా టుడే జిల్లా ప్రతినిధి**
బుద్ధ గయలో గౌతమ బుద్ధుడు జ్ఞానోదయం పొందిన పవిత్ర బోధి వృక్షానికి చెందిన మొక్కను మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా హిమాయత్‌నగర్ తాలూకా కాలేగావ్ గ్రామానికి చెందిన మహాథేరో బంతే తీసుకువచ్చారు. అనంతరం లోహా తాలూకా గోలేగావ్ గ్రామానికి చెందిన బంతే బోధి ధమ్మోకు అందజేశారు. ఆయన ఆ పవిత్ర మొక్కను నిర్మల్ జిల్లా ముధోల్ మండలం రాంటెక్ గ్రామానికి చెందిన బౌద్ధ ప్రజలకు అందించి, గ్రామంలోని విక్రమ్ శీల్ బుద్ధ విహార్ వద్ద నాటాలని సూచించారు.పవిత్ర బోధి వృక్షం మొక్కను రాంటెక్ గ్రామానికి తీసుకువచ్చిన బౌద్ధ ప్రజలు భక్తిశ్రద్ధలతో స్వాగతం పలికారు. గ్రామంలోని ఆటో స్టాండ్ నుంచి విక్రమ్ శీల్ బుద్ధ విహార్ వరకు మహిళలు మంగళహారతులు పట్టుకొని, బౌద్ధ సంప్రదాయాన్ని ప్రతిబింబించేలా 'బుద్ధం శరణం గచ్ఛామి, ధమ్మం శరణం గచ్ఛామి, సంఘం శరణం గచ్ఛామి' అంటూ త్రిశరణాలను జపిస్తూ మొక్కను విహార్‌కు తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. బీహార్ రాష్ట్రంలోని బుద్ధ గయ ప్రపంచవ్యాప్తంగా బౌద్ధులకు అత్యంత పవిత్రమైన పుణ్యక్షేత్రాల్లో ఒకటి. ఇక్కడి మహాబోధి ఆలయ ప్రాంగణంలో ఉన్న బోధి వృక్షం కిందనే సిద్ధార్థ గౌతముడు ధ్యానం చేసి జ్ఞానోదయం పొంది బుద్ధుడిగా మారినట్లు బౌద్ధ సంప్రదాయం చెబుతోంది. అందుకే బోధి వృక్షం బౌద్ధులకు జ్ఞానం, శాంతి, కరుణ, మానవతకు ప్రతీకగా నిలుస్తోంది. ఈ పవిత్ర స్థలంలోని మహాబోధి ఆలయ సముదాయాన్ని యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశంగా గుర్తించింది.బోధి వృక్షాన్ని సాధారణ చెట్టుగా కాకుండా బుద్ధుని జ్ఞానోదయాన్ని గుర్తుచేసే పవిత్ర చిహ్నంగా బౌద్ధులు భావిస్తారు. బుద్ధుని బోధనలను ఆచరిస్తూ శాంతి, అహింస, సమానత్వం, సోదరభావంతో జీవించాలనే సందేశాన్ని ఈ వృక్షం తరతరాలకు అందిస్తోంది. బౌద్ధ విహారాల్లో బోధి వృక్షాలను నాటి సంరక్షించడం కూడా ఈ సంప్రదాయంలో భాగంగా కొనసాగుతోంది.బుద్ధ గయ నుంచి వచ్చిన ఈ పవిత్ర బోధి



వృక్షం మొక్కను విక్రమ్ శీల్ బుద్ధ విహార్ వద్ద మహాథేరో బంతే చేతుల మీదుగా నాటేందుకు త్వరలో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేయనున్నట్లు రాంటెక్ గ్రామ బౌద్ధ ప్రజలు తెలిపారు. మొక్కను పవిత్ర భావనతో సంరక్షిస్తూ, భవిష్యత్తు తరాలకు బుద్ధుని జ్ఞానోదయ సందేశాన్ని అందించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామంలో బౌద్ధ ధమ్మం, శాంతి, సౌభ్రాతృత్వ సందేశాలు మరింత విస్తరిస్తాయని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

# కాంగ్రెస్ నయవంచనను పట్టభద్రులు తిప్పికొట్టాలి: ఎమ్మెల్సీ చల్లా నవీన్ రెడ్డి

### కోస్గిలో బీఆర్ఎస్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలి హాజరైన

### ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డికోస్గి

**మీడియా టుడే అక్టోబర్ 27:**
రాబోయే మహబూబ్‌నగర్ – రంగారెడ్డి – హైదరాబాద్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక, నిరుద్యోగ వ్యతిరేక విధానాలను పట్టభద్రులు తమ ఓటు హక్కుతో తిప్పికొట్టాలని ఉమ్మడి మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ, కొడంగల్ నియోజకవర్గ ఎన్నికల ఇంచార్జ్ చల్లా నవీన్ రెడ్డి పిలుపునిచ్చారు.కొడంగల్ నియోజకవర్గం కోస్గి మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో, మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి నేతృత్వంలో పట్టభద్రుల ఓటు హక్కు నమోదుపై ప్రత్యేక అవగాహన, సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి మాట్లాడారు.చట్టసభల్లో నిరుద్యోగులు, విద్యావంతుల సమస్యలపై గళం విప్పే ఏకైక పార్టీ బీఆర్ఎస్ మాత్రమేనని ఆయన స్పష్టం చేశారు. కేసీఆర్ ప్రతిపాదించే అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించి, నిరుద్యోగుల హక్కులను సాధించుకుందామని పిలుపునిచ్చారు. అర్హులైన పట్టభద్రులందరూ వచ్చే నవంబర్ 6 లోపు తమ ఓటు హక్కును తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని కోరారు.నిరుద్యోగులను నమ్మించి గొంతు కోశారు:అధికారంలోకి వస్తే ఏడాదిలో 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని, నిరుద్యోగ భృతి ఇస్తామని నమ్మబలికిన కాంగ్రెస్ పార్టీ, అధికార పీఠం ఎక్కాక నిరుద్యోగులను పూర్తిగా విస్మరించిందని ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వేసిన నోటిఫికేషన్ల ప్రకారమే ఉద్యోగాలు ఇచ్చి, తామేదో సాధించామని కాంగ్రెస్ నాయకులు డబ్బా కొట్టుకుంటున్నారే తప్ప, కొత్తగా ఒక్క ఉద్యోగ నోటిఫికేషన్ కూడా సక్రమంగా ఇవ్వలేకపోయారని ధ్వజమెత్తారు. జాబ్ క్యాలెండర్ పేరుతో నిరుద్యోగ యువతను కాలయాపన చేస్తూ మోసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.విద్యా రంగాన్ని నిర్వీర్యం చేశారు:ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు సకాలంలో విడుదల చేయక విద్యార్థులను, విద్యా సంస్థలను కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు. నిరుద్యోగులు తమ హక్కుల కోసం శాంతియుతంగా ధర్నాలు చేస్తుంటే, అక్రమ అరెస్టులు చేయిస్తూ నిర్బంధ పాలన సాగిస్తున్నారని ఆరోపించారు. ఈ ప్రజావ్యతిరేక




ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలంటే విద్యావంతుల గళం శాసనమండలిలో వినబడాలని, అందుకు బీఆర్ఎస్ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.ఈ సమావేశంలో నియోజకవర్గ పట్టభద్రులు, పలువురు ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ ముఖ్య నాయకులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# క్యాన్సర్ పై మహిళలు అప్రమత్తంగా ఉండాలి

### -ఉచిత మెగా వైద్య శిబిరంలో ఎమ్మెల్యే డా.కవ్వంపల్లి



**ఇల్లంతకుంట మండల రిపోర్టర్ మీడియా టుడే , అక్టోబర్ 27 :**
ప్రాణాంతకమైన క్యాన్సర్ వ్యాధిపై మహిళలు అవగాహన పెంచుకుంటూ అప్రపత్తంగా ఉండాలని టీపీసీసీ ఎస్సీ చైర్మన్, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు.ఇల్లంతకుంట మండల కేంద్రంలోని జై శ్రీమన్నారాయణ ట్రస్ట్ భవనంలో మంగళవారం మహిళలకు ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షల శిబిర ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధిపై సరైన అవగాహన లేకపోవడం వల్ల చాలామంది మహిళలు ఈ వ్యాధి బారినపడటం ఆందోళన కలిగిస్తోందన్నారు. ప్రాథమిక దశలోనే వ్యాధి లక్షణాలు గుర్తించి చికిత్స పొందితే ఈ వ్యాధి దూరమవుతుందని చెప్పారు. గైనకాలజిస్ట్ అయిన త సతీమణి డాక్టర్ కవ్వంపల్లి అనురాధ మహిళలు ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలు, వ్యాధుల గురించి తెలుసు కనుకనే క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయించేందుకు ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వ ఆధీనంలో నడుస్తున్న ఎం.ఎన్.జె. ఆంకాలజీ సంస్థ, ప్రాంతీయ క్యాన్సర్ కేంద్రానికి చెందిన వైద్యులు ఉచితంగా వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నారని, క్యాన్సర్ వ్యాధిగ్రస్తులను గుర్తించిన తదుపరి కూడా ప్రభుత్వపరంగా వైద్య సహాయం అందించడం జరుగుతుందన్నారు. ఈ వ్యవహారాల్లో కార్పొరేట్ ఆసుపత్రుల ప్రమేయం ఎంత మాత్రం ఉండబోదని ఆయన స్పష్టం చేశారు. ఈ విషయంలో ఎలాంటి అనుమానాలకు, అపోహలకు తావు లేదని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు.అంకిత్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఎండీ డాక్టర్ అనురాధ మాట్లాడుతూ మహిళలు క్యాన్సర్ వ్యాధిబారిన పడకుండా ఉండాలనే ఉద్దేశంతోనే వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.ఈ శిబిరంలో మహిళలకు మూడు రకాల క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆమె వివరించారు.రొమ్ము క్యాన్సర్, నోటి క్యాన్సర్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. క్యాన్సర్‌పై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టామని, అందులో భాగంగానే తొలుత మానకొండూరు మండల కేంద్రంలో నిర్ధారణ పరీక్షల శిబిరం నిర్వహించగా ఇప్పుడు ఇల్లంతకుంటలో నిర్వహిస్తున్నట్లు ఆమె వివరించారు. ఇలాగే అన్ని మండలాల్లోనూ ఇతర శిబిరాలను నిర్వహిస్తామని ఆమె వివరించారు.ఈ శిబిరంలో డాక్టర్ సంధ్య, డాక్టర్ తేజస్విని, డాక్టర్ వినీలయ్,సీ. సర్వేశ్వర ప్రసాద్, డాక్టర్ రేవతి, డాక్టర్ శంషద్, డాక్టర్ సాయి తేజ , డాక్టర్ సరస్వతి, డాక్టర్ శ్రీవల్లి, డాక్టర్ వినయ్, డాక్టర్ జిక్రియా, డాక్టర్ ఎండి సుల్తానా అయ్యపరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కోమటిరెడ్డి భాస్కర్ రెడ్డి,పాక్స్ చైర్మన్ ఊట్కూరు వెంకటరమణారెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ అంతగిరి సాహిత్య-వినయ్, వైస్ చైర్మన్ భరత్ రెడ్డి,ఇల్లంతకుంట గ్రామ సర్పంచ్ మామిడి రాజు, బెజ్జంకి పాక్స్ చైర్మన్ ఒగ్గు దామోదర్, ఏఎం సీ మాజీ చైర్మన్లు ఐరెడ్డి మహేందర్ రెడ్డి, పులి కృష్ణ, నాయకులు కాత మల్లేశం,నేరెళ్ళ విజయ్, పసుల వెంకట,గౌడ్,బొలవేని రమేష్,భాస్కర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ స్థాయి వూషూ పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు కలెక్టర్ భవేశ మిశ్రా అభినందన

### ఖేలో ఇండియా క్రీడాకారులకు క్రీడా కిట్లు అందజేత

**నిర్మల్ కలెక్టరేట్: మీడియా టుడే సబ్ ఎడిటర్ అక్టోబర్ 27, 2026**



రాష్ట్రస్థాయి వూషూ క్రీడా పోటీల్లో పతకాలు సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులను జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అభినందించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో క్రీడాకారులకు పతకాలు, ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. జిల్లా ఖేలో ఇండియా శిక్షణ కేంద్రం విద్యార్థులకు క్రీడా సంబంధిత కిట్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం అభినందనీయమన్నారు. జాతీయ స్థాయి పోటీల్లోనూ ఇదే స్ఫూర్తితో రాణించి జిల్లా ఖ్యాతిని ఇనుమడింపజేయాలని క్రీడాకారులకు సూచించారు. క్రీడల్లో నిరంతర సాధన, క్రమశిక్షణ, పట్టుదలతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.ఈ నెల 24, 25 తేదీల్లో మంచిర్యాల జిల్లా కేంద్రంలో అమెచ్యూర్ వూషూ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో నిర్వహించిన నాలుగో సీనియర్ రాష్ట్రస్థాయి వూషూ క్రీడా పోటీల ఎంపికల్లో నిర్మల్ జిల్లా ఖేలో ఇండియా శిక్షణ కేంద్రం క్రీడాకారులు సత్తా చాటారు. రెండు బంగారు పతకాలు, ఒక రజత పతకం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.ఖేలో ఇండియా శిక్షణ కేంద్రానికి చెందిన మృణాళిని వింగ్ చున్ విభాగంలో బంగారు పతకం, ఫ్లెక్సిబుల్ వెపన్ విభాగంలో రజత పతకం సాధించగా, జ్ఞానతేజ 60 కేజీల విభాగంలో బంగారు పతకం కైవసం చేసుకున్నారు. బంగారు పతకాలు సాధించిన మృణాళిని, జ్ఞానతేజ డిసెంబర్ 9 నుంచి 15 వరకు అరుణాచల్ ప్రదేశ్‌లోని ఇటానగర్‌లో జరగనున్న 35వ జాతీయ స్థాయి వూషూ క్రీడా పోటీల్లో పాల్గొననున్నారు.అక్టోబర్ 28 నుంచి నవంబర్ 2 వరకు తమిళనాడులోని చెన్నైలో జరగనున్న 25వ జాతీయ స్థాయి వూషూ పోటీల్లో నిర్మల్ జిల్లా ఖేలో ఇండియా శిక్షణ కేంద్రానికి చెందిన మరో ముగ్గురు క్రీడాకారులు పాల్గొననున్నారు. గోర అనన్య తైజీజియన్ విభాగంలో, నార్వాడే ఆయుష్ 45 కేజీల విభాగంలో, సల్ల రామ్ చరణ్ 56 కేజీల విభాగంలో పోటీపడనున్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి శ్రీకాంత్ రెడ్డి, ఖేలో ఇండియా వూషూ శిక్షకులు శ్రీరాముల సాయికృష్ణ, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# దళారుల చేతుల్లో రైతులు మోసపోవద్దు

**ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి- -ఎమ్మెల్యే కవ్వంపల్లి**



**ఇల్లంతకుంట మండల రిపోర్టర్ : మీడియా టుడే , అక్టోబర్ 27 :**
ధాన్యం విక్రయాల విషయంలో రైతులు దళారుల చేతుల్లో మోసపోవద్దని మానకొండూరు ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ సూచించారు. మంగళవారం ఇల్లంతకుంట మండలంలోని వంతడ్పుల, అనంతారం గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు దళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే తమ పంటను విక్రయించాలని కోరారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను నిర్వహిస్తున్నందున పారదర్శకతకు పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. ధాన్యం తూకంలో కోతలు, తేమ శాతం నిర్ధారణలో మోసాలకు తావులేకుండా కొనుగోళ్లు చేపడతామని స్పష్టం చేశారు. కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన డబ్బులు 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో జమయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దాలన్నదే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యమని, ఆ ఆశయ సాధనలో భాగంగానే మహిళా సంఘాలకు ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ బాధ్యతలు అప్పగిస్తున్నట్లు వివరించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు ప్రక్రియను సజావుగా నిర్వహించాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమాల్లో ఇల్లంతకుంట పీఏసీఎస్ చైర్మన్ ఊట్కూరి వెంకటరమణారెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సప్తగిరి సాహిత్య వినయ్ కుమార్, వైస్ చైర్మన్ భరత్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి ప్రవీణ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి భాస్కర్ రెడ్డి, సర్పంచులు లావణ్య రవి, మామిడి రాజు, నేరెళ్ల విజయ్, పసుల వెంకటి తదితరులు పాల్గొన్నారు.

## తిమ్మాపురం గ్రామంలో ఎల్ నినో పైన గ్రామ సభ



**ఆలేరు ఆర్సీ, అక్టోబరు27/మీడియా టుడే:**
యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలం తిమ్మాపురం,సర్వపల్లి, రాయిపల్లి గ్రామాల్లో ఎల్ నినో పైన గ్రామ సభలు నిర్వహించారు. రైతులు ఆరుతడి పంటలను పండించటానికి ప్రయత్నించాలని అన్నారు. వ్యవసాయ పనులు లేనందున విబి జీ రామ్ జీ పనులకు సిద్ధంగా ఉండాలని జాబ్ కార్డు కలిగిన ప్రతి కుటుంబ ఉపాధి పనులు ఉపయోగించుకోవాలని అన్నారు. ఆరోగ్య శాఖ, పశుసంవర్ధక శాఖ మండల అధికారులు వాతావరణ పరిస్థితులకు అనుకూలంగా మలచుకోవాలని అన్నారు. వ్యవసాయ అధికారులు మాట్లాడుతూ వాతావరణాన్ని బట్టి పంటలను సాగు చేసుకోవాలని సూచించారు. మీషన్ భగీరథ ఏఈ మాట్లాడుతూ ఎల్ నినో ప్రబావం వలన నీరు రోజు వారి విడిచి రోజుగా వస్తున్నాయి అని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచులు సభకు అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో తిమ్మాపురం సర్పంచ్ కొస్న లక్ష్మికిష్టయ్య యాదవ్, సర్వపల్లి సర్పంచ్ కల్వకుంట్ల ఉపేందర్ రెడ్డి, రాయిపల్లి సర్పంచ్ ఇంద్రాల అంజయ్య, తిమ్మాపురం ఉప సర్పంచులు బట్టు మహేష్,వార్డు సభ్యులు తొల్పునూరి చంద్రయ్య గౌడ్, మండల పరిషత్ అధికారి నారగోని శ్యామ్ కుమార్ గౌడ్,విబి జీ రామ్ జీ ఏపీఓ బొడిగె రమేష్ గౌడ్, పంచాయతీ కార్యదర్శి ఆంబోజు శేఖర్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అధికారులు- సిబ్బంది, పశువైద్యాధికారి సంతోష్, మీషన్ భగీరథ ఏఈ, సిబ్బంది, హౌసింగ్ ఏఈ, వ్యవసాయ విస్తరణ అధికారి రాజశేఖర్,విద్యుత్ శాఖ, అంగన్వాడీ టీచర్ బట్టు వైష్ణవి,విబిజీ రామ్ జీ ఏఫ్ఏ ఎన్ రవిందర్ రెడ్డి,గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## పట్టభద్రులు వెంటనే ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవాలి

**నవంబర్ 6 చివరి తేదీ -- గడువు కోసం**

**వేచి చూడవద్దు: గుదే మధుసూదన్ యాదవ్**



**ఆలేరు ఆర్సీ, అక్టోబరు27/మీడియా టుడే:**
నల్లగొండ - ఖమ్మం--వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హులైన పట్టభద్రులందరూ ఫారం-18 ద్వారా కొత్తగా ఓటరుగా నమోదు చేసుకోవాలని బీజేపీ మోత్కూర్ మండల పార్టీ అధ్యక్షులు గుదే మధుసూదన్ యాదవ్ విజ్ఞప్తి చేశారు. డిగ్రీ పూర్తి చేసి అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు తన ఓటు హక్కును వినియోగించుకునేందుకు ముందుగానే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. గతంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరుగా నమోదైనవారు సైతం ఈసారి మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. చివరి తేదీ: 06 నవంబర్ 2026. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నవారు ధ్రువపత్రాల పరిశీలనకు సంబంధించి బీఎల్ఓ (దీూా) లేదా సంబంధిత ఎన్నికల అధికారుల సూచనలను పాటించాలని తెలిపారు. దరఖాస్తుదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియను సులభతరం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆన్‌లైన్ దరఖాస్తు:
https://ceotserms2.telangana.gov.in/MLC/Form18.aspx
"పట్టభద్రులారా.. మీ ఓటు మీ హక్కు, మీ గొంతుక! చివరి తేదీ వరకు వేచి చూడకుండా నేటికే నమోదు చేసుకోండి. ప్రజాస్వామ్య బలోపేతంలో భాగస్వాములు కండి." అంటున్న బీజేపీ మోత్కూర్ మండల పార్టీ అధ్యక్షులు గుదే మధుసుదన్ యాదవ్.

## పట్టా బద్రులు ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోవాలి

**జంగంపల్లి గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ ఒగ్గు మల్లేష్, కర్రె చంద్రశేఖర్**



**ఆలేరు ఆర్సీ, అక్టోబరు27/మీడియా టుడే:**
రాబోయే వరంగల్ ఖమ్మం నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో అరగత ఉన్న ప్రతి పట్టభద్రుడు తప్పనిసరిగా తమ పేరును పట్టాభద్రుల ఓటర్ జాబితాలో నమోదు చేసుకోవాలని బీఆర్ఎస్ యాదగిరిగుట్ట మండల నాయకులు కర్రె చంద్రశేఖర్ కోరారు. జంగంపల్లి యాదగిరిగుట్ట మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ ఆయన పట్టా బద్రుల ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించారు. 2023 సంవత్సరం నాటికి లేదా అంతకు ముందు డిగ్రీ పూర్తి చేసినా అర్హత కలిగిన పట్టా బద్రులు ఎలాంటి నిర్లక్ష్యం చేయకుండా తమ పేరును ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని సూచించారు. పట్టా బద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో ఓటు హక్కు సాధారణ ఎన్నికల ఓటు హక్కుకు భిన్నంగా ఉండటంతో అర్హత ఉన్నవారు ప్రత్యేకంగా పట్టా బద్రుల ఓటరుగా నమోదు చేసుకోవలసిన అవసరం ఉందని తెలిపారు. గతంలో పట్టాభద్రుల ఓటరుగా నమోదు చేసుకున్న వారు కూడా మరొకసారి తమ పేరును నమోదు చేసుకోవలసిన అవసరం ఉందని కర్రె చంద్రశేఖర్ సూచించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్వి మండల అధ్యక్షులు ఒగ్గు మల్లేష్, మల్లపురం ఇన్చార్జ్ మోటే శేఖర్, జంగంపల్లి గ్రామ శాఖ అధ్యక్షులు సున్నం లక్ష్మయ్య ,తోట రాము తదితరులు పాల్గొన్నారు.

# కనీస మద్దతు ధరల చట్టం చేయాలి

**రైతులు పండించిన పంటలన్నీ ప్రభుత్వం కొనుగోలు చేయాలి**

**తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి మాటూరి బాలరాజు గౌడ్**

**ఆలేరు ఆర్సీ, అక్టోబరు27/మీడియా టుడే:**
యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండల రైతు సంఘం 6వ మహాసభ పల్లెర్ల గ్రామంలో ఒంటిపింటి గోపాల్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ మహా సభకు ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మాటూరి బాలరాజు గౌడ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కనీస మద్దతు ధరల చట్టం చేయాలని, రైతులకు రుణ విమోచన చట్టం చేసి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా రైతాంగం అనేక సమస్యలను ఎదుర్కోవడం జరుగుతుందని ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందం వలన దేశీయ రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పత్తి ,వంట నూనెలపై విదేశీ దిగుమతులను యదేచ్ఛగా అనుమతించడంతో మన భారత రైతాంగం తీవ్రంగా నష్టపోతున్నారని వెంటనే దిగుమతి సుంకాన్ని పునరుద్ధరించాలని పేర్కొన్నారు. కౌలు రైతుల చట్టం 2011 ప్రకారం రుణార్హత కార్డులు ఇవ్వాలని ప్రభుత్వ పథకాలు కౌలు రైతులకు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులను ప్రాధాన్యత క్రమంలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాన్ని పూర్తి చేయాలని తెలిపారు. పాలకుల నిర్లక్ష్యం వలన జిల్లాలో ఎల్ నినో ప్రభావంతో ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికి రాక రైతాంగం దిక్కుతోచని స్థితిలోజిల్లా అధికారులు వ్యవసాయ శాఖ ప్రతి మండల కేంద్రం నుంచి క్షేత్రస్థాయిలో రైతుల పంట నష్టాన్ని అంచనావేసి రైతాంగానికి నష్టపరిహారం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం మండల మహాసభ నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. రైతు సంఘం ఆత్మకూరు(ఎం) మండల నూతన గౌరవాధ్యక్షులుగా ఒంటి పెంటి గోపాల్ రెడ్డి,అధ్యక్షులుగా నాయని కృష్ణారెడ్డి , ఉపాధ్యక్షులుగా రేస్ యాదిరెడ్డి,కందాడి వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా తుమ్మల సత్యనారాయణ రెడ్డి,సహాయ కార్యదర్శులుగా నిమ్మన గోటి మల్లయ్య,మల్లెల శ్రీశైలం, మండల కమిటీ సభ్యులుగా నాయిని యాదిరెడ్డి,పొన్నం రాజమల్లు ఏకగ్రీవంగా ఎన్నిక కావడం జరిగింది. ఈ కార్యక్రమంలో వృత్తి సంఘాల మండల కన్వీనర్ వేముల బిక్షం,నాయని రామ్ రెడ్డి, ఏపూరి బుగ్గ రాములు, పొన్నగనే బిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.



## గుండాల రెవిన్యూ శివారులో ప్రభుత్వ భూమి ఆక్రమణలను వెంటనే అరికట్టాలి

**సర్వే నంబర్ 390లో అక్రమ కబ్జాలు,తవ్వకాలు, నిర్మాణాలను తక్షణమే నిలిపివేయాలి**

**ఆలేరు ఆర్సీ, అక్టోబరు27/మీడియా టుడే:**
యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం కేంద్రం రెవిన్యూ శివారులోని ప్రభుత్వ భూమి సర్వే నంబర్ 390లో జరుగుతున్నట్లు ఆరోపణలు ఉన్న అక్రమ కబ్జాలు, తవ్వకాలు, నిర్మాణాలపై సంబంధిత రెవిన్యూ అధికారులు తక్షణమే స్పందించి తగిన చర్యలు చేపట్టాలి. ప్రభుత్వ భూములు ప్రజల ఉమ్మడి ఆస్తులు. వాటిని పరిరక్షించడం అధికారుల బాధ్యత. ప్రభుత్వ భూముల్లో ఎలాంటి అనుమతులు లేకుండా కబ్జాలు,మట్టి తవ్వకాలు,నిర్మాణాలు చేపడుతున్నట్లయితే వాటిని వెంటనే నిలిపివేయాలి. సంబంధిత భూమిని అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి,సమగ్ర సర్వే నిర్వహించి, భూమి హద్దులను నిర్ధారించాలి. ప్రధాన డిమాండ్లు: సర్వే నంబర్ 390లో జరుగుతున్న తవ్వకాలు, నిర్మాణాలపై తక్షణ విచారణ చేపట్టాలి. చట్టవిరుద్ధమైన పనులు జరుగుతున్నట్లు నిర్ధారణ అయితే వాటిని వెంటనే నిలిపివేయాలి. ప్రభుత్వ భూమికి నాలుగు వైపులా హద్దురాళ్లు ఏర్పాటు చేయాలి. ప్రభుత్వ భూమి వివరాలతో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి. ఆక్రమణలు జరిగినట్లు తేలితే చట్టప్రకారం చర్యలు తీసుకొని ప్రభుత్వ భూమిని పరిరక్షించాలి. ఈ వ్యవహారంలో నిర్లక్ష్యం వహించిన అధికారుల బాధ్యతను విచారించి తగిన చర్యలు చేపట్టాలి. ప్రభుత్వ భూములను కాపాడేందుకు జిల్లా కలెక్టర్, రెవిన్యూ డివిజనల్ అధికారి, మండల తహసీల్దార్ వెంటనే స్పందించి పారదర్శకంగా విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం. ప్రభుత్వ భూముల పరిరక్షణే ప్రజా ప్రయోజనం --- అక్రమ ఆక్రమణలను అరికట్టాలి!అంటున్న మండల కేంద్రం ప్రజలు.

## రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు శ్రీ గౌతమ్ హైస్కూల్ విద్యార్థినుల ఎంపిక



**ఆలేరు ఆర్సీ,అక్టోబరు 27/మీడియా టుడే:**
యాదాద్రి భువనగిరి జిల్లాలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి చెస్ పోటీల్లో యాదగిరిగుట్ట పట్టణానికి చెందిన శ్రీ గౌతమ్ హైస్కూల్ విద్యార్థినులు ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్-17 విభాగంలో 9వ తరగతి విద్యార్థిని ఐ.బి. సిరిచందన, అండర్-14 విభాగంలో 7వ తరగతి విద్యార్థిని భువన ప్రతిభ చాటారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ మిర్యాల దుర్గాప్రసాద్ విద్యార్థినులను అభినందించారు. విద్యార్థినులు భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థినుల విజయంపై పాఠశాల యాజమాన్యం,ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పిఈటీ పాండు పాల్గొన్నారు.

## రాష్ట్ర క్రీడలకు బయలుదేరుతున్న యాదాద్రి భువనగిరి జిల్లా క్రీడాకారులు



**ఆలేరు ఆర్సీ, అక్టోబరు27/ మీడియా టుడే:**
యాదాద్రి భువనగిరి జిల్లా క్రీడాకారులు ఈనెల 28, 29 ,30, తేదీలలో ఖమ్మం జిల్లా సత్తుపల్లిలో జరుగు 73వ ఉమెన్స్ రాష్ట్ర కబడి పోటీలకు, బయలు దేరుతున్న సందర్భంగా క్రీడాకారులకు కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ బుర్ర మహేందర్ యాదవ్ క్రీడా దుస్తులు,మరియు రవాణా చార్జీలు అందజేశారు. క్రీడాకారుల వీడ్కోలు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్టేట్ బ్యాంకు మేనేజర్ శ్రీనివాస నాయక్ అతిథిగా పాల్గొని క్రీడాకారులను ఉద్దేశిస్తూ మంచిక్రీడా నైపుణ్యం ప్రదర్శించి విజేతలుగా తిరిగి రావాలని మాట్లాడారు మరియు ఈ కార్యక్రమంలో జిల్లా అసోసియేషన్ కోశాధికారి గంధమాల కుమార్, సహాయ, కార్యదర్శి చిందం విజయ్ కుమార్,టెక్నికల్ బోర్డు సభ్యులు మంగళగిరి నరేష్, రిఫ్రిస్ బోర్డు సభ్యులు పూల చంద్రకుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు సమ్మయ్య, స్వామి, ఫ్రెండ్స్ క్లబ్ సభ్యులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు

## యాదాద్రి భువనగిరి జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించాలి

**వెంటనే కరువు సహాయక చర్యలు చేపట్టాలి**

**ఏ ఐ కె ఎం ఎస్ రాష్ట్ర అధ్యక్షులు మామిడాల భిక్షపతి,జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి కల్లెపు అడివయ్య, బేజాడి కుమార్**



**ఆలేరు ఆర్సీ, అక్టోబరు27/మీడియా టుడే:**
ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా నామ మాత్రం వర్షాలు కూడా కురవనందున పంటలు పూర్తిగా ఎండిపోవడంతో ఆర్థికంగా నష్టపోయిన రైతులు,తీవ్రమైన కరువు ఏర్పడడంతో వ్యవసాయ కూలీలు, ప్రజలు పనులులేక, పశువులకు గడ్డి కరువైందని అన్ని విధాల ప్రతికూల పరిస్థితులలో ప్రజలు బ్రతకడమే గగనమైఉన్న పరిస్థితి ఏర్పడినందున రాష్ట్రాన్ని మరియు యాదాద్రి భువనగిరి జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించాలని తక్షణమే కరువు సహాయక చర్యలు చేపట్టాలని అఖిల భారత రైతు కూలీ సంఘం(ఏ ఐ కె ఎం ఎస్) రాష్ట్ర అధ్యక్షులు మామిడాల భిక్షపతి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి కల్లెపు అడివయ్య, బేజాడి కుమార్ లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. మంగళవారం నాడు భువనగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు యాదాద్రి భువనగిరి జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ఏ ఐ కె ఎం ఎస్ ఆధ్వర్యంలో యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్నాలో పాల్గొన్న రైతు కూలీలు,సంఘం జిల్లా నాయకులు పెద్దపెట్టున జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని,కరువు సహాయక చర్యలు చేపట్టాలని నినదించారు. అనంతరం ధర్నా నుద్దేశించి భిక్షపతి, అడివయ్య,కుమార్ మాట్లాడుతూ,రాష్ట్రంలో, జిల్లాలో తీవ్రమైన కరువు పరిస్థితులు ముందుకు వచ్చినప్పటికి పాలకులు ఏమాత్రం పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ప్రజలకు,రైతు. కూలీలను తీవ్ర నష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కరువు పరిస్థితులు ఈ విధంగా ఉండగా,ప్రజలు భవిషత్లో ఎదురయ్యే కరువు కాటకాలను ఊహించుకుంటూ ఆవేదన చెందుతుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాత్రం దర్జాగా, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. యాదాద్రి భువనగిరి జిల్లాను మొత్తం గ్రామాన్ని యూనిట్గా చేసి, కరువుపై సమగ్ర సర్వే నిర్వహించి తగినన్ని నిధులు కేటాయించి కరువు నుంచి అన్ని వర్గాల ప్రజలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కరెంటు కోత పేరుతో ట్రూ ఆఫ్ విద్యుత్ చార్జీలను ప్రజలపై ఎనిమిది వేల కోట్ల రూపాయల భారం మోపడానికి పూనుకుంటున్నారని ఆరోపించారు. తీవ్రమైన కరువు పరిస్థితులు ఏర్పడే ప్రమాదం ఉన్నందున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామీణ,పట్టణ ప్రాంతాలలో ఉపాధి హామీ పథకం పనులను 200 వందలకు పెంచి ఎలాంటి కొలతలు లేకుండా రోజుకు కూలీ 600/- ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లాలో పెండింగ్ ప్రాజెక్ట్ లు పూర్తి చేయాలని,అందుకు బడ్జెట్లో అధిక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా ఉపాధ్యక్షులు ఇక్కిరి సహదేవ్, చిర బోయిన రాజయ్య, చిర బోయిన కొమురయ్య,మామిడాల బాల మల్లేష్ ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు ఆర్ సీత, మదనపల్లి గ్రామ ఉప సర్పంచ్ పద్మ శశిరేఖ,పి ఓ డబ్ల్యు జిల్లా నాయకురాలు తమ్మడి మాధవి, తమ్మడి ఉమా, ఐ ఎఫ్ టి యు జిల్లా అధ్యక్షులు పద్మ సుదర్శన్, పీ వై ఎల్ జిల్లా అధ్యక్షులు మారుజోడు సిద్దేశ్వర్, పిడిఎస్యు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్. ఉదయ్, ఏఐకేఎంఎస్ ఇతర ప్రజా సంఘాల జిల్లా డివిజన్ నాయకులు బర్మ బాబు, తమ్మడి అంజయ్య, పగడాల శివ, పంజాల మురళి, నేరేడు స్వామి, చింతకింది సత్యనారాయణ, పోత గాని నర్సింహ, తమ్మడి రమేష్ గడ్డం మంకయ్య, ఎర్రంబెల్లి ఐలయ్య, బరిగే ఉపేందర్, చిమ్మి అబ్బ సాయిలు, ఊరడి రామచంద్రు, సుంచు రాములు, కుర్రి మార్కండేయ, మేకల వెంకటేష్, వడ్డేపల్లి బాలరాజు, చంద్రయ్య, గోరుగంటి ముత్యాలు, దడిగ చంద్రయ్య, ఉచింతల మల్లేష్, సుంచు రాములు, బర్మ మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.



## కాజ్ మహల్ దర్గా ఉర్సు ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మార్పీఎస్ మాజీ జిల్లా అధ్యక్షులు దుబ్బ రామకృష్ణ మాదిగ

**ఆలేరు ఆర్సీ, అక్టోబరు27/మీడియా టుడే:**
యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి పట్టణంలోని కాజ్ మహల్ దర్గాలో నిర్వహించిన ఉర్సు ఉత్సవాల సందర్భంగా ఎమ్మార్పీఎస్ మాజీ జిల్లా అధ్యక్షులు దుబ్బ రామకృష్ణ మాదిగ ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దర్గాలో ప్రార్థనలు నిర్వహించి, ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. సమాజంలో శాంతి, మత సామరస్యం, సోదరభావం వెల్లివిరియాలని ప్రార్థించారు. కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ ఐకమత్యంతో జీవించాలని, అన్ని మతాలను గౌరవిస్తూ సమాజంలో సోదరభావాన్ని పెంపొందించాలని ఆయన ఆకాంక్షించారు.



## పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమంపై సన్నాహక సమావేశం

**పాల్గొన్న ఆలేరు మాజీ ఎమ్మెల్యే బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బూడిద భిక్షమయ్య గౌడ్**

**ఆలేరు ఆర్సీ, అక్టోబరు27/మీడియా టుడే:**
నాగార్జునసాగర్ నియోజకవర్గంలో వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమంపై మంగళవారం రోజు సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి,ఆలేరు మాజీ ఎమ్మెల్యే బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బూడిద బిక్షమయ్య గౌడ్,నాగార్జున సాగర్ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్,ఎమ్మెల్సీ కోటి రెడ్డి,బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు చింతల వెంకటేశ్వర్లు రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



# ఎమ్మెల్సీ ఓట్ల నమోదు బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఇంటింటికి ఫారం -18 స్లిప్పుల పంపిణీ

**ఆలేరు ఆర్సీ, అక్టోబరు27/మీడియా టుడే:**



యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండలం పనకబండలో వరంగల్ ఖమ్మం నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో తుంగతుర్తి మాజీ శాసనసభ్యులు డా గాదరి కిషోర్ కుమార్ ఆదేశానుసారం పనకబండ గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వరంలో విస్తృతంగా ఓటర్ నమోదు కార్యక్రమం చేపట్టారు. పనకబండ గ్రామపంచాయతీ పరిధిలోని పట్టభద్రులందరికి స్వయంగా ఫారం 18 ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయించడం జరిగింది. బిఆర్ఎస్ మోత్కూర్ మండల పార్టీ అధ్యక్షులు పోన్నె బోయిన రమేష్ మాట్లాడుతూ మోత్కూరు మండలంలోని అన్ని గ్రామాలలో మరియు పట్టణ కేంద్రంలో అర్హులైన గ్రాడ్యుయేట్స్ అందరు కూడా ఎమ్మెల్సీ ఓటు వచ్చేనెల 6 తారీకు లోపు నమోదు చేయించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతుబంధు సమితి మాజీ మండల అధ్యక్షులు కొండ సోంమల్లు బీసీ సెల్ మండల అధ్యక్షులు పానుగుల్ల విష్ణుమూర్తి గ్రామ శాఖ అధ్యక్షులు లోతుకుంట స్వామి మాజీ సర్పంచ్ బత్తిని తిరుమలేష్ లోతుకుంట అనిల్ కుమార్ ఎమ్మెల్సీ ఎన్నికల ఇంచార్జ్ బత్తిని మహేష్ బత్తిని మల్లేష్ పైళ్ల బుచ్చయ్య పోనెబోయిన మచ్చగిరి పోన్నెబోయిన పాండురంగడు బత్తిని రామలింగయ్య బత్తిని అంజయ్య ఓర్సు ఇద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా మెగా రక్తదాన శిబిరంను ప్రారంభించిన ఎమ్మెల్యే.




**మీడియా టుడే నాగర్ కర్నూల్ జిల్లా ప్రతినిధి (అక్టోబర్ 27):**
పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా నాగర్కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు ఈ శిబిరాన్ని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ ప్రారంభించారు ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ రక్తదానం అనేది ప్రాణదానంతో సమానమని, అత్యవసర పరిస్థితుల్లో రక్తం అందక ఎవరూ ప్రాణాలు కోల్పోకూడదనే లక్ష్యంతో ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రక్తదానం ద్వారా ఆపదలో ఉన్న ఎంతోమంది ప్రాణాలను కాపాడవచ్చని తెలిపారు. ప్రజల రక్షణ కోసం తమ ప్రాణాలను సైతం త్యాగం చేసిన పోలీస్ అమరవీరుల సేవలను స్మరించుకుంటూ, వారి త్యాగాలకు నిజమైన నివాళిగా ఇటువంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ శాఖ అధికారులు, సిబ్బంది, లయన్స్ క్లబ్ సభ్యులు, యువత మరియు రక్తదాతలు పాల్గొన్నారు.

# జాతీయ డ్రోన్ పోటీకి గీతం క్యాడెట్ల ఎంపిక

## తెలంగాణ నుంచి నలుగురు ఎంపిక

### అందులో ఇద్దరు గీతం ఎన్.సి.సి. క్యాడెట్లు

**పటాన్ చెరు ప్రతినిధి, మీడియా టుడే, అక్టోబర్ 27**



గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాదులోని ఎన్.సి.సి. క్యాడెట్లు మరోసారి తమ సత్తా చాటారు. అఖిల భారత అంతర్-డైరెక్టరేట్ డ్రోన్ పోటీ 2026లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ (ఏపీఅండ్‌టీ) డైరెక్టరేట్ కు ప్రాతినిధ్యం వహించడానికి ఇద్దరు గీతం ఎన్.సి.సి. క్యాడెట్లు ఎంపికయ్యారు. తమిళనాడులోని తిరుచెంగోడ్ లో గల కె.ఎస్. రంగస్వామి కాలేజ్ ఆఫ్ టెక్నాలజీ (కేఎస్ఆర్సీటీ)లో ఈనెల 23 నుంచి నవంబర్ 4 వరకు జరుగుతున్న పోటీలలో వీరు పాల్గొంటున్నారు. ఈ జాతీయ స్థాయి పోటీకి తెలంగాణ నుంచి కేవలం నలుగురు క్యాడెట్లు మాత్రమే ఎంపికవగా, వారిలో ఇద్దరు గీతం హైదరాబాద్ ఎన్.సి.సి. విద్యార్థులు కావడం గమనార్హం. ఎంపికైన క్యాడెట్లు- జూనియర్ అండర్ ఆఫీసర్ ఎ.అభినవ్ సాయి కార్తీక్ (సీనియర్ డివిజన్), జూనియర్ అండర్ ఆఫీసర్ తమ్ములూరి కావ్య (సీనియర్ వింగ్). వారి ఎంపిక డ్రోన్ కార్యకలాపాలలో వారి అంకితభావం, సాంకేతిక నైపుణ్యం, కృషి, ప్రతిభ, నిబద్ధతను ప్రతిబింబిస్తోంది. గీతం అసోసియేట్ ఎన్.సి.సి. అధికారి లెఫ్టినెంట్ ఎస్. అజయ్ కుమార్ మాట్లాడుతూ, "ఈ ప్రతిష్టాత్మక జాతీయ స్థాయి పోటీలో మా క్యాడెట్లు డైరెక్టరేట్ కు ప్రాతినిధ్యం వహించడం మాకు గర్వకారణం. వారి విజయం గీతం హైదరాబాదు ప్రోత్సాహాన్ని చాటిచెప్పడమే గాక, తోటి క్యాడెట్లు సాంకేతిక ఆవిష్కరణలను స్వీకరించి, ఎన్.సి.సి. కార్యకలాపాలలో రాణించడానికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తుంది" అని అన్నారు. గీతం హైదరాబాదు ఉన్నతాధికారులు కూడా ఈ ఇద్దరు క్యాడెట్ల అద్భుతమైన విజయాన్ని అభినందించి, వారు ఇదే ఉత్సాహాన్ని భవిష్యత్తులో కూడా కొనసాగించి, మరిన్ని విజయాలను అందుకోవాలని అభిలషించారు.

# పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు నమోదుపై బీజేపీ హెల్ప్ డెస్క్




**యాచారం, అక్టోబర్ 27(మీడియా టుడే):**
అర్హులైన పట్టభద్రులు ఎమ్మెల్సీ ఓటర్లుగా నమోదు చేసుకోవాలని కోరుతూ యాచారం మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు జరుపుల విజయ్ నాయక్ ఆధ్వర్యంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పట్టభద్రులు తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసుకుని ఓటు హక్కును వినియోగించుకోవాలని నాయకులు సూచించారు. ఈ కార్యక్రమంలో తాండ్ర రవీందర్, ఆంబోజి జగదీష్ యాదవ్, నాగని యాదయ్య, గోగికర్ రమేష్, గొల్లపల్లి జంగయ్య, సర్పంచులు విజయ్ కుమార్, కొలను రమాదేవి మల్లారెడ్డి, కొండాపురం నాగరాజు, కుంచారం సందీప్ రెడ్డి, నడికుడి కృష్ణ, పుప్పాల శాంతి కుమార్, సంజీవరెడ్డితో పాటు పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కేజీబీవీలో సబ్ కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

**- విద్య, భోజనం, పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి: మృనాల్ శ్రేష్ట**



**భద్రాచలం ,అక్టోబర్ 27(మీడియా టుడే):**
ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ స్థానికంగా ఉండి విద్యార్థినులకు నాణ్యమైన విద్యాబోధన అందించాలని భద్రాచలం సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ట సూచించారు. మంగళవారం భద్రాచలంలోని కేజీబీవీ పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తరగతి గదులు, డార్మెటరీ, స్టోర్ రూమ్, డైనింగ్ హాల్, వంటశాల, మరుగుదొడ్లు, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా, ఉపాధ్యాయులు పాఠ్యాంశాలను ఎలా బోధిస్తున్నారు, పాఠశాలలో నెలకొన్న సమస్యలేమిటని విద్యార్థినులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు .మారుమూల గిరిజన గ్రామాల నుంచి వచ్చి చదువుకుంటున్న విద్యార్థినులు చదువుపైనే దృష్టి సారించి మంచి మార్కులతో ఉత్తీర్ణులై తల్లిదండ్రులకు, గ్రామానికి పేరు తీసుకురావాలని సూచించారు. సెల్‌ఫోన్లలో చాటింగ్, మెసేజ్‌లకు సమయం వృథా చేయవద్దని హితవు పలికారు. బాలికల పాఠశాల కావడంతో వాచ్‌మన్ 24 గంటలూ అందుబాటులో ఉండాలని, బయటి వ్యక్తులు అనుమతి లేకుండా లోపలికి రాకుండా చూడాలని, విద్యార్థినులు పాఠశాల నుంచి బయటకు వెళ్లకుండా పర్యవేక్షించాలని ప్రిన్సిపాల్, వార్డెన్‌కు సూచించారు. ప్రభుత్వ మెనూను తప్పనిసరిగా అమలు చేస్తూ తాజా కూరగాయలతో వండిన ఆహారాన్ని నిర్ణీత సమయానికి వేడిగా వడ్డించాలని ఆదేశించారు. పాఠశాల పరిసరాలు, కాలువలు, మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచాలని, నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని, ఏఎన్ఎం 24 గంటలూ అందుబాటులో ఉండాలని తెలిపారు. వర్షాకాలంలో విషపురుగుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, రాత్రివేళ విద్యార్థినులు బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థినుల సంక్షేమానికి ప్రాధాన్యమిస్తూ పాఠశాల నిర్వహణలో సమస్యలు తలెత్తితే వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ తనిఖీలో ప్రిన్సిపాల్, వార్డెన్ లీల, ఉపాధ్యాయినులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

# తిమ్మాపురం గ్రామంలో ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమం: ఏఈఓ రాజశేఖర్

**ఆలేరు ఆర్సీ, అక్టోబరు27/మీడియా టుడే:**
యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం తిమ్మాపురం గ్రామంలో మంగళవారం రోజు రైతులకు నేల సంరక్షణ, నీటి సంరక్షణ, వాతావరణ మార్పులను తట్టుకునే వ్యవసాయ పద్ధతులు, సుస్థిర వ్యవసాయంపై అవగాహన కల్పించేందుకు "ఖేత్ బచావో అభియాన్" కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యంగా ప్రస్తుతం నెలకొన్న ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రస్తుత మరియు భవిష్యత్ తరాల కోసం వ్యవసాయ భూములను సంరక్షించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. పంట అవశేషాలను కాల్చకుండా, దున్నడం ద్వారా నేలలో కలపాలని సూచించారు. దీనివల్ల నేలలో సేంద్రియ కర్బనం పెరిగి, భూసారం మెరుగుపడుతుందని వివరించారు. పచ్చిరొట్ట ఎరువుల వినియోగం, ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని సూచించారు. ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి భూసార పరీక్షలు చేయించుకుని సమతుల్య ఎరువుల యాజమాన్యాన్ని పాటించాలని సూచించారు. హార్టికల్చర్ అధికారి రైతులకు ఉద్యాన పంటల సాగు, పంటల యాజమాన్య పద్ధతులు మరియు ప్రభుత్వ పథకాల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొన్న లక్ష్మీకిష్టయ్య యాదవ్, మండల పరిషత్ అధికారి నారగోని శ్యామ్ కుమార్ గౌడ్,ఏపీఓ బొడిగే రమేష్ గౌడ్,



ఏఈఓ రాజశేఖర్,పంచాయతీ సెక్రటరీ ఆంబోజు శేఖర్,విబి జీ రామ్ జీ ఏఫ్ఏ ఎన్ రవిందర్ రెడ్డి, గ్రామ పంచాయతీ సిబ్బంది మరియు రైతులు పాల్గొన్నారు.

# రెండోసారి కొండపోచమ్మ చైర్మన్‌గా అనుగీత

**ఆలయ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం - భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తాం: చైర్మన్**



**జగదేవ్‌పూర్, అక్టోబర్ 27 ( మీడియా టుడే):**
జగదేవ్‌పూర్ మండలం తీగుల్ నర్సాపూర్‌లోని ప్రసిద్ధ కొండపోచమ్మ ఆలయ చైర్మన్‌గా అనుగీత రెండోసారి బాధ్యతలు స్వీకరించారు. మంగళవారం దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో నూతన పాలకమండలి నియామక ప్రక్రియ నిర్వహించారు. చైర్మన్‌తో పాటు నూతన డైరెక్టర్లు బాధ్యతలు చేపట్టారు. తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్ రావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు గజ్వేల్ యువజన కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు, తీగుల్ మాజీ సర్పంచ్ కప్పర భాను ప్రకాష్ రావు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో మైసయ్య గౌడ్, అర్చకులు రమేష్ నూతన చైర్మన్, పాలకమండలి సభ్యులను శాలువాలతో సత్కరించారు. అనంతరం అనుగీత అమ్మవారిని దర్శించుకుని పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**భక్తులకు మెరుగైన సేవలే లక్ష్యం**

రెండోసారి చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన అనుగీత మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో మరోసారి అవకాశం కల్పించిన ప్రభుత్వ పెద్దలకు, ప్రజాప్రతినిధులకు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఆలయానికి వచ్చే భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడంతో పాటు, ఆలయ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తానని పేర్కొన్నారు. దేవాదాయ శాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ, పాలకమండలి సభ్యుల సహకారంతో ఆలయాన్ని మరింత అభివృద్ధి చేస్తానన్నారు. భక్తులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బునారి రాజు, నాయకులు మనోజ్, చింటూ, సాయి, నితిన్, గ్రామ సర్పంచ్ సంధ్య శ్రీనివాస్, ఉపసర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు కంచర్ల స్వామి, నూతన డైరెక్టర్లు వెంకట్ రామ్ రెడ్డి, గడ్డం రాజు, కోట ఆశయ్య, కృష్ణ, శాంతమ్మ, బలమని, ఆనంద్, ఆలయ సిబ్బంది, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

# అర్నబ్ తుఫాన్‌పై అప్రమత్తంగా ఉండాలి

**- రానున్న 36 గంటలు కీలకం.. ప్రజల ప్రాణరక్షణే ప్రథమ ప్రాధాన్యత: కలెక్టర్ అంకిత్**

**భద్రాద్రి కొత్తగూడెం ,అక్టోబర్ 26(మీడియా టుడే):**
అర్నబ్ తుఫాన్ ప్రభావంతో జిల్లాలో భారీ వర్షాలు, ఈదురుగాలులు కురిసే అవకాశం ఉన్నందున అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. రానున్న 36 గంటలు కీలకమని, ప్రజల ప్రాణరక్షణకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. మంగళవారం భద్రాచలం సబ్ కలెక్టర్, ఆర్డీవోలు, తహసీల్దార్లు, వివిధ శాఖల అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించిన కలెక్టర్.. లోతట్టు ప్రాంతాలు, వరద ముప్పు ఉన్న గ్రామాలు, వాగులు, వంకలు, ప్రమాదకర కల్వర్టులు, పాత వంతెనల వద్ద నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. నీటి ప్రవాహం అధికంగా ఉన్న మార్గాల్లో బారికేడ్లు ఏర్పాటు చేసి రాకపోకలు నిలిపివేయాలని, ఇంద్రావతి, తాలిపేరు పరివాహక ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. జిల్లా, మండల స్థాయిలో కంట్రోల్ రూమ్‌లను అందుబాటులో ఉంచాలని, ఛాతకొండలో ఎస్డీఆర్ఎఫ్, భద్రాచలంలో ఎన్డీఆర్ఎఫ్ బృందాలను సహాయక చర్యలకు సిద్ధంగా ఉంచాలని తెలిపారు. విద్యుత్ సరఫరా పునరుద్ధరణ, రహదారులపై కూలిన చెట్ల తొలగింపు, అత్యవసర వైద్య సేవలకు సిబ్బంది, పరికరాలను సిద్ధం చేయాలని ఆదేశించారు. విద్యార్థులు, వసతి గృహాల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించడంతో పాటు, ప్రసవ సమయం సమీపించిన గర్భిణులను ముందుగానే ఆసుపత్రులకు తరలించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రామాల్లో దండోరా ద్వారా తుఫాన్ హెచ్చరికలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ కోరారు. పడవ ప్రయాణాలు, చేపల వేట, నదులు, వాగుల్లోకి వెళ్లడం వంటి ప్రమాదకర కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. అధికారులు హెడ్‌క్వార్టర్స్‌లో అందుబాటులో ఉంటూ ఎలాంటి అత్యవసర పరిస్థితినైనా ఎదుర్కొనేలా




సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. అత్యవసర సహాయం కోసం సంప్రదించాల్సిన నంబర్లు ఫైర్ ఆఫీసర్ క్రాంతి: 87126 99523,కొత్తగూడెం ఆర్డీవో డి. మధు: 93929 19715,భద్రాచలం సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ఠ: 93929 19716,ఐడీఓసీ కంట్రోల్ రూమ్: 93929 19743.

# అర్నబ్ తుపానుపై అప్రమత్తంగా ఉండాలి

**మండలాల్లోనే అధికారులు అందుబాటులో ఉండాలి**

**పంటల రక్షణ, సహాయక చర్యలకు సిద్ధంగా ఉండాలి-జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు.**




**ములుగు జిల్లా అక్టోబర్27(మీడియా టుడే)**
అర్నబ్ తుపాను ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశమున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు ఆదేశించారు. ప్రజలకు ముందస్తు సమాచారం అందిస్తూ ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు.
మంగళవారం జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, జిల్లా అధికారులు, మండలాల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలతో గూగుల్ మీట్ నిర్వహించి మండలాల వారీగా ముందస్తు ఏర్పాట్లపై సమీక్షించి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వాతావరణ శాఖ సూచనల ప్రకారం అక్టోబర్ 28 ఉదయం 8:30 గంటల నుంచి 29 ఉదయం 8:30 గంటల వరకు జిల్లాలో భారీ నుంచి అతిభారీ వర్షాలతోపాటు కొన్ని చోట్ల అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. గంటకు 50--60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే సూచనలున్నాయని, 30వ తేదీ ఉదయం వరకు కూడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అప్రమత్తత కొనసాగించాలని సూచించారు. రాబోయే మూడు రోజుల పాటు అధికారులు తమ ప్రధాన కార్యస్థానాల్లో అందుబాటులో ఉండాలని ఆదేశించారు. మండల ప్రత్యేక అధికారులు, మండల సంబంధిత శాఖల అధికారులు, పోలీసు అధికారులతో సమన్వయం చేసుకొని సిబ్బందికి బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేయాలన్నారు. రాత్రి వేళల్లో స్పందించేందుకు ప్రతి మండలంలో ఒక సీనియర్ అధికారిని నియమించి, వారి పేరు, ఫోన్ నంబరుతోపాటు విధుల్లో ఉండే సిబ్బంది వివరాలను జిల్లా కార్యాలయానికి పంపించాలని సూచించారు. రైతులను ముందుగానే అప్రమత్తం చేసి పంట రక్షణ చర్యలపై వ్యవసాయ శాఖ అధికారులు సూచనలు అందించాలన్నారు. వరద ముప్పున్న ప్రాంతాల్లోని గర్భిణులను గుర్తించి సురక్షిత ప్రాంతాలకు తరలించి, వారిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు, సిబ్బంది 24 గంటలూ అందుబాటులో ఉండాలన్నారు. అగ్నిమాపక, మత్స్య, నీటిపారుదల శాఖలు అప్రమత్తంగా ఉంటూ అవసరమైన ప్రాంతాల్లో పడవలు, గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచాలని సూచించారు. సహాయక చర్యల కోసం ఎన్డీఆర్ఎఫ్ బృందం ఏటూరునాగారం చేరుకుందని తెలిపారు. గోదావరికి ఎగువ నుంచి వచ్చే వరద ప్రవాహాన్ని నిరంతరం అంచనా వేయాలని ఆదేశించారు. స్థానిక వాగులు తక్కువ సమయంలోనే ఉప్పొంగే ప్రమాదమున్నందున జంపన్నవాగు, దయ్యాలవాగు, జీడివాగు, గుండ్లవాగు ప్రాంతాల్లో సిబ్బందిని నియమించి పర్యవేక్షించాలన్నారు. చెరువు కట్టలు, లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఉంచి, అవసరమైన చోట రాకపోకలను నియంత్రించాలని సూచించారు. ఈదురుగాలులకు చెట్లు, విద్యుత్ స్తంభాలు కూలే ప్రమాదమున్నందున సంబంధిత శాఖలు సిద్ధంగా ఉండాలన్నారు. విద్యుత్, తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడితే వెంటనే స్పందించాలని ఆదేశించారు. ప్రజలు ఉరుములు, మెరుపుల సమయంలో పక్కా భవనాల్లో ఆశ్రయం పొందాలని, చెట్ల కింద నిలబడవద్దని, వాగులు, వరద ప్రవాహాలను దాటవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు సిహెచ్ మహేందర్ జి, సంపత్ రావు, జిల్లా అధికారులు, మండలాల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మీడియా టుడే



# సేవా భావం విజయ్‌కుమార్ జీవిత లక్ష్యం

**మాజీ మున్సిపల్ చైర్మన్ సేవలు ఆదర్శప్రాయం**

**ఘనంగా జన్మదిన వేడుకలు - ప్రజాకవి, తత్వవేత్త డాక్టర్ నాగుల సత్యంగౌడ్ ప్రశంస**



**మీడియా టుడే న్యూస్ సైదాపూర్ ప్రతినిధి వైష్ణవ్ అక్టోబర్ 27**

హుజూరాబాద్ మాజీ మున్సిపల్ చైర్మన్ వడ్లూరి విజయ్‌కుమార్ అందించిన నిస్వార్థ సేవలు అందరికీ ఆదర్శప్రాయమని మానవ విలువల పరిరక్షణ జాతీయ అధ్యక్షులు, ప్రజాకవి, తత్వవేత్త బ్రహ్మశ్రీ డాక్టర్ నాగుల సత్యంగౌడ్ పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని అవంతి కన్వెన్షన్ హాలులో విజయ్‌కుమార్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు పట్టు శాలువా కప్పి, ఆధ్యాత్మిక కవితా జ్ఞాపిక, పూలబొకే అందజేసి సత్కరించారు. అనంతరం కేకు, మిఠాయిలు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సత్యంగౌడ్ మాట్లాడుతూ... ఆపదలో ఉన్న పేదలకు ఎల్లవేళలా చేతనైన సాయం అందిస్తూ, ప్రజాసేవనే తన జీవిత ధ్యేయంగా ఎంచుకున్న విజయ్‌కుమార్ అభినందనీయులని కొనియాడారు. మున్సిపల్ చైర్మన్‌గా తన పదవీ కాలంలో హుజూరాబాద్ పట్టణాన్ని అన్ని రంగాల్లో ప్రగతిపథంలో నడిపించి రాష్ట్రస్థాయిలో గుర్తింపు తీసుకురావడం గర్వకారణమన్నారు. నాయకులు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను సత్వరం పరిష్కరించినప్పుడే గుర్తింపు లభిస్తుందన్నారు. స్వార్థాన్ని వీడి మానవతా దృక్పథంతో మెలిగి మానవ జన్మను సార్థకం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షులు రుద్రారపు రామచంద్రం, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ ఇమ్రాన్, బండ నవీన్, బొడ్డు సంజయ్, తునికి వసంత్, నందగిరి శ్రీనివాస్, బాబురావు, వెంకటస్వామి, శాయిల రాజు, జడల సమ్మయ్య, చందు, ముకుందరెడ్డి, రాజుగౌడ్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

# పోలీసు అమరవీరులకు భైంసా పోలీసుల ఘన నివాళి

**- బైక్ ర్యాలీ భైంసాలో ర్యాలీ నిర్వహించిన ఏఎస్పీ సాయికిరణ్, పోలీసు అధికారులు**

**భైంసా అక్టోబర్ 27 మీడియా టుడే జిల్లా ప్రతినిధి**



పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని భైంసా పట్టణంలో ఏఎస్పీ సాయికిరణ్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. విధి నిర్వహణలో దేశం కోసం, ప్రజల రక్షణ కోసం ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో సీఐలు, ఎస్సైలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏఎస్పీ సాయికిరణ్ మాట్లాడుతూ.. ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణ కోసం పోలీసులు నిరంతరం విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన అమరవీరుల సేవలు, త్యాగాలు ఎప్పటికీ మరువలేనివని పేర్కొన్నారు. వారి స్ఫూర్తితో పోలీసు సిబ్బంది ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని స...

# సారపాకలో పోలీసుల కార్డన్ అండ్ సెర్చ్

**- 43 వాహనాలకు సరైన పత్రాలు లేవు.. 46 మద్యం క్వార్టర్లు స్వాధీనం**



**భద్రాచలం ,అక్టోబర్ 27(మీడియా టుడే):**

జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ ఆదేశాల మేరకు పాల్వంచ డీఎస్పీ ఆర్. సతీష్ కుమార్ ఆధ్వర్యంలో బూర్గంపహాడ్ మండలం సారపాక సుందరయ్యనగర్‌లో తెల్లవారుజామున పోలీసులు కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. డాగ్ స్క్వాడ్ బృందాలతో కలిసి అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలు, అసాంఘిక కార్యకలాపాలపై విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో సరైన ధ్రువపత్రాలు లేని 43 ద్విచక్ర వాహనాలు, ఆటోలను గుర్తించడంతో పాటు 46 మద్యం క్వార్టర్లను స్వాధీనం చేసుకున్నారు. వాహనాల పత్రాలను పరిశీలించి నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా డీఎస్పీ సతీష్ కుమార్ మాట్లాడుతూ యువత గంజాయి, ఇతర మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, వాటి అక్రమ రవాణా లేదా వినియోగంపై సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలని కోరారు. వాహనదారులు హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజలు పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఆపరేషన్‌లో పాల్వంచ సీఐ సతీష్, ఎస్ఐలు, పోలీసు, స్పెషల్ పార్టీ సిబ్బంది, డాగ్ స్క్వాడ్ బృందాలు కలిపి సుమారు 50 మంది పాల్గొన్నారు.

# పోలీస్ అమరుల స్ఫూర్తితో గజ్వేల్‌లో సైకిల్ ర్యాలీ

**- భారీగా తరలివచ్చిన విద్యార్థులు**

**- స్మార్ట్‌ఫోన్లకు దూరంగా ఉంటూ ఉన్నత లక్ష్యాలను సాధించాలి**

**విద్యార్థులకు పోలీసుల పిలుపు**




**గజ్వేల్ అక్టోబర్ 27 మీడియా టూ డే :**

పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సిద్దిపేట జిల్లా పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్, ఐపిఎస్ ఆదేశాల మేరకు మంగళవారం గజ్వేల్ పట్టణంలో పాఠశాల విద్యార్థులతో భారీ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని గజ్వేల్ ఇన్స్పెక్టర్ రవికుమార్, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ సంయుక్తంగా పర్యవేక్షించారు. ఈ సైకిల్ ర్యాలీ స్థానిక అంబేద్కర్ చౌరస్తా నుండి ప్రారంభమై, బసవేశ్వర విగ్రహం మీదుగా గజ్వేల్ పోలీస్ స్టేషన్ వరకు ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగింది. పట్టణంలోని పలు ప్రైవేట్ పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ రవికుమార్, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం, ప్రజల రక్షణ కోసం విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడమే పోలీస్ సంస్మరణ దినోత్సవ ముఖ్య ఉద్దేశమన్నారు. వారి త్యాగాలను ప్రజలకు, నేటి యువతకు తెలియజేసేందుకు ఈ సైకిల్ ర్యాలీని చేపట్టాం అని తెలిపారు. అలాగే విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, ప్రస్తుత రోజుల్లో విద్యార్థులు స్మార్ట్‌ఫోన్ల వినియోగానికి దూరంగా ఉంటూ, తమ అమూల్యమైన సమయాన్ని చదువుపై కేటాయించి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు, సిబ్బంది, పాఠశాలల ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు ప్రత్యేక శిబిరం

**- హెచ్‌ఎంటీ నగర్‌లో సాయిజెన్ ఆధ్వర్యంలో క్యాంపు**




**మీడియా టుడే, ఉప్పల్, అక్టోబర్ 27**

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు కోసం హెచ్‌ఎంటీ నగర్ డివిజన్‌లోని హెచ్‌ఎంటీ కమాన్ పక్కన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సాయిజెన్ ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేశారు. పట్టభద్రులు ఓటర్లుగా నమోదు చేసుకునేందుకు ఈ శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మేకల ముత్యం రెడ్డి, యాదగిరి రెడ్డి, బాల్‌రెడ్డి, వేముల మారయ్య, మక్బూల్ భాయ్, కట్టబుచ్చన్న గౌడ్, వీరాంజనేయులు, చంద్రశేఖర్, కోటి, సంతోష్, శ్రీనివాస్ యాదవ్, వాసు తదితరులు పాల్గొన్నారు.

# ఓటమిని స్ఫూర్తిగా తీసుకొని విజయంవైపు సాగాలి

**క్రీడాస్ఫూర్తితో రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలి**

**జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు**



**ములుగు జిల్లా అక్టోబర్27(మీడియా టుడే)**

క్రీడల్లో గెలుపోటములు సహజమని, ఓటమిని స్ఫూర్తిగా తీసుకొని విజయంవైపు సాగాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు విద్యార్థులకు సూచించారు. మంగళ వారం ములుగు జిల్లా జాకరం గురుకుల పాఠశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి పీఎం శ్రీ క్రీడా పోటీలకు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా పోటీల్లో పాల్గొంటున్న విద్యార్థినీ విద్యార్థులను పరిచయం చేసుకున్నారు. అనంతరం టాస్ వేసి ఆటలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓడిపోయినంత మాత్రాన బాధపడాల్సిన అవసరం లేదని, లోపాలను సరిదిద్దుకొని మరింత పట్టుదలతో సాధన చేయాలని అన్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. తమకు ఆసక్తి ఉన్న క్రీడల్లో నైపుణ్యాలను మెరుగుపరుచుకొని రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ చాటాలని ఆకాంక్షించారు. క్రీడలు శారీరక దృఢత్వంతోపాటు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. విద్యార్థుల్లోని క్రీడా ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులకు సూచించారు. జిల్లాలోని 11 పీఎం శ్రీ పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. అండర్--14, అండర్--17 బాలబాలికలకు వాలీబాల్, ఖోఖో, కబడ్డీతోపాటు 100, 200, 400 మీటర్ల పరుగు, లాంగ్‌జంప్, హైజంప్, షాట్‌పుట్, డిస్కస్ త్రో విభాగాల్లో పోటీలు నిర్వహించారు. జాకరం పాఠశాల ఓవరాల్ ఛాంపియన్‌గా నిలిచింది. విజేతలకు స్వర్ణ, రజత, కాంస్య పతకాలు, ట్రోఫీలు అందజేశారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఎ. సిద్ధార్థ రెడ్డి మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల్లో జట్టు స్ఫూర్తిని పెంపొందిస్తాయని, వారి సమగ్ర వికాసానికి దోహదపడతాయని అన్నారు. జాకరం పాఠశాల ప్రధానాచార్యులు డాక్టర్ ఎ. వెంకటేశ్వర్లు విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ఐ ములుగు జిల్లా కార్యదర్శి వి. జగదీష్, జిల్లా పీఈటీఏ అధ్యక్షులు గుండెబోయిన మల్లయ్య, కార్యదర్శి బటూరి వేణు, జాకరం పీడీ వెంకట్‌రెడ్డి, పీఈటీలు చంద్రకళ, నాగేందర్, రాజు, దీప్తి, కవిత, లక్ష్మీనారాయణ, అవినాష్, పద్మశ్రీ సుహాసి, కృష్ణ శరత్‌రెడ్డి, పీఎం శ్రీ పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# కేతకి ఆలయ డైరెక్టర్ వీరిశెట్టికి ఘన సన్మానం

**నారాయణఖేడ్ ప్రాంత భక్తులకు ఇబ్బందులు లేకుండా దర్శనం కల్పించాలి**



**నారాయణఖేడ్:** ఇటీవల కేతకి సంగమేశ్వర ఆలయ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన బీఎస్ వీరిశెట్టిని చప్టా ఉప సర్పంచ్ బస్వరాజ్, మాజీ సర్పంచ్ గంగయ్య స్వామి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నారాయణఖేడ్ ప్రాంతానికి చెందిన వీరిశెట్టి కేతకి సంగమేశ్వర ఆలయ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టడం ఆనందంగా ఉందన్నారు. ఆలయానికి వచ్చే నారాయణఖేడ్ ప్రాంత భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సౌకర్యవంతంగా దర్శనం కల్పించాలని కోరారు. అదేవిధంగా ఆలయ అభివృద్ధికి ప్రత్యేక చొరవ తీసుకొని, భక్తులకు మెరుగైన సౌకర్యాలు అందేలా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సాయి, రాజప్ప, సంగమేష్ తదితరులు పాల్గొన్నారు.

# చెత్తను కాల్చితే చర్యలు తప్పవు

**మున్సిపల్ శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ హెచ్చరిక**

**దుకాణాల యాజమాన్యాలకు జరిమానాలు**



**నారాయణఖేడ్, అక్టోబర్ 27**

పట్టణంలో బహిరంగ ప్రదేశాల్లో చెత్తను కాల్చితే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు జరిమానాలు విధిస్తామని నారాయణఖేడ్ మున్సిపల్ శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ హెచ్చరించారు. మంగళవారం మున్సిపల్ కమిషనర్ ప్రశాంతి ఆదేశాల మేరకు పట్టణంలో చెత్తను కాల్చిన దుకాణాల యాజమాన్యాలపై మున్సిపల్ అధికారులు జరిమానాలు విధించినట్లు ఆయన తెలిపారు. చెత్తను కాల్చడం వల్ల పర్యావరణ కాలుష్యంతో పాటు ప్రజల ఆరోగ్యానికి హాని కలుగుతుందని పేర్కొన్నారు. దుకాణాల యజమానులు, వ్యాపారులు చెత్తను ఎట్టి పరిస్థితుల్లోనూ కాల్చవద్దని, మున్సిపల్ పారిశుద్ధ్య వాహనాలకు అందజేయాలని సూచించారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, మున్సిపాలిటీ చేపడుతున్న పారిశుద్ధ్య కార్యక్రమాలకు పట్టణ ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# మృతుని కుటుంబానికి 5వేలు ఆర్థిక సహాయం అందచేసిన సర్పంచ్

**ఆలేరు ఆర్సీ, అక్టోబరు27/మీడియా టుడే:**



యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం ఉప్పలపహాడ్ గ్రామంలో మృతుని కుటుంబానికి ఆలేరు శాసనసభ్యులు ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య స్ఫూర్తితో సర్పంచ్ చిన్నం బీరప్ప మృతుని కుటుంబానికి 5000/-వేల రూపాయల ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మరియాల స్వరాజ్యలక్ష్మి, వార్డు సభ్యులు గ్రామ శాఖ అధ్యక్షులు ఆకుల బిక్షపతి, మాజీ ఎంపీటీసీ మరియాల వెంకటేశ్వర్లు గుప్తా, కాంగ్రెస్ పార్టీ నాయకులు లోడే యాదయ్య, తీగల అశోకు, సోషల్ మీడియా కన్వీనర్ లోడే భానుచందర్, నాయకులు సాయిరెడ్డి మల్లారెడ్డి, లోడె శ్రీకాంత్, రాగటి లింగయ్య, కడకంచి మల్లయ్య, కడకంచి యాదయ్య, జట్ట యాదయ్య, కడకంచి ఆంజనేయులు, బుజ్జోజి వేణు కుమార్, గ్రామస్తులు పాల్గొని కడకంచి యాదయ్య పార్థివ దేహంపై కాంగ్రెస్ పార్టీ జండా కప్పి ఘనంగా నివాళులు అర్పించారు. మృతుని కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపినారు.

# చైతన్య గౌడ్ జన్మదినం సందర్భంగా పండ్ల పంపిణీ

**- చిలుకానగర్ చౌరస్తాలో కాంగ్రెస్ నాయకుల సేవా కార్యక్రమం**



**మీడియా టుడే, ఉప్పల్, అక్టోబర్ 27:**

ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బొమ్మగోని చైతన్య గౌడ్ జన్మదినం సందర్భంగా చిలుకానగర్ చౌరస్తాలోని వివేకానంద విగ్రహం వద్ద కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైతన్య గౌడ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయన ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో మరిన్ని పుట్టినరోజులు జరుపుకోవాలని, దైవ ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మైనారిటీ అధ్యక్షుడు మాము, సోషల్ మీడియా ప్రతినిధి బియ్యం కిరణ్, సీనియర్ నాయకులు జాంగిర్, జంజీరాల శరత్ బాబు, ప్రవీణ్, ఆకుల సురేష్, దేవరకొండ ప్రభు, అమ్జద్ పాషా, ఆసిఫ్ తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ మాల మహానాడు 20 వసంతాల ఆవిర్భావ దినోత్సవం

**మీడియా టుడే వలిగొండ అక్టోబర్ : 27**



యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో జాతీయ మాల మహానాడు 20 వసంతాల ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మాల మహానాడు జిల్లా అధ్యక్షులు పెరుమాండ్ల యాదగిరి ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. అనంతరం మాట్లాడుతూ సామాజిక న్యాయం, సమానత్వం, ఆత్మగౌరవం, హక్కుల సాధన కోసం సాగుతున్న జాతీయ మాల మహానాడు ప్రస్థానం 20 వసంతాలు పూర్తిచేసుకున్న సందర్భంగా నాయకులకు, కార్యకర్తలకు, మాలసోదరసోదరీమణులందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూడాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాల స్ఫూర్తితో విద్య, ఐక్యత, సంఘటితపోరాటం ద్వారాసమాజం లోసమానత్వాన్ని సాధించడమే మన లక్ష్యం కావాలి. 20వసంతాల ప్రస్థానంఎన్నో పోరాటాలకు స్ఫూర్తి!మన హక్కుల కోసం ఐక్యంగా అడుగులు వేద్దాం. మనఆత్మగౌరవాన్ని కాపాడుకుందాం. అంబేద్కర్ ఆశయాల సాధన కోసం ముందుకు సాగుదాం రాబోయే అసెంబ్లీ ఎలక్షన్ లో మాలల సత్తా ఏందో చూపియాలని తెలంగాణ మాలలకు జరుగుతున్న రోస్టర్ పాయింట్లో జరుగుతున్న అన్యాయం గురించి ప్రభుత్వానికి వివరంగా చెప్పి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు ఈ కార్యక్రమంలో మాల మహానాడు మండల అధ్యక్షులు కూచిమల్ల నాగేష్ మాల ఉపాధ్యక్షులు బుంగ శేఖర్ మాల సీనియర్ నాయకులు భూతం మల్లేశం రిటైర్డ్ ఉద్యోగి మాల రాపోలు పవన్ కుమార్ నీలం నరేందర్ దాసిరెడ్డిగూడెం గ్రామ సర్పంచ్ రాపోలు గోపి మాల మండల నాయకులు కట్ట దానయ్య గూడపూరి రాజు కేతం ఇంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

# పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు వేగవంతంపై దృష్టి సారించిన డా. బానోతు చంద్రావతి

**మీడియా టుడే ఖమ్మం ప్రతినిధి :**



వైరాలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని మాజీ ఎమ్మెల్యే డా. బానోతు చంద్రావతి సందర్శించి, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమం పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కట్టా కృష్ణార్జునరావు తో ఓటరు నమోదు ప్రక్రియను మరింత వేగవంతం చేయడం, అర్హులైన యువ పట్టభద్రులను నమోదు చేసుకునేలా ప్రోత్సహించడం, క్షేత్రస్థాయిలో నమోదు కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించడం వంటి అంశాలపై ప్రత్యేకంగా చర్చించారు. అర్హులైన ప్రతి పట్టభద్రుడికి ఓటరు నమోదుపై అవగాహన కల్పించి, నమోదు ప్రక్రియలో ఎదురయ్యే ఇబ్బందులను పరిష్కరించేలా సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎద్దునూరి శ్రీను, మద్దెల రవి, బానోతు సక్కుబాయి తదితరులు పాల్గొన్నారు.

# ఆర్నబ్ తుఫాన్‌తో అప్రమత్తంగా ఉండాలి

**నడిగూడెం, అక్టోబర్27 . మీడియా టుడే:**

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావము తెలంగాణ రాష్ట్రంపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉంది దీన్ని దృష్టిలో పెట్టుకొని మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూర్యాపేట జిల్లా కలెక్టర్ శ్రీయుత తేజస్ నందలాల్ పవర్ కోరారు గంటకు 50-60 కి.మీ వేగంతో ఈదురు గాలులు మరియు, భారీ నుండి అతి భారీ వర్షాలు 27వ తారీకు రాత్రి నుండి ఉండవచ్చును అని తెలిపరచినారు. కావున నడిగూడెం మండలంలోని సమస్త ప్రజలు తమ ఇండ్లలోనే ఉండవలసినదిగా కోరుతూ, అదే విధంగా కాలువలు, చెరువులు, కుంటలు, శిధిలమైన గుడిసెలలోకి వెళ్లకుండా సురక్షిత ప్రదేశంలో ఉండవలసినదిగా ముఖ్యంగా వరి పండించే వ్యవసాయదారులు ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు చేర్చుకోవాల్సిందిగా కోరడమైనది

# అర్హులైన పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలి

**గణపురం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తాళ్లపల్లి భాస్కర్‌రావు**




**భూపాలపల్లి /గణపురం మీడియా టుడే అక్టోబర్ 27**

అర్హులైన పట్టభద్రులందరూ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరుగా నమోదు చేసుకోవాలని గణపురం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తాళ్లపల్లి భాస్కర్‌రావు పిలుపునిచ్చారు. 2023 వరకు డిగ్రీ పూర్తి చేసిన అర్హులైన పట్టభద్రులు తప్పనిసరిగా ఓటు నమోదు చేసుకోవాలని సూచించారు. గణపురం మండలం గాంధీనగర్ గ్రామంలో పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అర్హులైన పట్టభద్రులు ఫారం-18 ద్వారా తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని కాంగ్రెస్ నాయకులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు వెంపటి భువన సుందర్, భూపాలపల్లి జిల్లా డీసీసీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ అప్పాల శ్రీనివాస్, గ్రామ శాఖ అధ్యక్షుడు పోతరాజు సురేష్, గాంధీనగర్ సర్పంచ్ ఇంజపల్లి శ్రీనివాస్, గాంధీనగర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు సామల తిరుపతిరెడ్డి, కర్కపల్లి గ్రామ శాఖ అధ్యక్షుడు పోట్ల కిష్టయ్య, లక్ష్మారెడ్డిపల్లి సర్పంచ్ విరమల్ల సంపత్‌రెడ్డి, లక్ష్మారెడ్డిపల్లి గ్రామ శాఖ అధ్యక్షుడు కాంతాల సమ్మిరెడ్డి, కర్కపల్లి సర్పంచ్ అంబాల లక్ష్మీ-సాంబయ్య, కర్కపల్లి ఉపసర్పంచ్ తూర్పునూరి రమేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు సామిని నాగేశ్వరరావు, మండల బీసీ సెల్ అధ్యక్షుడు మేడిపల్లి రాజు, మొగిలి ఓదెలు, యూత్ నాయకుడు పొన్నం ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల నిరవధిక సమ్మెకు బీఎస్పీ సంఘీభావం

**ఉద్యోగుల డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి**

**బీఎస్పీ జిల్లా అధ్యక్షులు పుల్లూరు ఉమేష్**



**గజ్వేల్ అక్టోబర్ 27 మీడియా టూ డే**

గత 15 రోజులుగా సిద్దిపేట జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట నిరవధిక సమ్మె చేస్తున్న నేషనల్ హెల్త్ మిషన్ ( ఎన్ హెచ్ ఎం)ఉద్యోగులకు బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) సిద్దిపేట జిల్లా కమిటీ సంఘీభావం తెలిపింది. జిల్లాలోని 78 విభాగాలకు చెందిన సుమారు 500 మంది ఉద్యోగులు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం సమ్మె చేస్తున్న నేపథ్యంలో బీఎస్పీ నాయకులు నేడు సమ్మె శిబిరాన్ని సందర్శించి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా బీఎస్పీ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు పుల్లూరు ఉమేష్ మాట్లాడుతూ ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల ప్రధాన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల పాత్ర ఎంతో కీలకమన్నారు. 15 రోజులుగా ఉద్యోగులు సమ్మె చేస్తున్నప్పటికీ వారి సమస్యలకు పరిష్కారం చూపకపోవడంవిచారకరమన్నారు. ఉద్యోగుల న్యాయమైన పోరాటానికి బీఎస్పీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండనోళ్ల నరేష్, గజ్వేల్ అసెంబ్లీ ఇన్‌చార్జి కేతుజు వినోద్ చారి, అసెంబ్లీ అధ్యక్షులు కొమ్ము చంద్రం, సిద్దిపేట అసెంబ్లీ ఇన్‌చార్జి కిరణ్, గజ్వేల్ అసెంబ్లీ ఉపాధ్యక్షులు శ్రీకాంత్, తూప్రాన్ మండల అధ్యక్షులు నరేష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర రాజకీయ కమిటీ వైస్ చైర్మన్‌గా దాచేపల్లి శ్రీనివాసులు

**నియామక పత్రం అందజేసిన రాష్ట్ర అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ**

**ఆర్యవైశ్యులను రాజకీయంగా చైతన్యవంతులను చేస్తా: శ్రీనివాసులు**



**మీడియా టుడే కల్వకుర్తి నియోజకవర్గ ప్రతినిధి అక్టోబర్ 27**

తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర రాజకీయ కమిటీ వైస్ చైర్మన్‌గా నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణానికి చెందిన దాచేపల్లి శ్రీనివాసులు నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ ఆయనకు నియామక పత్రాన్ని అందజేసి, శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా దాచేపల్లి శ్రీనివాసులు మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర రాజకీయ కమిటీ వైస్ చైర్మన్‌గా బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణకు కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ ఆర్యవైశ్యులందరినీ రాజకీయంగా చైతన్యవంతులను చేసేందుకు కృషి చేస్తానన్నారు. ఆర్యవైశ్యులంతా ఐక్యంగా ముందుకు సాగేందుకు, సమాజాన్ని ఏకతాటిపైకి తీసుకువచ్చేందుకు తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. శ్రీనివాసులు రాష్ట్ర రాజకీయ కమిటీ వైస్ చైర్మన్‌గా నియమితులవడంపై కల్వకుర్తి పట్టణ ఆర్యవైశ్య సంఘం నాయకులు, సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గంధం కిరణ్ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి గంప శ్రీనివాసులు, యువజన నాయకులు ఆకారపు శివకుమార్, పోల నరేష్, కూన సంతోష్‌తో పాటు ఆర్యవైశ్య సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# మొగుళ్లపల్లి అభివృద్ధికి రూ.2 కోట్లతో పనులు

**గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట**

**శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు**



**భూపాలపల్లి/మొగుళ్లపల్లి, మీడియా టుడే అక్టోబర్ 27**

మొగుళ్లపల్లి మండల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో సుమారు రూ.2 కోట్ల నిధులతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు. కొరికిశాలలో గ్రామపంచాయతీ భవనం, బద్దంపల్లిలో గ్రామపంచాయతీ, అంగన్వాడీ భవనాల నిర్మాణ పనులను ప్రారంభించారు. ఇప్పలపల్లి, పర్లపల్లి, మొగుళ్లపల్లి మండల కేంద్రంలో మహిళా సమైక్య భవనాల నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. పెద్దకోమటిపల్లిలో గ్రామపంచాయతీ, అంగన్వాడీ భవనాలు, అంకుశాపూర్‌లో మహిళా సమైక్య, అంగన్వాడీ భవనాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. మేదరమెట్లలో గ్రామపంచాయతీ, మహిళా సమైక్య భవనాలు, ఇసిపేటలో అంగన్వాడీ భవన నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. గ్రామపంచాయతీ, అంగన్వాడీ, మహిళా సమైక్య భవనాల నిర్మాణంతో ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత చేరువ అవుతాయని తెలిపారు. మంజూరైన పనులను నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాంసాగర్ సర్పంచ్‌ను పరామర్శించిన ఎమ్మెల్యే కవ్వంపల్లి

**కరీంనగర్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ : మీడియా టుడే , అక్టోబర్ 27 :**



బెజ్జంకి మండలం రాంసాగర్ గ్రామ సర్పంచ్ ఇంగాల లక్ష్మి భర్త నాగమల్లేశం ఇటీవల గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. విషయం తెలుసుకున్న మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మంగళవారం పార్టీ నాయకులతో కలిసి లక్ష్మి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా నాగమల్లేశం మృతిపై ఎమ్మెల్యే తీవ్ర విచారం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ఈ కష్ట సమయంలో వారికి ధైర్యంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు లింగాల శ్రీనివాస్, బెజ్జంకి పీఏసీఎస్ చైర్మన్ ఒగ్గు దామోదర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మాతంగి శిరీష అనిల్, మాజీ చైర్మన్ పులి కృష్ణ, పర్ష సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# గవర్నర్ కోటా ఎమ్మెల్సీల్లో బీసీలకు అవకాశం ఇవ్వాలి: రాజేందర్ పటేల్ గౌడ్

**మీడియా టుడే న్యూస్ సైదాపూర్ ప్రతినిధి వైష్ణవ్ అక్టోబర్ 27**



హైదరాబాద్, గవర్నర్ కోటాలో నవంబర్ నెలలో భర్తీ చేయనున్న నామినేటెడ్ ఎమ్మెల్సీ పదవుల్లో ఇద్దరు బీసీలకు అవకాశం కల్పించాలని జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్ పటేల్ గౌడ్ కాంగ్రెస్ పార్టీ అధిష్టాన వర్గానికివిజ్ఞప్తిచేశారు. మంగళవారం కాచిగూడ లోని మహాసభ కార్యాలయంలో ఆయన బీసీ నేతలతో కలిసి మాట్లాడుతూ... జనాభాలో సగానికిపైగా ఉన్న బీసీలకు రాజకీయ పదవులు, నిర్ణయాధికారాల్లో తగిన ప్రాతినిధ్యం దక్కడం లేదని ఆవేదనవ్యక్తంచేశారు. ఎన్నికల సమయంలో బీసీలు కేవలం ఓటర్లుగానే మిగిలిపోతున్నారని, ఎమ్మెల్యే టికెట్ల కేటాయింపులోనూ ఆర్థిక స్తోమత లేదనే కారణాలతో అవకాశాలు నిరాకరిస్తున్నారని విమర్శించారు. బీసీలకు తగిన రాజకీయ ప్రాతినిధ్యం కల్పించకుండా సామాజిక న్యాయం సాధ్యం కాదని స్పష్టం చేశారు. అర్హత, సామాజిక సేవ, పార్టీ పట్ల నిబద్ధత కలిగిన బీసీ నాయకులకు గవర్నర్ కోటా ఎమ్మెల్సీ పదవుల్లో అవకాశం కల్పించి ఆదుకోవాలని ఆయన సీఎం రేవంత్ రెడ్డి కి విజ్ఞప్తి చేశారు.

# రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారిని పరామర్శించిన నిషీధర్ రెడ్డి

**భూపాలపల్లి / రేగొండ మీడియా టుడే అక్టోబర్ 27**



సోమవారం రేగొండ మండల కేంద్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన హరికిషోర్, అఖిల్‌లు ప్రస్తుతం హనుమకొండలోని గార్డెన్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసు కున్న బీజేపీ జిల్లా అధ్యక్షులు ఏడునూతుల నిషీధర్ రెడ్డి గార్డెన్ హాస్పిటల్‌కు వెళ్లి హరికిషోర్, అఖిల్‌లను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించి, త్వరగా కోలుకునేలా అవసరమైన చికిత్స అందించాలని వైద్యులను కోరారు.

## పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా సైకిల్ ర్యాలీ

**పిట్టల క్రాంతి కుమార్ మీడియా టుడే సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం**



హుస్నాబాద్ పట్టణంలో పోలీస్ అమర వీరుల సంస్మరణ వారోత్స వాల్లో భాగంగా ఈరోజు ఉదయం 11:30 గంటలకు హుస్నాబాద్ ఏసీపీ కార్యాలయం నుండి అంబేద్కర్ విగ్రహం వరకు సైకిల్ ర్యాలీ నిర్వహించ బడింది. ఈ కార్యక్రమంలో ఏసీపీ సదానందం, సీఐ శ్రీధర్ , హుస్నాబాద్ ఎస్ఐ లక్ష్మా రెడ్డి, అక్కన్నపేట ఎస్ఐ ప్రశాంత్, ప్రభుత్వ బాలుర పాఠశాల హెచ్‌ఎం, ౹ా జ్, విద్యార్థులు మరియు సెయింట్ జోసెఫ్ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏసీపీ సదానందం మాట్లాడుతూ, పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ, విధి నిర్వహణలో వారు చేసిన సేవలను గుర్తుచేశారు. విద్యార్థుల్లో దేశభక్తి, సామాజిక బాధ్యత మరియు పోలీసుల సేవల పట్ల అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు.

# కుప్రియాల్ గ్రామానికి రూ.2.63 కోట్లతో విద్యుత్ సబ్‌స్టేషన్

**మంత్రి సీతక్క, ఎమ్మెల్యే మదన్ మోహన్ చేతుల మీదుగా భూమిపూజ**

**ఎల్లారెడ్డికి 7 సబ్‌స్టేషన్లు మంజూరు చేయించడంలో ఎమ్మెల్యే మదన్ మోహన్ కృషి అభినందనీయం: మంత్రి సీతక్క**

**నియోజకవర్గ అభివృద్ధికి నిధుల కొరత లేకుండా చూస్తాం: మంత్రి సీతక్కలి**

**కుప్రియాల్ గ్రామ ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాం: ఎమ్మెల్యే మదన్ మోహన్‌లి**

**సదాశివనగర్ మండలం, కుప్రియాల్**



**మీడియా టుడే న్యూస్ సైదాపూర్ ప్రతినిధి వైష్ణవ్ అక్టోబర్ 27**

సదాశివనగర్, మండలంలోని కుప్రియాల్ గ్రామంలో రూ. 2.63 కోట్ల నిధులతో మంజూరైన నూతన విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి రాష్ట్ర మంత్రి సీతక్క, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ భూమిపూజ చేశారు. ముందుగా సబ్‌స్టేషన్ నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని పరిశీలించి, సంబంధిత అధికారులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి సీతక్కమాట్లాడుతూ, ఎల్లారెడ్డి నియోజకవర్గానికి ఏకంగా ఏడు విద్యుత్ సబ్‌స్టేషన్లు మంజూరు చేయించడంలో ఎమ్మెల్యే మదన్ మోహన్ చేసినకృషి అభినందనీయమన్నారు. నియోజకవర్గ ప్రజల అవసరాలను గుర్తించి, వాటి పరిష్కారం కోసం ఎమ్మెల్యే నిరంతరం కృషి చేస్తున్నారని ప్రశంసించారు. ఎల్లారెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని తెలిపారు. ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేసేందుకు సిద్ధంగా ఉన్నారని, జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా తాను కూడా ఎల్లారెడ్డి అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. ముఖ్యంగా మహిళల సంక్షేమం, ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ. 500కే గ్యాస్ సిలిండర్, ఇందిరమ్మ ఇండ్లు, మహిళా సంఘాలకు ప్రోత్సాహం వంటి పథకాల ద్వారా మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అనంతరం ఎమ్మెల్యే మదన్ మోహన్ మాట్లాడుతూ, కుప్రియాల్ గ్రామంలో విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలనేది గ్రామ ప్రజల ఎన్నో ఏళ్ల డిమాండ్ అని తెలిపారు. గ్రామ ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు రూ. 2.63 కోట్ల నిధులు మంజూరు చేయించి, నేడు మంత్రి సీతక్క చేతుల మీదుగా భూమిపూజ నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ సబ్‌స్టేషన్ నిర్మాణంతో కుప్రియాల్ గ్రామంతో పాటు పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా మరింత మెరుగుపడుతుందని, ముఖ్యంగా రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. కుప్రియాల్ గ్రామ అభివృద్ధికి మరిన్ని నిధులు తీసుకువస్తామని, గ్రామంలో అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామని, ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి సహకరిస్తున్న ముఖ్యమంత్రి కి, ఉప ముఖ్యమంత్రి కి, మంత్రి సీతక్క కి ఎమ్మెల్యే మదన్ మోహన్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, విద్యుత్ శాఖ అధికారులు, వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు, గ్రామ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, వివిధ హోదాల్లో ఉన్న నాయకులు, ప్రజాప్రతినిధులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, మహిళా కాంగ్రెస్ నాయకురాళ్లు, పార్టీ కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# కరువు కోరల్లో రైతాంగం.. ఆదుకోవాలి!

**యాసంగి పంటలకు సబ్సిడీపై విత్తనాలు అందించాలి**

**ఎండిన పంటలను పరిశీలించి ఎకరాకు రూ.40 వేల పరిహారం ఇవ్వాలి**

**సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు టి. సాగర్ డిమాండ్**



**మీడియా టుడే కల్వకుర్తి నియోజకవర్గ ప్రతినిధి అక్టోబర్ 27**

ఎల్‌నినో ప్రభావంతో కరువు పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో నష్టపోతున్న రైతాంగాన్ని ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు టి. సాగర్ డిమాండ్ చేశారు. యాసంగి సాగుకు రైతులు వేసుకునే పంటలకు సబ్సిడీపై విత్తనాలు అందించడంతోపాటు ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రణాళికలు రూపొందించాలని కోరారు. మంగళవారం నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలో ఎల్. దేశీయ నాయక్ అధ్యక్షతన నిర్వహించిన సీపీఎం జిల్లా విస్తృత స్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా టి. సాగర్ మాట్లాడుతూ.. వాతావరణ శాఖ నిపుణులు ఎల్‌నినో ప్రభావం వ్యవసాయ రంగంతోపాటు ఇతర రంగాలపైనా తీవ్రంగా ఉంటుందని చెబుతున్నప్పటికీ ప్రభుత్వం ముందస్తు ప్రణాళికలు రూపొందించడంలో నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. రైతులు యాసంగి పంటలు వేయొద్దని ప్రచారం చేయడం కంటే, ప్రత్యామ్నాయ పంటల సాగుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించి రైతులకు అండగా నిలవాలని సూచించారు. ఇప్పటికే ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలు సకాలంలో వర్షాలు కురవక, భూగర్భ జలాలు అడుగంటడంతో ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కరువు పరిస్థితులపై వ్యవసాయ శాస్త్రవేత్తలు, నిపుణులు, రైతు సంఘాలు, రాజకీయ పార్టీల నాయకులతో అఖిలపక్ష సమావేశం నిర్వహించి సమగ్ర కార్యాచరణ రూపొందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరించకుండా రైతుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు.

**రైతులు, కూలీలకు ఆర్థిక భరోసా కల్పించాలి**

వ్యవసాయ రంగంపై రైతులు, వ్యవసాయ కూలీలు, వ్యవసాయ ఆధారిత ఉత్పత్తి రంగాల్లో పనిచేసే కార్మికులు ఆధారపడి కుటుంబాలను పోషించుకుంటున్నారని సాగర్ పేర్కొన్నారు. ఒకవైపు నిత్యావసర వస్తువుల ధరలు రోజురోజుకూ పెరుగుతుండగా, మరోవైపు పంటల సాగు కోసం వేలాది రూపాయలు ఖర్చు చేసిన రైతులు నష్టాలపాలవుతున్నారని అన్నారు. ఉపాధి అవకాశాలు లేక నిరుద్యోగ యువత కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోందని తెలిపారు. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించి, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.

# సత్తుపల్లి నియోజకవర్గం ఎన్‌సిసి ముఖ్య నాయకుల సమావేశం

**ముఖ్య అతిథిగా క్రిస్టియన్ మున్సిపల్ కోఆప్షన్ కౌన్సిలర్ బేతంపూడి దేవమణి వరప్రసాద్**

**ఎన్ సి సి జాతీయ అధ్యక్షులు అలవాల కరుణాకర్**

**మీడియా టుడే/ సత్తుపల్లి – అక్టోబర్ 27**

సత్తుపల్లి పట్టణం ద్వారకాపురీ కాలనీ ప్రార్థన మందిరంలో స్థానిక దైవ సేవకులు ఎన్ సి సి జిల్లా ప్రేయర్ వింగ్ ప్రధాన కార్యదర్శి బేతంపూడి వరప్రసాద్ అధ్యక్షతన ఎన్ సి సి ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరైన క్రిస్టియన్ మునిసిపల్ కోఆప్షన్ కౌన్సిలర్ బేతంపూడి దేవమని వరప్రసాద్ మాట్లాడారు. వారు మాట్లాడుతూ గత 30 సంవత్సరముల నుండి సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలో క్రైస్తవ సమాజం కొరకు ఎంతో కష్టపడి పనిచేస్తున్న నాయకుడు, జాతీయస్థాయిలో ఎన్ ఎన్ సి సి ని స్థాపించి దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలలో క్రైస్తవ సమాజం కొరకు శ్రమించిన గొప్ప నాయకులు అలవాల కరుణాకర్ అని కొనియాడారు. సత్తుపల్లి పట్టణంలో క్రైస్తవ సమాజం కొరకు ఐదు ఎకరాల సమాధుల స్థలమును సంపాదించారు. అంతేకాక



రెండు కోట్ల రూపాయలతో క్రిస్టియన్ భవన్ నిర్మాణం జరగటానికి ఎంతగానో కృషి చేశారు. అంతేకాదు సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలో సేవకుడు ఎలాంటి ఇబ్బంది ఎదుర్కొన్న నేనున్నాను అంటూ వారి అవసరతలలో సహాయం చేస్తున్న నాయకుడు అలవాల కరుణాకర్. ఈనాడు సత్తుపల్లి పట్టణంలో క్రైస్తవుల పట్ల ఒక గౌరవం , ప్రత్యేకత ఉన్నది అంటే అది కేవలం కరుణాకర్ వల్లే జరిగింది. ఎంత అభివృద్ధి క్రైస్తవుల కొరకు చేశారు అంటే అది కేవలం కరుణాకర్ సృష్టి. అలాంటిది కొందరు ఎన్ సి సి నాయకులకు ఫోన్ చేసి కొంత ఆందోళన కలుగజేస్తున్నారు. అలాంటి వారికి ఈ మీటింగ్ ద్వారా ఒకటే తెలియజేస్తున్నాను ఎవరైనా కరుణాకర్ ని తొలగించాలని, ఇబ్బందులు పెట్టాలని ప్రయత్నిస్తే చూస్తూ ఊరుకునే ప్రసక్తే ఉండదు జాగ్రత్త. మరొక్కసారి ఎన్ సి సి నాయకులకు ఫోన్ చేసి ఇబ్బంది పెడితే పరిణామాలు వేరుగా ఉంటాయి అని హెచ్చరించారు. దీనిలో ఎవరికి ఎలాంటి హక్కు ,అధికారం లేదన్నారు. ఈ కార్యక్రమంలో పింగిలి సామ్యూల్, ఎన్ యాకోబు, పి రవికిరణ్, ఆర్ ప్రభాకర్, రాబర్ట్ నోబెల్, బూరుగు ఇస్సాక్, హెచ్ యేసుపదం, వేణు పాల్ పాల్గొన్నారు.

# ఖేలో ఇండియా యూత్ గేమ్స్ జాతీయ స్థాయి క్రీడా పోటీలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

**క్రీడా వేదికను పరిశీలించి, అధికారులతో సమీక్షించిన కలెక్టర్ ఇలా త్రిపాఠి**



**నిజామాబాదు అక్టోబర్ 27 (మీడియా టుడే ప్రతినిధి):**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో ఖేలో ఇండియా యూత్ గేమ్స్ 2026-27 కార్యక్రమంలో భాగంగా డిసెంబర్ నెలలో జాతీయ స్థాయిలో నిర్వహించనున్న క్రీడా పోటీలకు సంబంధించి నిజామాబాద్ జిల్లాలో ఎంపిక చేసిన క్రీడా వేదికను కలెక్టర్ ఇలా త్రిపాఠి మంగళవారం పరిశీలించారు. జాతీయ స్థాయిలో మొత్తం 20 క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించనుండగా, టేబుల్ టెన్నిస్ పోటీల నిర్వహణకు నిజామాబాద్ జిల్లాను ప్రభుత్వం ఎంపిక చేసింది. ఈ నేపథ్యంలో కలెక్టర్ మాక్లూర్ మండలం దాస్‌నగర్ సమీపంలోని నవ్య భారతి గ్లోబల్ స్కూల్‌ను సందర్శించి, టేబుల్ టెన్నిస్ పోటీల నిర్వహణకు అవసరమైన మౌలిక సదుపాయాలు, క్రీడా వేదిక, ఇతర వసతులను పరిశీలించారు. అనంతరం సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి, చేపట్టాల్సిన ఏర్పాట్లపై సూచనలు చేశారు. దేశవ్యాప్తంగా సుమారు 150 మంది టేబుల్ టెన్నిస్ క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొనేందుకు జిల్లాకు రానున్న నేపథ్యంలో, అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జాతీయ స్థాయి క్రీడా పోటీల నిర్వహణకు నిజామాబాద్ జిల్లాను ఎంపిక చేయడం ఎంతో ప్రతిష్టాత్మకమైన విషయమని పేర్కొంటూ, ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా పోటీలను విజయవంతంగా నిర్వహించేందుకు ఇప్పటి నుంచే సమగ్ర కార్యాచరణతో ముందుకు సాగాలని సూచించారు. క్రీడాకారులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను సమకూర్చాలని, వారి భద్రతకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. దాదాపు ఐదు రోజుల పాటు పోటీలు కొనసాగనున్నందున, క్రీడాకారుల వసతి, భోజనం, తాగునీరు, పారిశుద్ధ్యం, వైద్య సేవలు తదితర సదుపాయాలను సమన్వయంతో ఏర్పాటు చేయాలని సూచించారు. జాతీయ స్థాయి క్రీడా పోటీలను జిల్లాలో విజయవంతంగా నిర్వహించడం ద్వారా నిజామాబాద్ జిల్లాకు మంచి గుర్తింపు తీసుకురావాలని, ఇందుకోసం సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి హితవు పలికారు. క్రీడా పోటీల నిర్వహణ కోసం ఇంకనూ ఏవైనా సదుపాయాలు అవసరమైతే ప్రతిపాదనలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ భుజంగరావు, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్ర కుమార్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, ఇంచార్జి డీఈఓ సాయాగౌడ్, జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి పవన్ కుమార్, డీఎంహెచ్‌ఓ డాక్టర్ రాజశ్రీ, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి పరమేశ్వర్, నిజామాబాద్ ఏసీపీ ప్రకాశ్ యాదవ్, నవ్య భారతి స్కూల్ కరస్పాండెంట్ సంతోష్, లత, స్థానిక అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# మాజీ ఎమ్మెల్యే గన్ గండ్ర పరామర్శ

**భూపాలపల్లి/ మీడియా టుడే అక్టోబర్ 27**

భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 16వ వార్డు సుభాష్ కాలనీ వాస్తవ్యులు కీ.శే గాజుల రామస్వామి మరణించగా నేడు వారి ఇంటికి వెళ్ళి, వారి పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతి తెలిపిన భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి అదే విదంగా 1వ వార్డు సెగ్గంపల్లి గ్రామ వాస్తవ్యులు కీ.శే జిముడ రాజయ్య 11వ వార్డు భాస్కర్ గడ్డ వాస్తవ్యులు గడ్డం కిష్టయ్య మరణించగా వారి ఇంటికి వెళ్ళి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అదే విదంగా 12వ వార్డు కాసీంపల్లి గ్రామ వాస్తవ్యులు పులి రవి కాలికి శాస్త్ర చికిత్స అనంతరం ఇంటి వద్ద కోలుకుంటున్న వారిని వారి ఇంటికి వెళ్ళి పరామర్శించారు. అనంతరం సామల హరీష్ కి కిడ్నీ స్టోన్ స్టంట్ అనంతరం ఇంటి వద్ద కోలుకుంటున్న వారిని వారి ఇంటికి వెళ్ళి పరామర్శించారు.

మీడియా టుడే
బుధవారం, అక్టోబర్ 28, 2026

# విద్యుత్ ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు!

## ప్రజాబాట కార్యక్రమంలో భాగంగా చెట్ల కొమ్మల తొలగింపు

అమీన్‌పూర్, అక్టోబర్ 27 (మీడియా టుడే)



:ప్రజాబాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం అమీన్‌పూర్ డివిజన్ పరిధిలోని బంధంకొమ్ము ప్రభుత్వ పాఠశాల సమీపంలో విద్యుత్ శాఖ అధికారులు ముందస్తు భద్రతా చర్యలు చేపట్టారు. విద్యుత్ లైన్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా, షార్ట్ సర్క్యూట్ వంటి ప్రమాదాలు సంభవించకుండా ఈ పనులు నిర్వహించారు. అమీన్‌పూర్ సబ్‌స్టేషన్ ఏఏఈ వెంకట్రాంరెడ్డి ఆధ్వర్యంలో విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# రామన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు బ్యాగులు, బూట్ల పంపిణీ

యాదాద్రి భువనగిరి జిల్లా మీడియా టుడే,అక్టోబర్ 27:రామన్నపేట,ప్రతినిధి




రామన్నపేట:తెలంగాణ ప్రభుత్వం విద్యారంగానికి ఇస్తున్న ప్రాధాన్యతలో భాగంగా, రామన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఉచితంగా బ్యాగులు, బెల్టులు, బూట్లు మరియు సాక్సుల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది.?ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ చంద్రముఖి జగదీష్ విద్యార్థులకు విద్యా సామగ్రిని (బ్యాగ్,బెల్టు, షూస్,సాక్స్) లు అందజేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విద్యను అభ్యసిస్తున్న పేద, మధ్యతరగతి విద్యార్థులకు ఇలాంటి సంక్షేమ పథకాలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు.ప్రభుత్వం కల్పిస్తున్న ఈ వసతులను సద్వినియోగం చేసుకొని విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ ప్రోత్సహం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.?ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# ఓటు హక్కు పరిరక్షణకు కాంగ్రెస్ శ్రేణులు కృషి చేయాలి

ఓటు బచావో -- దేశ్ బచావో" ప్రచారంలో శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు

భూపాలపల్లి / మీడియా టుడేఅక్టోబర్ 27



భూపాలపల్లి లో ఎస్ఐఆర్ ప్రక్రియ మూడో దశలో భాగంగా "ఓటు బచావో -- దేశ్ బచావో" ప్రచార కార్యక్రమాన్ని జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన బూత్ స్థాయి ఏజెంట్ల (బీఎల్ఏ) సమావేశంలో ఏఐసీసీ అబ్జర్వ్ కెబిఆర్ నాయుడు, ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి, తెలంగాణ స్టేట్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ ఐత ప్రకాష్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు బట్టు కరుణాకర్ పాల్గొన్నారు. అనంతరం భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు పాల్గొని మాట్లాడారు.ఓటర్ల జాబితాలో అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఉండేలా బీఎల్ఏలు బాధ్యతగా పనిచేయాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు సూచించారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి అత్యంత కీలకమని, దాని పరిరక్షణ కోసం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, అర్హులైన ఓటర్ల నమోదు, ఓటర్ల జాబితాలో తప్పుల సవరణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. "ఓటు బచావో -- దేశ్ బచావో" కార్యక్రమాన్ని గ్రామస్థాయిలో విస్తృతంగా నిర్వహించాలని శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు కోరారు.ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి అని ఆయన పేర్కొన్నారు.

# పీసీసీ మహేష్ కుమార్ గౌడ్ చిట్ చాట్

మీడియా టుడే న్యూస్ సైదాపూర్ ప్రతినిధి వైష్ణవ్ అక్టోబర్ 27



కేటీఆర్ - హరీష్ రావు భ్రమలో ఉన్నారు... గ్రౌండ్ రియాలిటి తెలుసుకోవడం లేదు.మా టార్గెట్ వచ్చే ఎన్నికల్లో వంద(100) సీట్లు.అన్ని సమస్యలకు నవంబర్ లో పరిష్కారం దొరుకుతుంది. నవంబర్ అయ్యాక డైరెక్ట్ ఎన్నికలే మా టార్గెట్.ముఖ్యమంత్రి మాకు ఫ్రీ హ్యాండ్ ఇచ్చారు. మాకు ఉన్నంత కోఆర్డినేషన్ దేశంలో ఎక్కడాలేదుఎమ్మెల్యేలు గ్రౌండ్ లో యాక్టీవ్ అయ్యారు - ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి వ్యాఖ్యలు చూసాను.కేసీఆర్ మేధావి అనుకుంటాం - ఆలోచన లేకుండాఅప్పులుచేశారు.తెలంగాణ రాష్ట్రంలో ఇప్పట్లో బీజేపీ అధికారంలోకి వచ్చే పరిస్థితి లేదు.తెలంగాణ రాష్ట్రంలో మళ్ళీ అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్ పార్టీనే సన్నబియ్యం - ఇందురమ్మ ఇండ్లు పొందిన ప్రతీ ఒక్కరు మాకు ఓటు వేస్తారు.ఉచిత కరెంట్ - 90 వేల ఉద్యోగాలు ఇచ్చాం వాళ్లంతా మావెంటే ఉన్నారు.ప్రభుత్వాలు వచ్చినా పోయినా పార్టీ ప్రమాణికం-పర్మినెంట్.మాకు పార్టీనే బలం - గ్రౌండ్ లో కాంగ్రెస్,బలంగాఉంది.ఎల్నినో పై హరీష్ రావు పిచ్చిగా మాట్లాడుతున్నారు. దేశం అంతా ఎల్నినో ఉంది.బీజేపీ పని అయిపోయింది. ఇప్పుడున్న 8 ఎంపీ సీట్లలో రెండు వస్తే ఎక్కువ.8 మంది ఎమ్మెల్యే లలో ఒక్కరుగెలువరు.ఆదిలాబాద్ నిజామాబాదు లో 40 శాతం సీట్లు మాకే వస్తాయి!

# శ్రీ మత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం 3 నెలల హుండీ ఆదాయం 9,93,003/- రూపాయలు

మీడియా టుడే వలిగొండ అక్టోబర్ : 27





యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని వెంకటాపురం గ్రామంలో వెలిసిన ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ మత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం గత మూడు నెలలో భక్తులు సమర్పించే కట్న కానుకలను మంగళవారం వెంకటలక్ష్మి సూపరింటెండెంట్ దేవాదాయ ధర్మాదాయ శాఖ నల్లగొండ పర్యవేక్షణలో శ్రీ మత్స్యగిరి లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం చైర్మన్ తుమ్మల శ్రీనివాస్, ఆలయ కార్యనిర్వాహణాధికారి కొత్తపల్లి వెంకటయ్య దేవస్థానం ధర్మకర్తల సమక్షంలో లెక్కించగా 9,93,003/-రూపాయలు హుండీ ఆదాయం దేవస్థానమునకు వచ్చినది. అదేవిధంగా నిత్య అన్నదాన ప్రసాదానికి 7,543/- రూపాయలు ఆదాయం వచ్చినట్లు దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్, ధర్మకర్తలు ఆలయ కార్యనిర్వాహణాధికారి కొత్తపల్లి వెంకటయ్య ఒక పత్రిక ప్రకటనలో జతెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు కరుణాకర్ రెడ్డి, అనంత చారి, ఆండాలు, జంగయ్య, చంద్రకళ, రమేష్, నరసింహ, నరేందర్ రెడ్డి, వెంకటేశం, నరసింహ, కుమార్, ఎక్స్ అఫీషియో మెంబర్ ప్రతాపురం శ్రీనివాసచార్యులు ఆలయ అర్చకులు ఆలయ సిబ్బంది కెనరా బ్యాంకు అధికారి కృష్ణ శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర సేవాసమితి ట్రస్ట్ సభ్యులు మహబూబాబాద్ భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# పేకాట స్థావరాలపై సిసిఎస్ పోలీసుల దాడి ఏడుగురు అరెస్ట్

భూపాలపల్లి/గణపురం మీడియా టుడే అక్టోబర్ 27



గణపురం మండలం చెల్పూర్ గ్రామ శివారులో పేకాట స్థావరంపై సి సి ఎస్ పోలీసుల దాడి -- ఏడుగురు పట్టివేత, నగదు మొబైల్ ఫోన్లు స్వాధీనంభూపాలపల్లి జిల్లా ఘణపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని చెల్పూర్ గ్రామ శివారులో మంగళవారం సాయంత్రం సి సి ఎస్ సిఐ రమేష్ గారి ఆధ్వర్యంలోని సిసిఎస్ పోలీసు బృందం పేకాట స్థావరంపై దాడి నిర్వహించింది. ఈ దాడిలో పేకాట ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి ?7,690 నగదు, 7 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.అదుపులోకి తీసుకున్న ఏడుగురిని తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం ఘణపురం పోలీస్ స్టేషన్ ఎస్ హెచ్ ఓ భోగరాల అశోక్ కు అప్పగించారు. ఈ వ్యవహారంలో మరో వ్యక్తి పరారీలో ఉన్నట్లు గుర్తించారు.

# ఎల్ నీ నో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు కేంద్రం రూ.30 వేల కోట్ల ప్యాకేజీ ప్రకటించాలి

## రైతులను ఆదుకోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపాలి: సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్




యాదాద్రి భువనగిరి జిల్లా మీడియా టుడే, అక్టోబర్ 27:రామన్నపేట,ప్రతినిధి

రామన్నపేట ఎల్ నీ నో ప్రభావంతో రాబోయే వర్షాభావ,కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు తెలంగాణ రాష్ట్రానికి రూ.30 వేల కోట్ల ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీని అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రజల్లో భయాందోళనలు, గందరగోళం సృష్టించకుండా, క్షేత్రస్థాయిలో పరిస్థితులను సమగ్రంగా అంచనా వేసి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని,రైతులకు భరోసా కల్పించాలని ఆయన కోరారు.రామన్నపేటలో స్థానిక సిపిఎం కార్యాలయంలో కల్లూరి నగేష్ అధ్యక్షతన జరిగిన మండల విస్తృత స్థాయి సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎండీ జహంగీర్ మాట్లాడుతూ, ఎల్నినో ప్రభావంతో వర్షపాతం తగ్గి వ్యవసాయ రంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశాలున్న నేపథ్యంలో ప్రభుత్వాలు ముందస్తు కార్యాచరణ రూపొందించాలని అన్నారు.వాతావరణ పరిస్థితులపై శాస్త్రీయ అంచనాలు రూపొందించి, మండలాల వారీగా కరువు పరిస్థితులను సమీక్షించి,ప్రజలకు అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు.రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో చర్చించి అవసరమైన నిధులు సాధించడంతో పాటు,రాష్ట్ర బడ్జెట్ నుంచి కూడా ప్రత్యేక నిధులు కేటాయించి కరువు నివారణ చర్యలు చేపట్టాలని కోరారు. తాగునీటి ఎద్దడి తలెత్తకుండా గ్రామాల్లోని చెరువులు,బోరుబావులు, ఇతర నీటి వనరులను ముందుగానే సమీక్షించాలని అన్నారు.రైతులు పంటలు వేయవద్దని సూచించడం మాత్రమే ప్రభుత్వ బాధ్యత కాదని, ప్రత్యామ్నాయ పంటల సాగుపై స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వడంతో పాటు రైతులకు అవసరమైన విత్తనాలు,ఎరువులు, సాగునీటి సదుపాయాలు కల్పించాలని అన్నారు. ఇప్పటికే పంటల సాగు కోసం పెట్టుబడులు పెట్టిన రైతులకు నష్టం కలగకుండా చర్యలు తీసుకోవాలని, పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. అవసరమైన ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకంలో అదనపు పని దినాలు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం సహకరించాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరా, పశువుల మేత,ప్రజలకు ఉపాధి కల్పన వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మేక అశోక్ రెడ్డి,జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జల్లెల పెంటయ్య, మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం,జిల్లా కమిటి సభ్యులు వనం ఉపేందర్,మండల కార్యదర్శి వర్గ సభ్యులు కూరెళ్ళ నర్సింహా చారి, కందుల హనుమతు,జంపాల అండాలు,మండల కమిటి సభ్యులు గన్నేబోయిన విజయభాస్కర్,గొరిగే సోములు,నాగటి ఉపేందర్,బావండ్లపల్లి బాలరాజు,వేముల సైదులు,బోడిగె రజిత,తొలుపునూరి శ్రీనివాస్,అవనగంటి నగేష్,శాఖ కార్యదర్శులు తాళ్లపల్లి జితేందర్,పులి బిక్షం,శానగొండ వెంకటేశ్వర్లు,అవనగంటి రవీందర్,అవనగంటి స్వామి,పుట్టల ఉదయ్ కుమార్,జోగుల ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ఎంఎస్‌సిసిని వేరే మండలానికి బదిలీ చేయాలి

## కలెక్టర్ కు వినతి పత్రం అందించిన త్రివేణి గ్రామైక్య సంఘం

జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి మీడియా టుడే అక్టోబర్ 27:

జిల్లాలోని కాటారం మండలంలోని చిద్దెనపల్లి క్లస్టర్ కు ఎం ఎస్ సి సి గా మారగాని సారక్కను 21/9/ 2026నియమించడం జరిగింది. త్రివేణి గ్రామైక్య సంఘానికి ఆమె రావడం ఇష్టం లేదని ఆమెను వేరే మండలానికి బదిలీ చేయవలసిందిగా కలెక్టర్ కు వినతి పత్రం అందజేయడం జరిగిందని ఒక ప్రకటనలో తెలిపారు.వివరాల్లోకెళ్తే గతంలో మారగాని సమ్మక్క ఎం ఎస్ సి సి మహా ముత్తారం మండలంలో విధులు నిర్వహిస్తున్న క్రమంలో అవకతవకలకు పాల్పడడం వలన ఆమెను పెద్దపల్లి జిల్లా కమాన్ పూర్ మండలానికి బదిలీ చేయడం జరిగింది. అక్కడనుండి మహదేవ్పూర్ మండలానికి బదిలీపై రావడం జరిగిందన్నారు. మహాదేవపూర్ మండలంలోని శ్రీనిధి డబ్బుల లో అవకతవకలు చేయడం వలన అక్కడినుండి మలహర్ మండలానికి బదిలీ చేయడం అక్కడ మండలంలో ఇద్దరు మహిళ వివో ల వ్యక్తిగత విషయంలో కలగజేసుకుని కుటుంబ విషయంలో భార్య భర్తల మధ్య గొడవలు ఏర్పడి విడిపోవడానికి కారణమైందని, మరల తిరిగి బదిలీపై అక్కడినుండి మరల మహాదేవపూర్ మండలానికి ట్రాన్సర్ చేయడం జరిగింది ఆ ప్రకటనలో పేర్కొన్నారు. మహాదేవపూర్ మండలంలో ఏ క్లస్టర్ ఇవ్వకుండా ఖాళీగా ఉంచారు. ఆమెపై వచ్చిన ఆరోపణల విషయాలను దృష్టిలో ఉంచుకొని మా క్లస్టర్ నుండి వేరొక మండలానికి బదిలీ చేయగలరని ఈ ఎం ఎస్ సీ ని కనుక వేరే మండలానికి బదిలీ చేయని యెడల త్రివేణి గ్రామైక్య సంఘం సభ్యుల తో కలసి పెద్ద ఎత్తున కలెక్టర్ ఆఫీస్ ముందు నిరసన కార్యక్రమం తెలియజేస్తామని ఆ ప్రకటనలో తెలియజేశారు.

# జిల్లా గ్రంథాలయ సంస్థ సమావేశంలో 8 తీర్మానాలకు ఏకగ్రీవ ఆమోదం

## గ్రంథాలయాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం

నిర్మల్ పట్టణం: భాగ్యనగర్: (మీడియా టుడే సబ్ ఎడిటర్) అక్టోబర్ 27, 2026

జిల్లా గ్రంథాలయ సంస్థ సర్వసభ్య సమావేశం మంగళవారం సంస్థ కార్యాలయంలో చైర్మన్ సయ్యద్ అర్జుమండ్ అలీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాలోని గ్రంథాలయాల అభివృద్ధి, పాఠకులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు సంబంధించి ఎనిమిది ప్రధాన అంశాలపై చర్చించి, అన్ని తీర్మానాలకు సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు.సమావేశం అనంతరం చైర్మన్ సయ్యద్ అర్జుమండ్ అలీ వివరాలు వెల్లడిస్తూ.. జిల్లాలోని శాఖా గ్రంథాలయాలకు నూతన భవనాల నిర్మాణం చేపట్టడంతో పాటు పాఠకులకు తాగునీరు, ఫర్నిచర్ తదితర మౌలిక సదుపాయాలు కల్పించేందుకు నిర్ణయించినట్లు తెలిపారు. అలాగే 2026--27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ ప్రతిపాదనలు, నిధుల వినియోగానికి సర్వసభ్య సమావేశం ఆమోదం తెలిపినట్లు పేర్కొన్నారు.విద్యార్థులు, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు గ్రంథాలయాలు మరింత ఉపయోగపడేలా అభివృద్ధి కార్యక్రమాలను ప్రణాళికాబద్ధంగా చేపడతామని చైర్మన్ తెలిపారు. పాఠకులకు మెరుగైన సేవలు అందిస్తూ జిల్లాలో పఠన సంస్కృతిని, విజ్ఞాన సంపదను పెంపొందించేందుకు కృషి చేస్తామన్నారు.ఈ సమావేశంలో ఏ సి జి ఈ ఎం. పరమేశ్వర్, డి పి ఆర్ ఓ విష్ణువర్ధన్, జిల్లా పంచాయతీ కార్యాలయ సీనియర్



అసిస్టెంట్ ప్రశాంత్, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కే. క్రితిన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టు సంక్షేమానికి నిరంతర కృషి చేస్తాం

-మహబూబ్ నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాసరెడ్డి

-నగర మేయర్ గుమాల్ మమత శ్రీనివాస్ హామీ -డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి



మహబూబ్ నగర్, అక్టోబర్ 27(మీడియా టుడే ప్రతినిధి):- మహబూబ్ నగర్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని జర్నలిస్టుల సంక్షేమానికి తన వంతుగా నిరంతరం సహాయ సహకారం అందిస్తానని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చారు. నగరంలోని (ఎస్వీఎస్ గుట్ట) దేవుని గుట్ట జర్నలిస్టుల సంక్షేమ సంఘం నూతన అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కొత్త శ్రీనివాస్, చంద్రశేఖర్ గౌడ్, కోశాధికారి కృష్ణ యాదవ్, కమిటీ గౌరవ సలహాదారులు మంగళగిరి యాదగిరి, డాక్టర్ బండి విజయకుమార్, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు నరేంద్ర చారి, టీవీ 5 జిల్లా ప్రతినిధి పి. రవి కుమార్ , సూర్య దినపత్రిక బ్యూరో ఇంచార్జ్ వరంగల్ శివకుమార్, 99 న్యూస్ చానల్ బ్యూరో ఇంచార్జ్ మెట్టుగాడి ప్రభాకర్, జీఎస్ మీడియా చైర్మన్ జెమిని శేఖర్, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి మొలకలపల్లి గోపాల్ మహారాజ్, ఐఎంఎఫ్ డబ్ల్యూజే జాతీయ కమిటీ సభ్యుడు పసుపుల శ్రీనివాస్, ప్రజా వెలుతురు పత్రిక ఎడిటర్ కొమ్ము దామోదర్, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఫౌండర్ మెంబర్ ఏముల నర్సిములు, కె. సుకుమార్ తదితరులు మంగళవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి మహబూబ్ నగర్ జర్నలిస్టుల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దేవుని గుట్ట వద్ద జర్నలిస్టు కాలనీ సమస్యలను తెలుసుకున్నారు. హౌసింగ్ పీడీ ఉపేందర్ కు ఫోన్ చేసి వాస్తవ పరిస్థితిని ఆరా తీశారు. గత ప్రభుత్వ హయాంలో జర్నలిస్టులకు డబల్ బెడ్ రూమ్ ఇళ్ల పథకం కింద ఇండ్లు నిర్మాణం చేపట్టారని తెలిపారు. కొన్ని ఇండ్లు ఇంకా నేటికీ అసంపూర్తిగా ఉన్నాయని వాటిని వెంటనే పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇప్పటికే ఇండ్లు నిర్మించుకున్న జర్నలిస్టులకు డబల్ బెడ్ రూమ్ ఇళ్ల పథకం కింద ఆర్థిక సహాయం వెసులుబాటుపై పరిశీలన చేయాలని సూచించారు. లోయ మాదిరిగా ఉన్న జర్నలిస్టుల ఇళ్ల స్థలాలను పునాది వరకు చదను చేసే విధంగా చూడాలని మున్సిపల్ ఇంజనీర్లకు సూచించారు. మిషన్ భగీరథ వాటర్ ట్యాంకు కోసం తవ్వుతున్న మట్టిని వీలైతే అక్కడ డంపింగ్ చేయాలని చెప్పారు. మౌలాలి గుట్ట వద్ద నిర్మించిన ఇండ్లకు మొదట కొత్తగా పట్టాలు అందజేసిన తర్వాతనే అక్కడ మౌలిక సదుపాయాలపై దృష్టి సారిస్తారని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. అర్హత కలిగిన అందరికీ మౌలాలి గుట్ట వద్ద ఇండ్లు కేటాయించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. త్వరలోనే ఎస్వీఎస్ గుట్ట వద్ద జర్నలిస్టుల కాలనీలో మార్నింగ్ వాక్ కార్యక్రమాన్ని చేపడతానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

**-నా వంతుగా సహాయ సహకారాలు అందజేస్తా మేయర్ మమత.**

ఎస్వీఎస్ గుట్ట వద్ద జర్నలిస్టుల కాలనీని క్షేత్రస్థాయిలో పర్యటించిన తర్వాతనే అక్కడ కావలసిన మౌలిక వసతులపై తన పరిధిలోని సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఈ సందర్భంగా మహబూబ్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మమతా శ్రీనివాస్ జర్నలిస్టులకు తెలిపారు. దేవుని గుట్ట జర్నలిస్టుల సంక్షేమ సంఘం అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాస్, చంద్రశేఖర్ గౌడ్ ను తన నివాసంలో ఘనంగా శాలువా శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్టులు తమ సమస్యలను ప్రస్తావించగా ఆమె పై విధంగా స్పందించారు. జర్నలిస్టుల సమస్యలను అవగతం చేసుకొని గౌరవ శాసనసభ్యుల దృష్టికి తీసుకుపోయి పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు తమ కాలనీలో రోడ్లు, తాగునీరు, డ్రైనేజీ, కమ్యూనిటీ హాల్, పార్క్ వంటి సమస్యలు ఉన్నాయని తెలిపారు.

**జర్నలిస్టులు ఐక్యంగా ఉంటేనే సమస్యల పరిష్కారం: మారేపల్లి సురేందర్ రెడ్డి**

ఎస్వీఎస్ గుట్టపై జర్నలిస్టు కాలనీని ఇటీవల తాను మార్నింగ్ వాక్ ద్వారా సందర్శించానని ఈ సందర్భంగా మహబూబ్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి గుర్తు చేశారు. ఇప్పటికే ఒక సంఘం అక్కడ రిజిస్ట్రేషన్ అయి ఉందని మరో సంఘం ఏర్పాటు చేయడం ఆహ్వానించదగ్గ పరిణామమైనప్పటికీ జర్నలిస్టులందరూ ఐక్యతను చాటాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా ఆయన దేవుని గుట్ట జర్నలిస్టుల సంక్షేమ సంఘం కమిటీ పెద్దలకు సూచించారు. సూపర్ సీనియర్ జర్నలిస్టులు కోర్ కమిటీగా జోక్యం చేసుకొని అందరూ ఐక్యంగా ఉండేలా చర్చలు జరుపుకోవాలని సూచించారు. అందరూ కలిసి సమష్టిగా ఉంటేనే సమస్యలు పరిష్కారమవుతాయని సూచించారు. మౌలాలి గుట్ట వద్ద జర్నలిస్టులకు అందరికీ న్యాయం చేసేందుకు ప్రెస్ క్లబ్ కు బాధ్యతలు అప్పగించామని ఈ సందర్భంగా మారేపల్లి సురేందర్ రెడ్డి గుర్తు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ కార్యకర్త, మైత్రి ప్రింటర్స్ అధినేత మైత్రి యాదయ్య జోక్యం చేసుకుంటూ కాంగ్రెస్ పై, తమ శాసనసభ్యులపై విశ్వాసం ఉంచిన ప్రతి వర్గానికీ న్యాయం జరుగుతుందని ఈ సందర్భంగా జర్నలిస్టులకు భరోసా ఇచ్చారు.

# పదో తరగతి పరీక్ష ఫీజు చెల్లింపులు ప్రారంభం

**నవంబర్ 16 వరకు సాధారణ ఫీజు చెల్లింపునకు అవకాశం**

**ఆలస్య రుసుముతో డిసెంబర్ 28 వరకు గడువు: డీఈఓ ఏ. రమేష్ కుమార్**

మీడియా టుడేకల్వకుర్తి నియోజకవర్గ ప్రతినిధి అక్టోబర్ 27 2027 మార్చిలో నిర్వహించనున్న పదో తరగతి వార్షిక పబ్లిక్ పరీక్షలకు సంబంధించి పరీక్ష ఫీజు చెల్లింపుల ప్రక్రియ ప్రారంభమైందని నాగర్‌కర్నూల్ జిల్లా విద్యాశాఖ అధికారి ఏ. రమేష్ కుమార్ తెలిపారు. పరీక్ష ఫీజు చెల్లింపునకు ప్రభుత్వ పరీక్షల విభాగం షెడ్యూల్‌ను విడుదల చేసిందని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.విద్యార్థులు అక్టోబర్ 30 నుంచి నవంబర్ 16వ తేదీ వరకు ఎలాంటి ఆలస్య రుసుము లేకుండా రూ.125 పరీక్ష ఫీజు చెల్లించవచ్చని వివరించారు. నిర్ణీత గడువులోగా ఫీజు చెల్లించలేని విద్యార్థుల కోసం ఆలస్య రుసుముతో అదనపు గడువులను కూడా కేటాయించినట్లు తెలిపారు.

**ఫీజు చెల్లింపు గడువుల వివరాలు**

అక్టోబర్ 30 నుంచి నవంబర్ 16 వరకు రూ.125 సాధారణ పరీక్ష ఫీజుగా చెల్లించాలి. నవంబర్ 18 నుంచి డిసెంబర్ 1 వరకు రూ.50 ఆలస్య రుసుముతో, డిసెంబర్ 3 నుంచి 14 వరకు రూ.200 ఆలస్య రుసుముతో, డిసెంబర్ 16 నుంచి 28 వరకు రూ.500 ఆలస్య రుసుముతో ఫీజు చెల్లించేందుకు అవకాశం కల్పించినట్లు డీఈఓ వెల్లడించారు.

**ప్రధానోపాధ్యాయులకు సూచనలు**



జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తమ ఐడీ, పాస్‌వర్డ్‌లను ఉపయోగించి బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ వెబ్‌సైట్ ద్వారా పరీక్ష ఫీజు చెల్లింపు ప్రక్రియను పూర్తి చేయాలని డీఈఓ సూచించారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఫీజు చెల్లింపు గడువులను గమనించి, చివరి నిమిషంలో ఇబ్బందులు తలెత్తకుండా ముందుగానే ప్రక్రియను పూర్తి చేసుకోవాలని కోరారు.

# కానూన్ జానో- బచ్పన్ బచావో చట్టాన్ని తెలుసుకోండి బాల్యాన్ని కాపాడండి

## కృష్ణవేణి టాలెంట్ స్కూల్లో పోక్సో చట్టంపై న్యాయ అవగాహన సదస్సు




**యాదాద్రి భువనగిరి జిల్లా మీడియా టుడే, అక్టోబర్ 27:రామన్నపేట,ప్రతినిధి**

యాదాద్రి భువనగిరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డి ఎల్ ఎస్ ఏ), తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ (టి ఎస్ ఎల్ ఎస్ ఏ) వారి ఆదేశాల మేరకు,బచ్పన్ బచావో ఆందోళన్ కార్యక్రమంలో భాగంగా "కానూన్ జానో-- బచ్పన్ బచావో" (చట్టాన్ని తెలుసుకోండి--బాల్యాన్ని కాపాడండి) అనే ఉప అంశంపై కృష్ణవేణి టాలెంట్ స్కూల్లో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రామన్నపేట అదనపు జూనియర్ సివిల్ జడ్జి-కమ్-జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ శ్రీమతి వి.రత్నకుమారి పాల్గొని సుమారు 740 మంది విద్యార్థులకు న్యాయపరమైన అంశాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా విద్యార్థులకు మంచి స్పర్శ -- చెడు స్పర్శ, పోక్సో (పి ఓ సి ఎస్ ఓ) చట్టం,బాలల హక్కులు,వ్యక్తిగత భద్రత, లైంగిక వేధింపుల నుంచి రక్షణ వంటి ముఖ్యమైన అంశాలను వివరించారు. అనుచిత ప్రవర్తనను గుర్తించడం,అలాంటి పరిస్థితులు ఎదురైనప్పుడు భయపడకుండా తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు తెలియజేయడం, అవసరమైనప్పుడు న్యాయ సహాయం పొందడం వంటి విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రతి బాలుడు,బాలిక తమ హక్కులను తెలుసుకొని, సురక్షితమైన వాతావరణంలో విద్యను అభ్యసించాలని న్యాయమూర్తి సూచించారు.బాలలపై జరిగే నేరాలను నివారించడం,వారి హక్కుల పట్ల అవగాహన పెంపొందించడం. పతి చిన్నారికి సురక్షితమైన బాల్యాన్ని అందించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశంగా నిలిచింది.ఈ కార్యక్రమంలో ప్యానెల్ అడ్వకేట్లు కునూరు శ్రీనివాస్,మామిడి వెంకట్ రెడ్డి,అగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్ సభ్యుడు కె. శ్రీశైలం, పారా లీగల్ వాలంటీర్ కె. యాదయ్య,పాఠశాల ప్రిన్సిపాల్ సురేష్, కరస్పాండెంట్ జి. నరేందర్,పాఠశాల ఉపాధ్యాయులు,ఆశా కార్యకర్త శ్రీమతి కొండ జానకి మరియు విద్యార్థులు పాల్గొన్నారు. బాలలపై జరిగే నేరాలను నివారించడం,వారి హక్కుల పట్ల అవగాహన పెంపొందించడం, ప్రతి చిన్నారికి సురక్షితమైన బాల్యాన్ని అందించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యంగా నిలిచింది.

# శ్రీ లింగమంతుల స్వామి పెద్దగట్టు జాతరపై యాదవులకే పూర్తి అధికారం కల్పించాలి

## పెద్దగట్టు లింగమంతుల స్వామి జాతరను రాష్ట్ర పండుగగా ప్రకటించాలి

## రూ.100 కోట్ల నిధులు మంజూరు చేయాలి

**సూర్యాపేట, అక్టోబర్ 27. మీడియా టుడే:**

యాదవుల ఆరాధ్య దైవమైన శ్రీ లింగమంతుల స్వామి పెద్దగట్టు జాతరను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర పండుగగా ప్రకటించి, జాతర అభివృద్ధి, మౌలిక సదుపాయాలు, భక్తుల సౌకర్యాల కోసం రూ.100 కోట్ల నిధులు మంజూరు చేయాలని మంగళవారం నాడు తగుళ్ళ జనార్దన్ యాదవ్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్య అతిథులుగా కోదాడ మాజీ శాసనసభ్యులు బొల్లం మల్లయ్య యాదవ్, బీసీ రాష్ట్ర నాయకులు వట్టే జానయ్య యాదవ్ విచ్చేసి మాట్లాడారు. పెద్దగట్టు జాతర నిర్వహణకు ముందస్తుగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక క్యాబినెట్ సమావేశం ఏర్పాటు చేసి, జాతర ప్రాముఖ్యతను గుర్తించి తగిన నిర్ణయాలు తీసుకోవాలని, జాతర నిర్వహణకు సంబంధించిన అన్ని కీలక నిర్ణయాలు, పరిపాలనా బాధ్యతలు యాదవుల చేతుల్లోనే ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ముఖ్య అతిథులు అన్నారు. పెద్దగట్టు జాతర కేవలం ఒక ప్రాంతీయ ఉత్సవం మాత్రమే కాదని, యాదవుల ఆధ్యాత్మిక విశ్వాసాలకు, సంప్రదాయాలకు, సాంస్కృతిక వారసత్వానికి ప్రతీక అని సమావేశం అభిప్రాయపడింది. ఇంతటి ప్రాముఖ్యత కలిగిన జాతరకు ఆరు రాష్ట్రాల నుండి 30, 40 లక్షల మంది పాల్గొనే ఈ యొక్క జాతరను రాష్ట్ర పండుగ హోదా కల్పించడంతో పాటు, తగిన బడ్జెట్ కేటాయించి శాశ్వత అభివృద్ధి పనులు చేపట్టాలని వారు కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ డిమాండ్లను సానుకూలంగా పరిశీలించి, పెద్దగట్టు జాతర అభివృద్ధికి తక్షణ చర్యలు చేపట్టాలని సమావేశం విజ్ఞప్తి చేసింది. యాదవుల ఆరాధ్య దైవమైన లింగమంతుల స్వామి జాతర గౌరవాన్ని మరింత పెంచేలా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోవాలని నాయకులు కోరారు. యాదవుల ఆరాధ్య దైవమైన శ్రీ లింగమంతుల స్వామి పెద్దగట్టు జాతరపై ఇతరుల పెత్తనాలు ఇకనైనా ఆగాలని, జాతర నిర్వహణలో యాదవులకే పూర్తి అధికారాలు, నిర్ణయాధికారం కల్పించాలని, ఈ యొక్క సమావేశంలో పాల్గొన్న అందరూ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసినారు. యాదవులను కేవలం పేరుకే చైర్మన్లుగా నియమించి, అసలు పెత్తనం, కీలక నిర్ణయాలు ఇతరుల చేతుల్లో పెట్టే విధానాన్ని తక్షణమే మార్చాలని సమావేశం స్పష్టం చేసింది.యాదవుల ఓట్లు కావాలి, యాదవుల మద్దతు కావాలి, కానీ యాదవుల ఆరాధ్య దైవం జాతర నిర్వహణలో మాత్రం యాదవులకు పూర్తి అధికారం ఇవ్వకపోవడం ఏ విధమైన న్యాయమని యాదవ నాయకులు ప్రశ్నించారు.పెద్దగట్టు జాతరపై యాదవుల హక్కులు, అధికారాల విషయంలో ప్రభుత్వాలు సానుకూలంగా స్పందించకపోతే, రాబోయే ఎన్నికల్లో ఆయా పార్టీలకు యాదవుల ఓట్లు దక్కకుండా ప్రజాస్వామ్య పద్ధతిలో రాజకీయ చైతన్యం తీసుకొస్తామని సమావేశంలో పాల్గొన్న యాదవులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పొనుగోడు గంగమ్మ దేవాలయం చైర్మెన్ యాళ్ళావుల వెంకటేశ్వర్లు యాదవ్ వజ్జే వీరయ్య యాదవ్, మతకాల చలపతి రావు యాదవ్, మద్ది శ్రీనివాస్ యాదవ్, వల్లాల అచ్చయ్య యాదవ్., పరంధాములు యాదవ్, యాదవ్ నారబోయిన వెంకట్ యాదవ్, దాసరి వెంకన్న యాదవ్, మన్నె యాదగిరి యాదవ్, తూముల వెంకన్న యాదవ్, బయ్య మల్లికార్జున్ యాదవ్, ముద్ద బిక్షపతి యాదవ్, బడుగుల నాగార్జున యాదవ్, ఆవుల అంజయ్య యాదవ్, ఉప్పుల రమేష్ యాదవ్, వర్రె కవిత యాదవ్, కోడి లింగయ్య యాదవ్, ఏర్పుల రవి యాదవ్, కన్నెబోయిన మహేష్ యాదవ్, ఆవుదొడ్డి మహేష్ యాదవ్, గోళ్ళ మల్లికార్జున్ యాదవ్, వల్లపు నరేష్ యాదవ్, మద్ది జానకి రాములు యాదవ్, పచ్చిపాల మల్లేష్ యాదవ్, గంధం లింగయ్య యాదవ్, మల్లికార్జున్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



# రైతుల భూ సమస్యల పరిష్కారానికి రీ సర్వేపై అవగాహన అవసరం

## భూ హక్కుల పరిరక్షణకు రీ సర్వే ప్రక్రియలో రైతుల భాగస్వామ్యం కీలకం

## అమ్మనగుర్తి గ్రామ సర్పంచ్ కదిరె రమేష్

**మీడియా టుడే న్యూస్ సైదాపూర్ ప్రతినిధి వైష్ణవ్ అక్టోబర్ 27**

జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలంలోని అమ్మనగుర్తి గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం సర్పంచ్ కదిరె రమేష్ అధ్యక్షతన భూభారతి రీ సర్వేపై రైతులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, భూమి ప్రతి రైతుకు ఎంతో విలువైన ఆస్తి అని, భూమికి సంబంధించిన రికార్డులు సక్రమంగా ఉండటం భవిష్యత్తులో వివాదాలు తలెత్తకుండా ఉండేందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు.భూభారతి రీ సర్వే ప్రక్రియపై రైతులు పూర్తి అవగాహన పెంచుకోవాలని, తమ భూములకు సంబంధించిన వివరాలు, రికార్డులను పరిశీలించుకోవాలని సూచించారు. సర్వే ప్రక్రియలో రైతులకు



ఏవైనా సందేహాలు లేదా సమస్యలు ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని తెలిపారు. అధికారులు అందిస్తున్న సూచనలు, సలహాలను పాటిస్తూ రీ సర్వే ప్రక్రియలో రైతులందరూ చురుకుగా భాగస్వాములు కావాలని కోరారు. భూములకు సంబంధించిన విషయాల్లో నిర్లక్ష్యం చేయకుండా, తమ హక్కులకు సంబంధించిన రికార్డులపై స్పష్టత పొందేందుకు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో కరీంనగర్ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ ఏ. కిషన్ రావు, డీఐ గాజుల రత్నం, పి. లక్ష్మణ్ నాయబ్ తహశీల్దార్, మండల గిర్దావర్ ఎం. రవి, సర్వేయర్ మనోజ్, గ్రామ ఉపసర్పంచ్ లంక దాసరి కార్తీక్, జీపీఓ కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా అధికారులు రైతులకు భూభారతి రీ సర్వే ప్రక్రియపై అవగాహన కల్పించి, భూ రికార్డులకు సంబంధించిన అంశాలను వివరించారు.

# బాలల పరిరక్షణకు దేశవ్యాప్త ప్రచారం

**జాతీయ, తెలంగాణ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థల ఆదేశాలు**

**జిల్లాలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో మంగళవారం నిర్వహించిన అవగాహనా కార్యక్రమాలు.**

**అతిధులుగా పాల్గొన్న గౌరవనీయులు జడ్జీలు -బంగారు భవిష్యత్తు నేటి బాలల పరిరక్షణతో సాధ్యమన్న సీనియర్ సివిల్ జడ్జి శ్రీమతి తాడూరు మహతి వైష్ణవి**

**నేటి ఆధునిక కాలంలో ఫోన్ వాడకం పై జాగ్రత్త అవసరం - మొబైల్ ను జాగ్రత్తగా వాడటం అలవాటు చేసుకోవాలి.**

**భూపాలపల్లి/గణపురం మీడియా టుడే అక్టోబర్ 27**

గణపురం మండలం చెల్పూర్ గ్రామంలోజాతీయ, తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవల అథారిటీచే ప్రారంభించబడిన సురక్షిత్ బచ్పన్ అభియాన్, పిల్లలను రక్షించడానికి ఉద్దేశించిన దేశవ్యాప్త ప్రచారం. జయశంకర్ భూపాలపల్లి జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహనా కార్యక్రమాలు జరిగాయి.గణపురం మండలం లోని మహాత్మ జ్యోతిరావు పూలె బి సి గురుకుల పాఠశాలలో సమావేశం నిర్వహించారు.అతిదిగ పాల్గొన్న సీనియర్ సివిల్ జడ్జి, న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి తాడూరు మహతి వైష్ణవి మాట్లాడుతూ దేశ బంగారు భవిష్యత్తు నేటి బాలల పరిరక్షణతో సాధ్యమన్నారు.పోక్సో నేరాల నివారణ, సైబర్ మోసాల నుండి పిల్లల్ని కాపాడుకోవడం మన ప్రథమ కర్తవ్యం అని తెలిపారు. విద్యార్థులు పాఠశాల స్థాయినుండి అవగాహనా కలిగి ఉండాలని సూచించారు. మొబైల్ ను జాగ్రత్తగా వాడటం అలవాటు చేసుకోవాలి అని పేర్కొన్నారు. చెల్పూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన మరో కార్యక్రమంలో అతిధిగా పాల్గొన్న అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి జి.అఖిల మాట్లాడుతూ ప్రతి బిడ్డ బాల్యం మనందరి బాధ్యత అని అన్నారు. చాలా మంది పిల్లలకు తమ హక్కులు తెలియవు, సహాయం ఎలా పొందాలో తెలియదు. దీన్ని మార్చడమే ఈ ప్రచారం లక్ష్యం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ వెంకటస్వామి, విద్యార్థులు, ఉపాధ్యాయులు, సూపరింటెండెంట్ రఘురాం,




న్యాయసే వాధికార సంస్థ సిబ్బంది అంబాల దేవేందర్, గోపాల్, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# నాగార్జునసాగర్ నియోజకవర్గంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఓటర్ నమోదు

## కార్యక్రమంలో పాల్గొన్న బి.ఆర్.ఎస్ నాయకులు



**నాగార్జునసాగర్ నియోజకవర్గశీ, నల్లగొండ జిల్లా నల్లగొండ బ్యూరో**

నాగార్జునసాగర్ మాజీ శాసనసభ్యులు నోముల భగత్ కుమార్ గారి అధ్యక్షతన ముఖ్యఅతిథిగా పాల్గొన్న మాజీ మంత్రివర్యులు, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్వర్ రెడ్డి గారు.పాల్గొన్న ఎమ్మెల్సీ కోటి రెడ్డి గారు, మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్ గారు, మాజీ ఎమ్మెల్యే బూడిద బిక్షమయ్య గౌడ్ గారు, మాజీ ట్రైకార్ ఇస్లావత్ రాంచందర్ నాయక్ గారు,ఏనుగుల రాకేష్ రెడ్డి గారు,రాష్ట్ర నాయకులు కడారి అంజయ్య యాదవ్ గారు, రిక్కల ఇంద్ర సేనారెడ్డి గారు,బాబు రావు నాయక్ గారు మరియు నియోజకవర్గ నాయకులు, పట్టభద్రులు, కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.మాజీ మంత్రి జగదీష్ రెడ్డి కామెంట్స్ నాగార్జునసాగర్ నియోజకవర్గంలో ఇప్పుడు 9,000 వేల ఓట్ల పై చిలుకు నమోదు అయ్యాయి ఇంకా 6000 వేల ఓట్లు నమోదు కావలిసి ఉంది.2006 నుంచి నల్గొండ, ఖమ్మం, వరంగల్, శాసనమండలిలో ఎమ్మెల్సీ బిఆర్ఎస్ పార్టీనే గెలిచింది.ఒక్క ఓటు తో ఓడిపోయిన చాలామంది ఉన్నారు.ఓటును నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.కాంగ్రెస్ కు బుద్ధి చెప్పాలి బిఆర్ఎస్ ను గెలిపియాలి.కొత్త పథకాలు ఏమో కానీ కేసీఆర్ ఇచ్చిన పథకాలు కొనసాగించలేక పోతున్నారు సన్నాసులు,కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకీ రాకముందు పాత రోజులు తెస్తామని గుర్తు చేసినారు కరెంట్, వాటర్ ఇవ్వలేని అసమానత ప్రభుత్వం కాంగ్రెస్,అశోక్ నగర్ లో రాహుల్ గాంధీ వచ్చి నిరుద్యోగులకు హామీ ఇచ్చారు. అదే పిల్లలు అశోక్ నగర్ చివరన కూర్చొని రాహుల్ గాంధీని నిలదీస్తున్నారు.నాగార్జున సాగర్ చరిత్రలో 17 పంటలకు నీరు ఇచ్చిన ఘనత కేసీఆర్కే దక్కింది.పక్కనే సాగర్ ప్రాజెక్ట్ వున్న నందికొండ కి ఏనాడూ కాంగ్రెస్ ప్రభుత్వం తాగడానికి నీరు ఇవ్వలేదు.ప్రజల కోరిక మేరకు నందికొండకు తాగడానికి నీలు ఇచ్చి, సాగర్ ను మున్సిపాలిటీ చేసిన ఘనత బిఆర్ఎస్ కు దక్కింది.ఎలినోవా సూపర్ ఎలినోవా ఏం పీకలేవు. కాళేశ్వరం ప్రాజెక్టు కట్టి కరువు లేకుం లేకుండా చేసిన ఘనత కేసిఆర్ కు దక్కింది. నాగార్జునసాగర్ నీళ్ల కొరకు మళ్ళీ మనకు కన్నీళ్లు రావాల్సి వచ్చింది.కేవలం మూటలు పంచుకోవడానికి కమిషను కొరకు కక్కుర్తి పడి పాలిస్తున్నారు కాంగ్రెస్ నాయకులు, పోలీసులను అడ్డుపెట్టుకొని పాలిస్తున్నారు కాంగ్రెస్ నాయకులు...రెండు సంవత్సరాలు ఓపికతో ఉండండి బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి దగ్గర్లోనే ఉంది.

# జి.వి. మధుసూదన్ శర్మకు ఉత్తమ వైద్య పురస్కారం

## - సంప్రదాయ వైద్య సేవలకు రాష్ట్రస్థాయి గుర్తింపు

**మణుగూరు ,అక్టోబర్ 27(మీడియా టుడే):**




ఆయుర్వేద వైద్యంతో ఎంతోమంది రోగులకు సేవలందిస్తున్న ప్రముఖ సంప్రదాయ వైద్యులు గోళ్లమూడి వెంకట మధుసూదన్ శర్మకు 'ఉత్తమ వైద్య' పురస్కారం లభించింది. ఈ గుర్తింపుపై స్థానికులు, అభిమానులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.తెలంగాణ రాష్ట్ర పారంపర్య వైద్య మహాసంఘం ఆధ్వర్యంలో సెప్టెంబర్లో భద్రాచలంలోని అఖిల భారత భక్త మార్కండేయ పద్మశాలీల నిత్య అన్నదాన సత్రంలో నిర్వహించిన ద్వితీయ వార్షికోత్సవం, తృతీయ సమ్మేళనంలో ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు.వనమూలికల ఆధారంగా సంప్రదాయ వైద్య విధానాలతో ప్రజలకు సేవలందిస్తూ, తరతరాల వైద్య విజ్ఞానాన్ని పరిరక్షించడంలో మధుసూదన్ శర్మ చేస్తున్న కృషిని వక్తలు కొనియాడారు. రోగులకు చికిత్సతో పాటు ధైర్యం, ఆత్మవిశ్వాసం కల్పిస్తున్న ఆయన సేవలు అభినందనీయమని పేర్కొన్నారు.ఈ పురస్కారం ఆయన అంకితభావానికి తగిన గుర్తింపు అని స్థానికులు, అభిమానులు ప్రశంసించారు. భవిష్యత్తులో మరిన్ని అవార్డులు అందుకోవాలని, ఆయురారోగ్యాలతో మరింతకాలం ప్రజలకు సేవలందించాలని ఆకాంక్షించారు.

# ఖేల్ ఇండియా వాలీబాల్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

## అండర్-17 బాలబాలికల సెలక్షన్ ట్రయల్స్ నిర్వహణ

**జగిత్యాల మీడియా టుడే -అక్టోబర్ 27**



ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఖేల్ ఇండియా అండర్-17 బాలబాలికల వాలీబాల్ జట్ల ఎంపిక కోసం మంగళవారం కరీంనగర్లోని అంబేద్కర్ స్టేడియంలో సెలక్షన్ ట్రయల్స్ నిర్వహించారు. అర్జున అవార్డు గ్రహీత రవికాంత్ రెడ్డి (2002) ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఎంపికల్లో ప్రతిభావంతులైన క్రీడాకారులను ఎంపిక చేశారు.హైదరాబాద్లోని ఎల్.బి. స్టేడియంలో జరగనున్న ఖేల్ ఇండియా పోటీల్లో పాల్గొనేందుకు క్రీడాకారులను ఈ ట్రయల్స్ ద్వారా ఎంపిక చేసినట్లు, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన యువ క్రీడాకారులను గుర్తించి, రాష్ట్రస్థాయిలో తమ ప్రతిభను చాటుకునేందుకు అవకాశాలు కల్పించడమే ఈ ఎంపికల ప్రధాన ఉద్దేశమని మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు.సెలక్షన్ ట్రయల్స్కు హాజరైన క్రీడాకారులకు నిర్వాహకుల ఆధ్వర్యంలో ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజన సదుపాయాలు కల్పించనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో అడహాక్ కమిటీ సభ్యులు పడాల అజయ్ గౌడ్, రాధాకృష్ణ రెడ్డి, పాము సత్యం, ఆరిఫ్, సంపత్, శ్రీనాథ్ రెడ్డి, ఠాగూర్, పీడీ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ స్కూల్ విద్యార్థులపై దాడి

## వార్డెన్ ఫోన్ పోయిందని హాస్టల్ విద్యార్థులను మోకాళ్లపై కూర్చోబెట్టిన స్కూల్ చైర్మన్ సందీప్

**కోదాడ, అక్టోబర్ 27 (మీడియా టుడే):-**



కోదాడ పట్టణంలోని శ్రీ స్కూల్ విద్యార్థులపై దాడి జరిగినట్లు ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. హాస్టల్ వార్డెన్ ఫోన్ పోయిందనే కారణంతో హాస్టల్లోని విద్యార్థులందరినీ మోకాళ్లపై కూర్చోబెట్టి స్కూల్ చైర్మన్ సందీప్ కొట్టినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.ఈ ఘటనలో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థి అరవింద్ తల్లి పాఠశాల ఎదుట తన ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులపై ఇలాంటి చర్యలు తీసుకోవడం ఆందోళనకరమని ఆమె వాపోయారు.ఈ ఘటనపై పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ను వివరణ కోరగా, "ఎవరో ఒకరు కొట్టి ఉంటారు" అంటూ సమాధానం ఇచ్చినట్లు సమాచారం. దీంతో పాఠశాల యాజమాన్యం వ్యవహారశైలిపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి.విషయం తెలుసుకున్న కోదాడ మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) ఘటనపై విచారణ జరిపి, వాస్తవాలు వెలుగులోకి వచ్చిన అనంతరం తగిన చర్యలు తీసుకుంటామని బాధితులకు భరోసా ఇచ్చారు.విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన పాఠశాలల్లో ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయనే ఆరోపణలపై విద్యాశాఖ అధికారులు సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు విచారణలో తేలాల్సి ఉంది.

# మహమ్మదాపూర్ లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో కెవి విద్యుత్ తీగ తగిలి నలుగురికి తీవ్ర గాయాలు

**పిట్టల క్రాంతి కుమార్ మీడియా టుడే సిద్దిపేట జిల్లా**



హుస్నాబాద్ మండలం మహమ్మదాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇంటి పని నిర్మాణంలో ఉండగా సలాక బారు అనుకోకుండా 11 కెవి తగలడంతో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి వెంటనే 108 లో హుస్నాబాద్ ప్రభుత్వా ఆసుపత్రికి తరలించారు అందులో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది వారి వివరాలు ఇలా ఉన్నాయి కుంచం సంతోష్ కల్లూరి రాధా కె రజిత సిహెచ్ రాజు కల్లూరి రాధా పరిస్థితి విషమంగా ఉంది బ్లడ్ వామిటింగ్ కావడంతో తదుపరి వైద్య నిమిత్తం వేరే ఆసుపత్రికి తరలించడం జరుగుతుందని డాక్టర్లు తెలిపారు విద్యుత్ అధికారులకు ఎన్నిసార్లు సమాచారం ఇచ్చిన పట్టించుకోకపోవడం వలనే ఈ సంఘటన జరిగిందని స్థానికులు అంటున్నారు

# గజ్వేల్లో ఎల్నినో ప్రభావంపై విద్యార్థులకు అవగాహన

## తుంకుంట ఆంక్ష రెడ్డి ఆధ్వర్యంలో 3 వేల మంది విద్యార్థులతో భారీ ర్యాలీ

## మహతి ఆడిటోరియంలో నీటి సంరక్షణ, విద్యుత్ పొదుపుపై అవగాహన సభ

**గజ్వేల్ అక్టోబర్ 27మీడియా టూ డే**



భవిష్యత్తులో ఎల్నినో ప్రభావంతో తలెత్తే నీటి ఎద్దడి, విద్యుత్ కొరత వంటి సమస్యలపై ప్రజలకు ముఖ్యంగా విద్యార్థులకు అవగాహన కల్పించాలనే లక్ష్యంతో సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు తుంకుంట ఆంక్ష రెడ్డి ఆధ్వర్యంలో గజ్వేల్లో భారీ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా సుమారు 3 వేల మంది విద్యార్థులతో పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించి అనంతరం మహతి ఆడిటోరియంలో అవగాహన సభ ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా నీటి సంరక్షణ, విద్యుత్ పొదుపు ప్రకృతి వనరుల పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వాతావరణ మార్పులు ఎల్నినో ప్రభావం వంటి సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కోవాలంటే ప్రతి ఒక్కరూ ఇప్పటి నుంచే అప్రమత్తంగా ఉండాలని వక్తలు సూచించారు.నీటి ప్రతి బొట్టూ విలువైనదే.ఈ సందర్భంగా తుంకుంట ఆంక్ష రెడ్డి మాట్లాడుతూ నీటిని పొదుపుగా వినియోగించడం ప్రతి ఒక్కరి బాధ్యతని పేర్కొన్నారు.నీటిని వృథా చేయకుండా అందుబాటులో ఉన్న వనరులను జాగ్రత్తగా వినియోగించాలని సూచించారు. అదేవిధంగా అవసరం లేని సమయంలో విద్యుత్ దీపాలు, ఫ్యాన్లు ఇతర విద్యుత్ పరికరాలను ఆపివేయడం ద్వారా విద్యుత్ను ఆదా చేయవచ్చని వివరించారు. విద్యార్థులు తమ ఇళ్లకే పరిమితం కాకుండా పాఠశాలలు కళాశాలలు పరిసర ప్రాంతాల్లోనూ నీటి సంరక్షణ, విద్యుత్ పొదుపుపై ప్రజలకు అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. నేటి విద్యార్థులే రేపటి పౌరులని, వారిలో పర్యావరణ పరిరక్షణపై బాధ్యతను పెంపొందించడం ద్వారా సమాజంలో సానుకూల మార్పు తీసుకురావచ్చని పేర్కొన్నారు.నీటి సంరక్షణ, విద్యుత్ పొదుపు ప్రభుత్వాల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడి సామాజిక బాధ్యతని వక్తలు స్పష్టం చేశారు. భవిష్యత్తు తరాలకు ప్రకృతి వనరులను అందించాలంటే వాటిని పొదుపుగా వినియోగించాలని సూచించారు.విద్యార్థులకు అధికారుల సూచనలుఈ కార్యక్రమంలో పోలీసు సీఐ రవికుమార్, మున్సిపల్ కమిషనర్ గణేష్ రెడ్డి, వ్యవసాయ ఏఓ నాగరాజు, విద్యుత్ ఏడీ జగదీష్తో పాటు వివిధ కళాశాలల అధ్యాపకులు పాల్గొని విద్యార్థులకు పలు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ లు ప్రజాప్రతినిధులు ప్రజా సంఘాల ప్రతినిధులు, వివిధ కళాశాలల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.నీటిని కాపాడుదాం విద్యుత్ను ఆదా చేద్దాం భవిష్యత్తు తరాలకు సురక్షితమైన పర్యావరణాన్ని అందిద్దాం అనే సందేశంతో ఈ అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

# వరంగల్ -ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల ఓట్ల నమోదు కార్యక్రమం



**అనంతగిరి అక్టోబర్ 27 మీడియా టుడే -:**
కోదాడ మాజీ శాసనసభ్యులు బొల్లం మల్లయ్య యాదవ్ గారి ఆదేశాలకు మేరకుఅనంతగిరి మండలంలోని వాయిల సింగారం,అమీనాబాద్,అనంతగిరి గ్రామాలలో ఈరోజు పట్టభద్రుల ఓట్ల నమోదు కార్యక్రమం నిర్వహించడం జరిగింది.బిఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థిని ఎన్నికల్లో మద్దతు ఇచ్చి భారీ మెజారిటీతో గెలిపించి వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో సత్తాచట్టాలని చెప్పడం జరిగింది.ఈకార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు నల్ల భూపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి గుగులోతు శ్రీనివాస్,పందిరి వీరయ్య,ఐతనబోయిన వెంకటేశ్వర్లు,మాజీ ఎంపీటీసీ సుధాకర్, పూర్ణచందర్ రావు,చార్లెస్, కొత్తపల్లి ఉపేందర్,కంటు శ్రీకాంత్, వెంకటేశ్వర్లు,గురువయ్య,దొంగరి నాగేశ్వరావు,ఆయా గ్రామాల దీ=ూ పార్టీ సీనియర్ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగులను ప్రోత్సహించాలి



**రాయికల్-మీడియా టుడే-అక్టోబర్ 27:**
దివ్యాంగులను వారికి ఇష్టమైన రంగంలో రాణించేలా ప్రోత్సహించాలని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ అన్నారు. రాయికల్ పట్టణంలోని ఉన్నత పాఠశాల ఆవరణలో భవిత కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం దివ్యాంగ పిల్లలకు భవిత కేంద్రం ఆధ్వర్యంలో వివిధ ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దివ్యాంగ పిల్లలను ఓపికగా చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భవిత కేంద్రం శిక్షకులు పెద్దోళ్ళ సృజన, ఉపాధ్యాయులు రాజశేఖర్, చెరుకు మహేశ్వర శర్మ, పుర్రె రమేష్, లక్కాడి రాజరెడ్డి, వేల్పుల గంగారాజం, రవీందర్, తరంగిణి, శోభ, రమ, శాంతయ్య, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



**రాయికల్-మీడియా టుడే-అక్టోబర్ 27:**
రాయికల్ మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం లబ్ధిదారులకు మున్సిపల్ చైర్మన్ కట్కం రవీందర్ స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హులందరికీ ప్రభుత్వ పథకాల అందించాలనే ఉద్దేశంతో క్యూఆర్ కోడ్‌తో కూడిన స్మార్ట్ కార్డులను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. వీటితో ప్రజాపంపిణీ వ్యవస్థలో పారదర్శకత పెరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మనోహర్, తాహసిల్దార్ నాగార్జున, వైస్ చైర్మన్ తురగ సౌజన్య, ఆర్ఐ పద్మయ్య, కౌన్సిలర్లు పల్లికొండ గంగాధర్, పుర్రె శ్రీధర్, కోఆప్షన్ ఇర్ఫాన్, నాయకులు మచ్చ శేఖర్, జిపిఓలు దాస్ కుమార్, రాజేందర్, రేషన్ షాప్ డీలర్లు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలి



**రాయికల్-మీడియా టుడే-అక్టోబర్27:**
రాయికల్ మండలం అల్లీపూర్ రైతువేదికలో మంగళవారం వ్యవసాయ యాంత్రికరణ, ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమాల గురించి దృశ్య శ్రావణ పద్ధతిలో వ్యవసాయ కమిషనర్ గోపి, ప్రిన్సిపల్ సెక్రెటరీ సురేంద్రమోహన్ రైతులకు వివరించారు. వ్యవసాయ యాంత్రికరణ పథకంలో భాగంగా వ్యవసాయ పనిముట్లను సబ్సిడీలో రైతులకు అందజేయాలని ఉద్దేశంతో... విధివిధానాలు సబ్సిడీ ఎంత ఉంటుంది తదితర విషయాలపై రైతులకు వివరించారు. ఖేత్ బచావో అభియాన్ పథకంలో భూములను ఎలా సంరక్షించుకోవాలనే విషయాలపై అవగాహన కల్పించారు. రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి...పశుసంపదతో ఉత్పన్నమైనటువంటి ఎరువు ఉపయోగించాలని...జీలుగు, జానుము వేసుకుంటూ, వరి కొయ్యాలను కాల్చకుండా భూమిలో కలియ దున్నాలని సూచించారు. జిల్లా ఆత్మ డిప్యూటీ ప్రాజెక్టు డైరెక్టర్ సుధాకర్, ఆత్మ జిల్లా కమిటీ చైర్మన్ కాటిపల్లి గంగారెడ్డి, వ్యవసాయ అధికారి శ్రీనివాస్, మండల వ్యవసాధికారి ముక్తేశ్వర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రవీందర్ రావు, సొసైటీ చైర్మన్లు మరిపెల్లి శ్రీనివాస్ గౌడ్, గారు తంగెళ్ల రమేష్ నిమ్మల శేఖర్ రెడ్డి, మల్లారెడ్డి, రాజిరెడ్డి, ఉద్యానవన శాఖ డివిజన్ అధికారి ఐలయ్య, ఏఈవోలు, రైతులు, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# టెండర్ దరఖాస్తుల ఆహ్వానం

**జగిత్యాల-మీడియా టుడే-అక్టోబర్ 27:**
జగిత్యాల జిల్లాలోని 96పాఠశాలల విద్యార్థిని విద్యార్థులకు ఒక్కొక్క పాఠశాలకి 32మంది విద్యార్థులు...ఇందులో 16మంది బాలురు, 16మంది బాలికలతో పాటు ఒక స్కౌట్ మాస్టర్ (పురుష ఉపాధ్యాయులు) మరియు ఒక గైడ్ కెప్టెన్ (మహిళా ఉపాధ్యాయులు)లకు యూనిఫామ్స్, బెల్టు, బ్యాగు అన్నింటికీ కలిపి అరవై ఐదు లక్షల అరవై వేల రూపాయలగా టెండర్ నిర్ణయించారు. 31అక్టోబర్ నుంచి 5నవంబర్ సాయంత్రం 5 గంటల వరకు టెండర్ దరఖాస్తులు స్వీకరించబడునని తెలిపారు. దరఖాస్తు పత్రాలు జిల్లా విద్యాశాఖాధికారి కార్యలయంలో పొందాలని... వివరాలకు 9704224850, 8008570872 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

# డీలర్ల సంక్షేమం బీఆర్ఎస్ హయాంలోనే సాధ్యమైంది

- రేషన్ డీలర్లకు రూ.5,000 గౌరవ వేతనం ఇచ్చే వరకు ఐక్యంగా పోరాడాలి
- క్వింటాలుకు రూ.300 కమిషన్ ఇచ్చేదాకా సర్కార్‌ను వదిలేది లేదు
- మీ పోరాటానికి వెన్నంటే ఉంటాం - మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు



**గజ్వేల్ అక్టోబర్ 27 మీడియా టూ డే**
సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం తెలంగాణ రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గౌరవ వేతన సాధన సభ అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి, పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి తదితరులు విశిష్ట అతిథులుగా పాల్గొన్నారు. రాష్ట్ర నలుమూలల నుంచి రేషన్ డీలర్లు ఈ సభకు భారీ సంఖ్యలో తరలివచ్చారు.ఇదే వేదికపై తెలంగాణ రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన నాయకోటి రాజు వారి కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీష్ రావు మాట్లాడుతూ గత మూడేళ్లుగా గౌరవ వేతనం కోసం రేషన్ డీలర్లు ఆశగా ఎదురుచూస్తున్నా ప్రభుత్వం కనికరించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను నమ్మి డీలర్లు ఆశపడ్డారని కానీ అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ వారిని నిలువునా నట్టేట ముంచిందన్నారు.కాంగ్రెస్ మాయమాటలు నమ్మి డీలర్లే బీఆర్ఎస్ పార్టీని ఓడించుకున్నారని గుర్తుచేశారు. పేదలందరికీ కడుపునిండా అన్నం పెట్టే రేషన్ డీలర్లను నేడు పస్తులుండే పరిస్థితికి ఈ కాంగ్రెస్ సర్కార్ తీసుకువచ్చిందని వారి కోరికలు పూర్తిగా న్యాయబద్ధమైనవని స్పష్టం చేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజా పంపిణీ వ్యవస్థపై గానీ, రేషన్ డీలర్ల సాధకబాధకాలపై గానీ కనీస అవగాహన లేదని విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రేషన్ డీలర్లకు క్వింటాలుకు ఇచ్చే కమిషన్‌ను 70 నుంచి 140 రూపాయలకు పెంచి ఆదుకున్న ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదేనని తెలిపారు. క్వింటాలుకు 300 రూపాయల కమిషన్,అలాగే నెలకు 5,000 రూపాయల గౌరవ వేతనం ప్రభుత్వం మంజూరు చేసే వరకు రేషన్ డీలర్లంతా పార్టీలకు అతీతంగా ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. డీలర్లకు ఇచ్చే కమిషన్, వేతనాలు పెంచని ప్రభుత్వం.. నిత్యావసర సరుకుల ధరలను మాత్రం ఆకాశాన్నంటేలా పెంచి సామాన్యుల నడ్డి విరిచిందని దుయ్యబట్టారు. క్షేత్రస్థాయిలో సరైన ప్రణాళిక లేక ఏకంగా 600 కోట్ల రూపాయల విలువైన బియ్యాన్ని పందికొక్కుల పాలు చేసిన అసమర్థ సర్కార్ కాంగ్రెస్ అని తీవ్రంగా ధ్వజమెత్తారు. రేషన్ డీలర్ల న్యాయమైన హక్కుల సాధన కోసం ఎల్లప్పుడూ అండగా ఉంటామని వారి తరఫున పోరాటాన్ని కొనసాగిస్తామని హరీష్ రావు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ నియోజకవర్గం బి ఆర్ ఎస్ పార్టీ ఇంచార్జి వంటేరు ప్రతాప్ రెడ్డి ప్రజాప్రతినిధులు రాష్ట్ర రేషన్ డీలర్ల సంఘం నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# ఎల్‌నినో ప్రభావంపై ముందస్తు సమీక్ష సమావేశం

**ఎమ్మెల్యే డా.మట్టా రాగమయి దయానంద్**

**నియోజకవర్గం లో అధికారులు, మున్సిపాలిటీ కమిషనర్ల తో చర్చ**



**మీడియా టుడే/ సత్తుపల్లి - అక్టోబర్ 27**
ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ ఆదేశాలు!ప్రపంచవ్యాప్తంగా ఆందోళన కలిగిస్తున్న ఎల్‌నినో ప్రభావం, రానున్న కాలంలో ఎదురయ్యే వాతావరణ మార్పులు, ఎండల తీవ్రత, తాగునీటి కొరత వంటి సమస్యలను దృష్టిలో ఉంచుకుని సత్తుపల్లి నియోజకవర్గ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలనే లక్ష్యంతో సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో ఇరిగేషన్, ఆర్ డబ్ల్యు ఎస్, పంచాయతీరాజ్, మిషన్ భగీరథ శాఖల అధికారులు, నియోజకవర్గంలోని ఐదు మండలాల ఎంపీడీవోలు, సత్తుపల్లి, కల్లూరు మున్సిపాలిటీల కమిషనర్లతో సమగ్రంగా చర్చించారు. ముఖ్యంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరా పరిస్థితి, నీటి వనరుల లభ్యత, చెరువులు, కాలువల పరిస్థితి, ప్రత్యామ్నాయ నీటి వనరుల వినియోగం వంటి అంశాలపై సమీక్షించి, ప్రజలకు తాగునీటి సమస్యలు తలెత్తకుండా అవసరమైన ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు.వేసవిలో నీటి ఎద్దడి ఏర్పడే అవకాశాలను ముందుగానే గుర్తించి, అవసరమైన ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని, తాగునీటి సరఫరాలో అంతరాయాలు కలగకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ సూచించారు. గ్రామాలు, పట్టణాల్లో ప్రజలకు అత్యవసర సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని, సమస్యలు తలెత్తిన వెంటనే స్పందించి పరిష్కరించే విధంగా కార్యాచరణ రూపొందించుకోవాలని ఆదేశించారు.ప్రజలకు సమస్య వచ్చిన తర్వాత స్పందించడం కంటే సమస్య రాకముందే అప్రమత్తమై పరిష్కార మార్గాలను సిద్ధం చేసుకోవడమే ప్రభుత్వ లక్ష్యం అనే దృక్పథంతో అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. ప్రజల అవసరాలను ప్రాధాన్యంగా తీసుకుని, తాగునీటి సరఫరాతో పాటు ఇతర అత్యవసర సదుపాయాల విషయంలోనూ నిరంతర పర్యవేక్షణ ఉండాలని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఐదు మండలాల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, సత్తుపల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాదె చెన్నారావు, సత్తుపల్లి మున్సిపల్ చైర్మన్ రెహనా కమల్ పాషా , కల్లూరు మున్సిపల్ చైర్మన్ మోహన్ నాయక్ , ప్రజాప్రతినిధులు, సీనియర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు చల్లగుళ్ల నరసింహారావు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్లు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఎన్ హెచ్ ఎం డాక్టర్స్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

**బిఎస్పీ పార్టీ డిమాండ్.**

**మీడియా టుడే నాగర్ కర్నూల్ జిల్లా ప్రతినిధి (అక్టోబర్ 27):**
నాగర్ కర్నూలు జిల్లాలోని ముగ్గురు డాక్టర్ ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని ఎన్ హెచ్ ఎం డాక్టర్స్ మరియు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని బిఎస్పి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పృథ్వీరాజ్ నాగర్ కర్నూలు జిల్లా అధ్యక్షులు బోనాసి రామచందర్ అడ్వకేట్ బిజినపల్లి మండల అధ్యక్షులు పానుగంటి రామచందర్ బిఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ లో డిమాండ్ చేశారు. ఎన్ హెచ్ ఉద్యోగుల సమ్మెకు సంఘీభావం ప్రకటించి పార్టీ తరఫున రూ.5,000/-ల విరాళం అందజేశారు.కర్నూల్ జిల్లా కలెక్టరేట్ ఎదుట చేపట్టిన సమ్మెకు బహుజన్ సమాజ్ పార్టీ(బి .ఎస్.పి) ఈ సందర్భంగా బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పృథ్వీరాజ్, నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షులు బోనాసి రాంచందర్ అడ్వకేట్, బిజినపల్లి మండల అధ్యక్షులు పానుగంటి రాంచందర్, బీఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ నాగర్ కర్నూల్ జిల్లాకు చెందిన ముగ్గురు ప్రజాప్రతినిధులు వైద్య వృత్తికి చెందినవారేనని గుర్తుచేశారు. ప్రస్తుత నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు మరియు అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ గారు, నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి గార్లు చొరవ తీసుకుని, ఎన్హెచ్ఎం ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ముగ్గురు ప్రజాప్రతినిధులు సమన్వయంతో కృషి చేసి, ముఖ్యంగా ఎన్హెచ్ఎం ఉద్యోగుల ఉద్యోగ భద్రత, వేతనాలు, మహిళా ఉద్యోగుల ప్రసూతి సెలవులు తదితర సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. దేశంలోని ఏడు రాష్ట్రాల్లో ఎన్హెచ్ఎం ఉద్యోగులు రెగ్యులర్ ఉద్యోగులుగా పనిచేస్తున్నారని నాయకులు పేర్కొన్నారు. అలాంటప్పుడు తెలంగాణలో పనిచేస్తున్న ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం ఎందుకు పరిష్కరించడం లేదని ప్రశ్నించారు. మహిళా ఉద్యోగులకు ప్రసూతి సెలవులు కల్పించకపోవడం పట్ల వారు తీవ్రంగా మండిపడ్డారు. ప్రస్తుత పరిస్థితుల్లో నెలకు కేవలం రూ.7,000 వేతనంతో ఉద్యోగుల చేత పనిచేయించుకోవడం దుర్మార్గమని విమర్శించారు. సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలనీ డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు వెలువరించిన సమాన పనికి సమాన వేతనం అనే సూత్రానికి అనుగుణంగా ఉద్యోగులకు న్యాయం జరిగేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని నాయకులు అన్నారు. అయితే, ఆచరణలో ఈ సూత్రం అమలుకు నోచుకోవడం లేదని విమర్శించారు. ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించి, వారికి తగిన వేతనాలు, ఉద్యోగ భద్రత, మహిళా ఉద్యోగులకు చట్టబద్ధమైన సెలవులు కల్పించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వంతో పాటు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కూడా ఎన్ హెచ్ ఎం సమస్యల పరిష్కారానికి బాధ్యత తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల న్యాయమైన పోరాటానికి బహుజన్ సమాజ్ పార్టీ పూర్తి మద్దతుగా నిలుస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ అసెంబ్లీ నాయకులు కాకునూరి మధు తదితరులు పాల్గొన్నారు.



# రోడ్డు విస్తరణకు మోక్షం ఎప్పుడు...?

**మెలికలు తిరిగిన రోడ్డుతో ప్రమాదాలకు ఆస్కారం**

**గొల్లపల్లి క్రాస్ రోడ్డు వద్ద తరచూ ట్రాఫిక్ సమస్యలు. - స్థానిక ఎమ్మెల్యే ప్రజా ప్రతినిధులు దీనిపై దృష్టిసారించాలి**







**జగిత్యాల మీడియా టుడే-అక్టోబర్ 27**
జగిత్యాల పట్టణంలో విపరీతంగా రద్దీ పెరుగుతున్న నేపథ్యంలో రోడ్లపై ట్రాఫిక్ భారీగా ఉంటుంది.. కొన్ని సందర్భాలలో యాక్సిడెంట్స్ కూడా జరుగుతున్నాయి. ముఖ్యంగా కొత్త బస్టాండ్ నుండి పాత బస్టాండ్ వరకు వెళ్లే దారి అంతా కూడా ఎప్పుడు చూసినా నిత్యం రద్దీగా ఉంటుంది.. దానికి ప్రత్యామ్నాయంగా గతంలోనే జగిత్యాల పట్టణంలోని చిన్న కెనాల్ చౌరస్తా నుండి గొల్లపల్లి క్రాస్ రోడ్ వరకు బైపాస్ రోడ్డు నిర్మాణం జరిగింది. అందువల్ల కొంతలో కొంత ట్రాఫిక్ సమస్యలు తగ్గిపోయాయని చెప్పవచ్చు.. అయినా కూడా గొల్లపల్లి క్రాస్ రోడ్ నుండి తిప్పన్నపేట చౌరస్తా వరకు ఉన్న రోడ్డు విస్తరణ పనులు ఇంకా ప్రారంభించలేదు.. గతంలో గొల్లపల్లి క్రాస్ రోడ్డు వరకు మాత్రమే విస్తరించడం అప్పటి రద్దీ దృష్ట్యా అధికారులకు మరియు ప్రజాప్రతినిధులకు అది సరైన నిర్ణయమే... కానీ ప్రస్తుతం గొల్లపల్లి క్రాస్ రోడ్ నుండి ఉన్న మిగతా రాజీవ్ బైపాస్ రోడ్డు అనేక మలుపులు తిరిగి ఉన్న ఆ రోడ్డు నిత్యం రద్దీగా ఉండటమే కాకుండా తరచూ ప్రమాదాలకు నిలయంగా మారుతుంది... ఆ రోడ్డు వెంటే ప్రవేట్ పాఠశాలలు, ఆసుపత్రి సముదాయాలు, ఒక బార్ అండ్ రెస్టారెంట్ మరియు వాణిజ్య సముదాయాలు నెలకొని ఉన్నాయి.. అందువలన రాను రాను ఆ రోడ్డు జనాలతో రద్దీ గా ఉంటుంది.. దానికి తోడు రోడ్డు పూర్తిగా మలుపులు తిరిగి ఉండటం వలన దగ్గరికి వచ్చే వరకు కూడా ఎవరికి ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడం వలన ప్రమాదాలు జరిగే ఆస్కారం ఎక్కువగా ఉంది..

### మెలికలు తిరిగిన రోడ్డు....?

ఈ రోడ్డు అంతా కూడా మెలికలు తిరిగి ఉండటం వలన చాలా దగ్గరికి వచ్చే వరకు కూడా భారీ వాహనాలు కనబడే ఆస్కారం లేదు. కొంచెం వేగంగా ఉన్న ఎదురుగా వచ్చే వాహనాలు ఢీకొనే అవకాశం ఉంది.. అంతేకాకుండా రెండు పెద్ద వాహనాలు ఒకేసారి ఆ రోడ్డుపై ఎదురెదురు పడితే మెలికలు తిరిగి ఉండటం వలన వాహనాలు ముందుకెళ్లడం కష్టంగా ఉంది..

### గొల్లపల్లి క్రాస్ రోడ్ వద్ద తరచు ట్రాఫిక్ సమస్యలు..

దాదాపు మూడు పాఠశాలలు ఈ రోడ్డుని అనుకొని ఉండటం వలన మరియు భారీ వాహనాలు ఈ రోడ్డు వెంటే ధర్మపురివైపు ప్రయాణించడం వలన గొల్లపల్లి క్రాస్ రోడ్ చౌరస్తా వద్ద ఎప్పుడు చూసినా ట్రాఫిక్ ఎక్కువగా ఉంటుంది..

### ఆ రోడ్డు విస్తరణలో జాప్యం ఎందుకు..?

గొల్లపల్లి క్రాస్ రోడ్ నుండి తిప్పనపేట చౌరస్తా వరకు ఉన్న మిగతా రాజీవ్ బైపాస్ రోడ్ విస్తరణకు ఎలాంటి అడ్డంకులు కూడా లేకపోవడం ఇక్కడ గమనించాల్సిన అంశం.. ఎందుకంటే ఆ రోడ్డు వెంట విస్తరిస్తున్న కాలనీ అంతా కూడా ఎప్పటికైనా రోడ్డు విస్తరణ కచ్చితంగా జరుగుతుందని భావించి సెట్ బ్యాక్ అయి ఇళ్ల నిర్మాణం చేపట్టారు.. ఎలాంటి నష్టపరిహారాలు కానీ భూసేకరణ సంబంధిత సమస్యలు కానీ ఉత్పన్నమయ్యే అవకాశం చాలా తక్కువ..

### ప్రజా ప్రతినిధులు దీనిపై దృష్టిసారించాలి..

జగిత్యాల పట్టణానికి నలువైపులా కొత్త రోడ్ల విస్తరణ పనులు జరుగుతున్న నేపథ్యంలో ఈ రోడ్డు విస్తరణ పై స్థానిక ఎమ్మెల్యే మరియు ఇతర ప్రజాప్రతినిధులు దృష్టిసరించి రోడ్డు విస్తరణ చేసినట్లయితే పట్టణంలోని ట్రాఫిక్ సమస్యలు పూర్తిగా తగ్గిపోవడమే కాకుండా భారీ వాహనాలు వెళ్లేందుకు చాలా అనుకూలంగా ఉంటుంది.. కావున వెంటనే ఈ రోడ్డు విస్తరణ పనులు మొదలుపెట్టాలని స్థానిక కాలనీ వాసులు మరియు పట్టణ ప్రజలు కోరుతున్నారు